ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM
తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
రాజమహేంద్రవరం
fb.com/vaartha Digital

ఎయిర్ ఇండియా ప్రమాదంపై ప్రాధమిక నివేదిక సమర్పణ
రాముడు, శివుడు మావాళ్లే: నేపాల్ ప్రధాని
5లో

Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
9-7-2025 బుధవారం సంపుటి: 31 సంచిక: 158 పేజీలు: 12 వెల: 6.50

## అమరావతిలో..
# మరో 6 నెలల్లోనే క్వాంటమ్ వ్యాలీ
### ఎపిలో పెట్టుబడులకు ఇదే సరైన సమయం: మంత్రి లోకేష్


మంగళవారం బెంగళూరులో జిసిసి గ్లోబల్ లీడర్లతో మంత్రి లోకేష్ సమావేశం దృశ్యం

**విజయవాడ, జులై8,ప్రభాతవార్తప్రతినిధి:** ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, క్వాంటమ్ టెక్నాలజీ వంటి అధునాతన సాంకేతిక రంగాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఆంధ్రప్రదేశ్‌లో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లపై పెట్టుబడులు పెట్టాల్సిందిగా ఎపి ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పిలుపునిచ్చారు. దేశంలో పేరెన్నిగన్న దిగ్గజ జిసిసి సంస్థల ప్రతినిధులతో కలిసి మంత్రి లోకేష్ బెంగుళూరు మాన్యత ఎంబసీ బిజినెస్ పార్కులో రోడ్ షో నిర్వహించారు.అనంతరం వారితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... ఇప్పుడు ప్రపంచం మొత్తం ఆంధ్రప్రదేశ్ >>2

# జల్‌జీవన్ మిషన్‌కు కార్పొరేషన్ ఏర్పాటు

**విజయవాడ జులై 8 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో జల్‌జీవన్‌మిషన్ పనులు అమలుకు ఎపి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మిషన్ రాష్ట్ర వాటా నిధులను సమకూర్చేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నది. జల్‌జీవన్ మిషన్ పనులకు రాష్ట్ర వాటా నిధుల సమీకరణ కీలకం కానున్నది.ఈ నిధుల కోసం ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేయనున్నారు. తద్వారా కొన్ని జాతీయ బ్యాంకుల కన్సార్షియం నుంచి రూ.11 వేల కోట్ల రుణాన్ని ప్రభుత్వం సేకరించనుంది. గ్రామీణాభివృద్ధి శాఖాధికారులు అందించిన సమాచారాన్ని అందుకు సంబంధించిన ప్రతిపాదనలను బుధవారం జరగనున్న మంత్రివర్గ సమావేశంలో ఆమోదం కోసం పెట్టనున్నారు. కూటమి ప్రభుత్వం >>2


మంగళవారం శ్రీశైలం నాలుగు క్రస్ట్‌గేట్లను తెరచి జలహారతి ఇస్తున్న సిఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రి నిమ్మల తదితరులు

# శ్రీశైలం క్రస్ట్‌గేట్లు తెరచిన సిఎం


నాలుగు గేట్లనుంచి విడుదలవుతున్న కృష్ణా జలాలు

### నాలుగు గేట్ల నుంచి దిగువ సాగర్‌కు నీటి విడుదల
### కృష్ణమ్మకు జలహారతులిచ్చిన సిఎం చంద్రబాబు
### సుండిపెంట ప్రజావేదికలో రైతులనుద్దేశించి మాట్లాడిన ముఖ్యమంత్రి

**నంద్యాల,జులై 8,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపి ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు మంగళవారం శ్రీశైలం నాలుగు రెడియల్ క్రస్ట్‌గేట్లను తెరచి దిగువ సాగర్‌కు నీటిని విడుదల చేయడం జరిగింది. ముందుగా ముఖ్యమంత్రి హెలిక్యాప్టర్ ద్వారా సుండిపెంట హెలిప్యాడ్ గ్రౌండ్‌కు 12గంటల సమయంకు చేరుకున్నారు.అక్కడ ఏపి భారీనీటిపారుదలశాఖ మంత్రి నిమ్మలరామనాయుడు,బిసి జనార్ధన్‌రెడ్డి,ఫరూక్,ఎంపి బైరెడ్డి శబారి,శ్రీశైలం నియేజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, కొట్ల సుజాతమ్మ, నందికోట్కురు ఎమ్మెల్యే గిత్తాజయసూర్య, భూమ అఖిలప్రియ, >>2

## అమరావతి నిర్మాణాల్లో
# జాప్యాన్ని సహించం
### 72 సంస్థలకు 947 ఎకరాలు కేటాయింపు
### స్కూళ్లు, బ్యాంక్‌లు, వర్శిటీలు, హోటళ్లు, హెల్త్‌కేర్ సంస్థలు, ఐటి పార్క్‌లు ఏర్పాటు
### ప్రతి ఇంట్లో ఒక ఐటి నిపుణుడు ఉండాలి: సిఎం చంద్రబాబు

**విజయవాడ,జులై8,ప్రభాతవార్తప్రతినిధి:** సంపద సృష్టి తద్వారా ఆర్థికంగా రాష్ట్రాభ్యున్నతికి సాధ్యమని సిఎం చంద్రబాబునాయుడు అన్నారు. రాజధాని అమరావతిలో ప్రైవేటు, ప్రభుత్వ సంస్థల నిర్మాణాలపై సిఎం చంద్రబాబు కీలక సమీక్ష మంగళవారం సాయంత్రం నిర్వహించారు. సిఆర్డీఏ పరిధిలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను నిర్దిష్ట వ్యవధిలో పూర్తి చేసుకుందామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజధానిలో వ్యాపార సంస్థలు, విద్యా సంస్థలు, హోటళ్లు, కార్యాలయాలు, వివిధ ప్రాజెక్టుల కోసం కేటాయించినస్థలాల్లో ప్రస్తుత పరిస్థితిపై అధికారులు ఎవరు ఏ సమయంలో తమ నిర్మాణాలు మొదలు పెడతారు..ఎప్పటికి పూర్తి చేస్తారనే అంశంలో నేరుగా ఆయా సంస్థల యజమానులతో చంద్రబాబు మాట్లాడారు. తక్షణం పనులు ప్రారంభించి పూర్తి చేయాలన్నారు.మరో మూడేళ్లలో రాజధానిని అద్భుతంగా తీర్చిదిద్దాలన్న తమ లక్ష్యానికి అనుగుణంగా నిర్మాణ పనులు జరిగిపోవాలన్నారు.ఇప్పటి వరకు రాజధానిలో 72 సంస్థలకు 947 ఎకరాలు కేటాయించి సిఆర్డీయే స్థలాలు పొందిన వారిలో స్కూళ్లు, బ్యాంకులు, యూనివర్సిటీలు, హోటళ్లు, హెల్త్ కేర్ సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, మతసంస్థలు, ఐటీ, టెక్ పార్కులు అనుమతుల విషయంలో ఎక్కడా జాప్యం ఉండదని...జాప్యం ఉంటే >>2


మంగళవారం కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు విజ్ఞాపన పత్రం అందజేస్తున్న రాష్ట్ర వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు, కేంద్రమంత్రి కింజరపు రామ్మోహననాయుడు

## తోతాపురి మామిడి రైతుకు
# చేయూత ఇవ్వండి
### కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను కోరిన మంత్రి అచ్చెన్నాయుడు

**విజయవాడ,జులై8,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపిలో తోతాపురి రైతులకు పూర్తి స్థాయిలో అండగా నిలవాలని ఎపి వ్యవసాయశాఖా మంత్రి మంత్రి అచ్చెన్నాయుడు కోరారు. ఢిల్లీలోని కేంద్ర మంత్రి కార్యాలయంలో మంత్రి అచ్చెన్నాయుడు కేంద్ర మంత్రి చౌహాన్‌తో మంగళవారం మరోపర్యాయం కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుతో కలసి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తోతాపురి మామిడి రైతులకు 12రూ. మద్దతు ధర అందచేశామన్నారు. మామిడి రైతుల కోసం మార్కెట్ మద్దతు కింద రూ.260 కోట్లు ఆర్థిక సాయం అందచేయమని శివరాజ్‌సింగ్‌ను వారు కోరారు. వెనుకబడిన జిల్లాలకోసం మైక్రో ఇరిగేషన్ పథకానికి రాయితీ పెంచాలని విజ్ఞప్తి చేసారు.విభజన చట్టం ప్రకారం శ్రీకాకుళం జిల్లాలో కేంద్ర అగ్రికల్చర్ విశ్వవిద్యాలయం ఏర్పాటు >>2

# మతమార్పిడి కట్టడికి శ్రీవారి 'పుస్తకప్రసాదం'!



### దళితవాడలు, ఏజెన్సీప్రాంతాల్లో ఉచిత పంపిణీకి టిటిడి కార్యాచరణ

**తిరుమల, జులై 8ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగురాష్ట్రాల్లో మతమార్పిడులను సమూలంగా అరికట్టి, సనాతన ధర్మం వైభవం,విశిష్టతపై అవగాహన కలిగించేందుకు హిందూ ధార్మికసంస్థ తిరుమల తిరుపతి దేవస్థానం వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రజల్లో హిందూ మతంపై విశ్వాసం, హిందూ ధర్మంపై నమ్మకం కలిగించేలా టిటిడి పుస్తకప్రసాదం పంపిణీకి శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలోని దళితవాడలు, మారుమూల గ్రామాలు,ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లోని ప్రజలకు ఉచితంగా పుస్తకాల పంపిణీ చేపట్టేందుకు కార్యాచరణ రూపొందించారు. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత సిఎం చంద్రబాబునాయుడు హిందూ ధర్మం,హింధూ మతం పరిరక్షణకు టిటిడి మరింత దృష్టి సారించాలని సూచించారు. ఇప్పటికే టిటిడి పాలకమండలి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఇఒ జె.శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ఆ దిశగా అడుగులేస్తున్నారు. పుస్తకప్రసాదం కార్యక్రమంతో మతమార్పిడులకు అడ్డుకట్టవేయొచ్చని ఆలోచన చేశారు. టిటిడి హిందూ ధర్మప్రచారపరిషత్ విభాగాన్ని భాగస్వామ్యం చేస్తూ హిందూ మతం వ్యాప్తి, మతం గురించి మరింతగా విశ్వాసం కలిగించేలా పుస్తకాలను ముద్రించి పంపిణీ చేయనున్నారు. దేశంనలుమూలల నుండేగాక విదేశాల నుండి ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనానికి వస్తున్న భక్తులకు తిరుమలలో వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని కంపార్టుమెంట్లలో ఈ పుస్తకాలను వితరణ చేసేందుకు నిర్ణయించారు. ఈ పుస్తకాలను టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడుకు టిటిడి అధికారులు అందజేశారు. రాష్ట్రంలో మతమార్పిడులను పూర్తిగా అరికట్టాలనే లక్ష్యంగా టిటిడి తమవంతు భాగస్వామ్యం అయ్యి ముందుకు కదులుతోంది.

**హిందూమతంపై విశ్వాసం కలిగించేలా:** దేవదేవుడు ఏడుకొండల శ్రీవేంకటేశ్వరస్వామి వైభవాన్ని విస్తృతంగా ప్రచారం చేయడంతోబాటు హిందూ మతంనుండి అన్యమతంలోనికి జరుగుతున్న మత మార్పిడులను అరికట్టడానికి టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు సూచనలతో టిటిడి పుస్తకప్రసాదం అనే కార్యక్రమం ప్రవేశపెట్టింది. ప్రధానంగా దళితవాడలు, మారుమూల గ్రామాలు, ఏజెన్సీ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు మన >>2


మంగళవారం మాజీ సిఎం జగన్ మోహన్ రెడ్డికి సమస్యలు వివరిస్తున్న దృశ్యం

# అధైర్య పడొద్దు.. అండగా నేనున్నా
### మళ్లీ వచ్చేది మన ప్రభుత్వమే: 'ప్రజాదర్బార్'లో మాజీ సిఎం జగన్

**పులివెందుల,జులై 8, ప్రభాతవార్త:** అధైర్య పడకండి మీకు నేను ఎల్లప్పుడూ అండగా ఉంటాననీ, ఏ అన్యాయం జరిగిన న్యాయ పోరాటం చేయ ఎదుర్కొందాం అని మీకు సమస్య అంటే మీ సమస్య ముందు నేను ఉంటానని,మీ సమస్యలు ఎప్పుడైనా నాతో చెప్పాలనీ మళ్లీ వచ్చేది మన ప్రభుత్వం అని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్సీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రజా దర్బారులో వైఎస్సార్సీ శ్రేణులతో అన్నారు. జిల్లా రెండు రోజుల పర్యటనలో భాగంగా మంగళవారం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ఉదయం ఇడుపుల పాయలోని వ్యవసాయ క్షేత్రంలోనీ వైయస్సార్ సమాధి వద్ద తల్లి వైయస్ విజయమ్మ, వైయస్ భారతి మరియు కుటుంబ సభ్యులతో కలిసి నివాళాలు అర్పించారు. అనంతరం పులివెందుల లోని వైయస్ జగన్ క్యాంప్ కార్యాలయంకు చేరుకొని ప్రజా దర్బార్‌లో పాల్గొన్నారు.
ఈ సందర్భంగా వైఎస్సార్సీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు ఆయనని కలిసి సమస్యలను ఆయన దృష్టికి తీసుకు వెళ్లారు.దీనికి ఆయన స్పందిస్తూ ప్రతి ఒక్కరికి న్యాయం జరిగే వరకు మీ కోసం పోరాటం చేసేదానికి సిద్ధంగా ఉన్నానని వారికి భరోసా ఇచ్చారు. ఇకపై ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉంటానని ప్రజల్లోనే తిరుగుతూ ప్రభుత్వం చేసే ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం సాగిస్తామని తెలిపారు.
చక్రాయపేట మండలంలోని గండి క్షేత్రం >>2


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

# ప్రాణాలు తీసిన నిద్ర మత్తు!
### కారు బోల్తా.. ముగ్గురి మృతి
### ఉరవకొండ మండలంలో దుర్ఘటన

**ఉరవకొండ, జులై 8 ప్రభాతవార్త:** అతివేగం, నిద్రమత్తు వారి ప్రాణాలు తీసింది. అనంతపురం జిల్లా ఉరవకొండ మండలం బూదగవి గ్రామంవద్ద అనంతపురం-బళ్లారి 42వ నంబర్ జాతీయ రహదారిలో మంగళవారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు బోల్తాపడగా అందులో ప్రయాణిస్తున్న ముగ్గురు 30 సంవత్సరాల వయసులోపు గలవారు అక్కడికక్కడే మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. వారు మహారాష్ట్ర అహ్మద్ నగర్ జిల్లా శివగావ్‌కు చెందిన వారుకాగా తిరుమలలో వెంకటేశ్వరస్వామిను దర్శించుకొని తిరిగి వెళుతున్న సమయంలో ఈ హృదయ విదారక ఘటన చోటు చేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి పోలీసుల ద్వారా తెలిసిన మేరకు మహారాష్ట్రలోని అహ్మద్‌నగర్ జిల్లా శివగావ్ గ్రామానికి చెందిన నలుగురు మిత్రులు సౌరబ్ విష్ణు, తుషార్ సునీల్, కార్తీక్ శ్రీకర్, సుమిత్ సునీల్ తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామిని దర్శించుకొని అక్కడి నుండి >>2

## ప్రధానిమోడీకి బ్రెజిల్
# అత్యున్నత పురస్కారం



### 'గ్రాండ్‌కాలర్ ఆఫ్‌ది నేషనల్ ఆర్డర్ ఆఫ్‌ది సదరన్ క్రాస్' ప్రదానం చేసిన అధ్యక్షుడు లులా డీసిల్వా

**రియోడీజెనీరో, జులై 8:** భారత ప్రధాని నరేంద్రమోడీని బ్రెజిల్ దేశపు అత్యున్నత పౌరపురస్కారంతో సత్కరించింది. 'గ్రాండ్‌కాలర్ ఆఫ్‌ది నేషనల్ ఆర్డర్ ఆఫ్‌ది సదరన్‌క్రాస్' పురస్కారంతోబ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లులా డిసిల్వా సత్కరించారు. భారత్‌బ్రెజిల్‌ల మధ్య ఉన్న ద్వైపాక్షిక సంబంధాలను మరింత పటిష్టపరిచేందుకు ప్రధానిమోడీ చేసిన కృషికి గుర్తింపుగా ఈ పురస్కారం ప్రదానంచేసింది. తనకు లభించిన ఈపురస్కారంపై ప్రధాని మోడీ మాట్లాడుతూ బ్రెజిల్‌ప్రభుత్వం తమ దేశ అత్యున్నత పురస్కారాన్ని ప్రధానం చేసిందని, 140కోట్లమంది భారతీయులతరపున ఈ పురస్కారాన్ని స్వీకరిస్తున్నట్లు ప్రధాని అన్నారు. బ్రెజిల్ అధ్యక్షుడు, బ్రెజిల్ ప్రభుత్వం, బ్రెజిల్‌దేశ ప్రజలకు ఈసందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. 2014లో బాధ్యతలు స్వీకరించిన తర్వాత ప్రధానిమోడీకి బ్రెజిల్ పురస్కారం 26వది కావడం గమనార్హం. బ్రెజిల్‌లో ఈపురస్కారాన్ని 1822లో ఆనాటి చక్రవర్తి పెడ్రో-1 ఏర్పాటుచేసారు. నేషనల్ ఆర్డర్ ఆఫ్‌ది సదరన్‌క్రాస్‌పేరిట బ్రెజిల్‌లో అత్యున్నత పురస్కారంగా ఇప్పటికీ ప్రముఖులకు అందచేస్తుంటారు. గ్రాండ్‌కాలర్ బ్రెజిల్‌లో అత్యున్నత స్థాయి పురస్కారం. గతంలో అమెరికా అధ్యక్షుడు డ్వైట్ డి ఈషెన్‌హోవర్, క్వీన్ ఎలిజబెత్-2, పోప్‌జాన్‌పాల్-2, మాజీ ఫ్రెంచ్ అధ్యక్షుడు ఛార్లెస్ డి గాల్లే, అర్జంటీనా అధ్యక్షుడు జువాన్ పెరాన్, వెనిజులా మాజీ అధ్యక్షుడు హుగోచావెజ్, స్పానిష్ మాజీ రాజు జువాన్ కార్లోస్-1, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్‌పుతిన్ వంటివారికి బ్రెజిల్ ప్రభుత్వం ఈ గ్రాండ్ ఆనర్‌ను ప్రధానంచేసింది.

## రొట్టెల పండుగకు
# 4 లక్షల మంది రాక
### ఎండలోనూ తగ్గని భక్తుల రద్దీ



**నెల్లూరు కలెక్టరేట్, జులై 8, ప్రభతవార్త:** నెల్లూరు బారాషహీద్ దర్గాలో రొట్టెల పండుగకు మూడో రోజు భక్తులు పోటెత్తారు. మంగళవారం సుమారు నాలుగులక్షల మందికి పైగా భక్తులు దర్గాను దర్శించుకున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఎండ బాగా వున్నప్పటికీ భక్తుల రద్దీ కొనసాగింది. ఇప్పటివరకు 10 లక్షలకు పైగా భక్తులు రొట్టెల పండుగకు విచ్చేసినట్లు అధికారులు అంచనా వేశారు. దేశం నలుమూలల నుంచి విచ్చేసిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా జిల్లా కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణ కాంత్, మున్సిపల్ కమిషనర్ నందన్ ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ అన్ని చర్యలు చేపట్టడంతో భక్తులందరూ సజావుగా దర్గాను దర్శించుకుని, రొట్టెలు మార్చుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని శాఖల >>2



గేట్లు తెరచిన సందర్భంగా కృష్ణమ్మకు సారె ఇస్తున్న సిఎం చంద్రబాబు



శ్రీశైలం ఆలయ ధ్వజస్తంభం వద్ద మొక్కుతున్న సిఎం చంద్రబాబు

# శ్రీశైలం క్రస్ట్‌గేట్లు తెరచిన సిఎం

>> నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి ఘనియా,జాయింటు కలెక్టర్ విష్ణుచరణ్,ఎస్పి ఆధిరాజ్ సింగ్ రాణా,తదితరులు పుష్పగుచ్ఛం అందజేసి సాదర స్వాగతం పలికారు.అనంతరం అక్కడి నుండి రోడ్డు మార్గాన శ్రీశైలం మల్లన్న ఆలయంకు 12.40 నిమిషములకు చేరుకొనగా ఆలయ రాజగోపురం వద్ద దేవదాయశాఖ సెక్రటరీ వినయ్‌చంద్,కమీషనర్ రామచ ంద్రమొహన్, శ్రీశైల దేవస్థానం ఇఒ ఎం.శ్రీనివాసరావు, అర్చకస్వా ములు ముఖ్యమంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు అనంతరం సిఎం ప్రత్యేక పూజలు చేసుకున్నారు. అనంతరం అక్కడి నుండి రోడ్డు మార్గంన మధ్యాహ్నం 2.10నిమిషములకు శ్రీశైలం జలాశయంకు చేరుకొన్నారు. అక్కడ జలాశయంఇంజనీర్లతో,రైతులతో ముచ్చటించారు. తదుపరి అక్కడ ఏర్పాటు చేసిన డ్యాం పోటో ఎగ్జిబిషన్ ప్రదర్శన,రాయలసీమ ప్రాజెక్టుల స్కీమాటిక్ రేఖాచిత్రం మ్యాపును తిలకించి డ్యాం ఎస్ఇ శ్రీరామచ ంద్రమూర్తిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్కడ డ్యాంపైన గంగమ్మ తల్లికి వేదమంత్రోచ్ఛారణల నడుమ పూజలందించి సంప్రదాయబద్ధంగా కొబ్బరికాయలు కొట్టి జలహారతులు అందించారు.అనంతరం గంగమ్మకు సారె,రవిక, పసుపు,గాజులు, కుంకుమ, పూలు తదితర వాటితో డ్యాంకు ఇరు వైపుల గంగమ్మకు వాయనం అందించారు. అనంతరం జలాశయం స్థితిగతులపై ఇంజనీర్లుతో సమీక్షించి పలుసూచనలు చేసారు. తదుపరి శ్రీశైలండ్యాం నాలుగు రెడియల్ క్రస్ట్‌గేట్ల 6,7, 8,11 నెంబర్లు గల క్రస్ట్‌గేట్లను 10 అడుగుల ఎత్తుమేరకు తేరచి దిగువ సాగర్‌కు నీటిని విడుదల చేయడం జరిగింది.తదుపరి అక్కడి నుండి సుండిపెంటలో ఏర్పాటు చేసిన ప్రజావేదిక వద్దకు చేరుకోని జలహారతి విషయంపై రైతులతో, స్థానికులతో సమావేశంలో మాట్లాడారు.ముగింపు అనంతరం తిరుగుపయానం అయ్యారు.

## శ్రీశైలం మల్లన్నను దర్శించిన సిఎం

**శ్రీశైలంప్రాజెక్టు,జులై 8,ప్రభాతవార్త:** అష్టదశ శక్తిపీఠం ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైలక్షేత్రంను మంగళవారం సిఎం చంద్రబాబు నాయుడు శ్రీస్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. ముందుగా ఆయన హెలి క్యాప్టర్‌లో సుండిపెంట హెలిప్యాడ్ గ్రౌండ్‌కు చేరుకున్నారు. అక్కడ బారినీటిపారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు,బి.సి జనార్ధన్‌రెడ్డి, ఎన్ఎండి ఫరూక్,ఎంపి బైరెడ్డి శబారి,శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డారాజశేఖర్‌రెడ్డి, నంద్యాల జిల్లా కలెక్టర్ రాజాకుమారి ఘనియా,దేవదాయశాఖ సేక్రటరి వినయ్‌చంద్, కమిషనర్ రామచంద్రమోహన్,జిల్లా ఎస్పి ఆధిరాజ్‌సింగ్ రాణా, జెసి విష్ణుచరణ్,తదితరులు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.తదుపరి అక్కడి నుండి రోడ్డు మార్గం గుండా శ్రీశైలం మల్లన్న ఆలయం వద్దకు 12.40గంటలకు చేరుకున్నారు. అక్కడ రాష్ట్ర ముఖ్య మంత్రికి ఆలయ సంప్రదాయంను అనుసరించి ఆలయ ఇఒ ఎం.శ్రీనివాసరావు సాదర స్వాగతం పలికారు.తదుపరి అర్చకస్వాములు పూర్ణకుంభంతో,వేదమంత్రాలతో స్వామివారి దర్శనార్ధం ఆలయంలోకి తీసుకుపోయారు. ఆలయంలోని ప్రధమంగా రత్నగర్భగణపతిని ముఖ్య మంత్రి దర్శించుకున్నారు. తదుపరి శ్రీశైల మల్లికార్జునస్వామిని, భ్రమరాంబాదేవిని దర్శించుకోని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఈక్రమంలోనే ఆలయంలోని రుద్రహోమం, పూర్ణహుతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు.అనంతరం అమ్మవారి ఆలయ ప్రాకార మండపంలో వేదపండితులు వేధాశీర్వచనాలు వల్లించగా అలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందజేసారు.తదుపరి శ్రీశైలం ఏమ్మెల్య బుడ్డారాజశేఖర్ రెడ్డి, దేవదాయశాఖ సేక్రటరి వినయ్‌చంద్,కమీషనర్ రామచంద్రమొహన్, శ్రీశైల దేవస్థానం ఇఒ ఎం.శ్రీనివాసరావు శ్రీస్వామివార్ల శేషవస్త్రంతో సత్కరించి లడ్డు ప్రసాదాలను అందజేసారు.

## ప్రాణాలు తీసిన నిద్ర మత్తు!

>> స్వస్థలానికి బయలుదేరినట్లు తెలుస్తోంది. వారి కారు మంగళవారం తెల్లవారుజామున దాదాపు 2 గంటల సమయంలో ఉరవకొండ మండలం బూదగవి గ్రామంవద్దకు రాగానే ఒక్కసారిగా అదుపుతప్పి రోడ్డు ప్రక్కన ఎగిరిపడింది. దీంతో అందులో ప్రమాణిస్తున్న సౌరబ్ విష్ణు, తుషార్ సునీల్, కార్తీక్ శ్రీకర్ కారులో ఇరుక్కుపోయి అక్కడికక్కడే మృతి చెందగా సుమిత్ సునీల్ తీవ్రంగా గాయపడ్డారు. ఘటన జరిగిన చాలా సమయం తరువాత సమాచారం అందగా ఉరవకొండ పోలీసులు ఘటనా స్థలానికి తీవ్రంగా గాయపడిన సుమిత్ సునీల్‌ను 108లో ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స అనంతరం వైద్యుల సూచనల మేరకు మెరుగైన చికిత్సకై జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. ఉదయం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

**వాహనం ఢీకొని వెళ్లడంతోనే కారు బోల్తా పడిందా..?!**

కాగా కారు వేగంగా వెళుతూ బోల్తాపడిన ఘటనపై పలు అనుమానాలు వ్యక్త మవుతున్నాయి. ఎదురుగా వచ్చిన ఏదైనా వాహనం బలంగా ఢీకొట్టి వెళ్లిపోవడంతోనే కారు ఒక్కసారిగా గాల్లోకి ఎగిరి రోడ్డుకు చాలా దూరంలో పడి ముగ్గురు మృతి చెందినట్లు తెలుస్తోంది. కారు ముందు భాగం మొత్తం నుజ్జునుజ్జు కావడం కూడా ఇందుకు బాలాన్ని చేకూరుస్తోంది. సాధారణంగా అదుపుతప్పి బోల్తా పడిన వాహనం ఇంతగా దెబ్బతినడం జరుగదని కచ్చితంగా ఏదైనా వాహనం ఢీకొని వెళ్లింటుందని స్థానికులు చెబుతున్నారు. లేదా కారే ముందు వెళుతున్న ఏదైనా వాహనాన్ని బలంగా ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగివుండే అవకాశం లేకపోలేదని తెలుస్తోంది.

# నిర్మాణాల్లో జాప్యాన్ని సహించం

>> నేరుగా తనను సంప్రదించాలన్నారు. రాజధానిలో స్థలాలు పొంది నవాళ్లు నిర్దేశించిన సమయంలో నిర్మాణాలు మొదలు పెట్టి పూర్తి చేయాల్సిందేనని సిఎం తేల్చి చెప్పారు. ఏ సందర్భంలోనూ, ఏ కారణంతోనూ జాప్యాన్ని అంగీక రించేది లేదని సిఎం స్పష్టం చేశారు.నెలలో నిర్మాణాలు ప్రారంభిస్తామని చెప్పిన 3 సంస్థలు, రెండు నెలల్లో పనులు ప్రారంభిస్తామన్న15 సంస్థలు, 5 నెలల్లో నిర్మాణాలు ప్రారంభిస్తామన్న13 సంస్థలు, 6 నెలల్లో నిర్మాణాలు ప్రారంభిస్తామ న్నారు. ప్రతి కంపెనీ, సంస్థ ప్రతినిధుల నుంచి ప్రణాళిక తెలుసుకుని, స్పష్టమైన హామీ ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. రాష్ట్రంలో జనవరి 1 నుంచి అమరావతి కేంద్రంగా క్వాంటం కంప్యూటింగ్ కార్యకలాపాలు కొనసాగుతాయని సిఎం చంద్రబాబు తెలిపారు. అమెరికాకు సిలికాన్ వ్యాలీ ఎలాగో, అమరావతికి క్వాంటం వ్యాలీ అలాగని స్పష్టం చేశారు. క్వాంటం శాటిలైట్ ఆవిష్కరణలతో సరికొత్త సాంకేతిక విప్లవానికి నాంది పలుకుతామని చెప్పారు. క్వాంటం కంప్యూటింగ్‌ను ప్రమోట్ చేసేందుకు తాను ముందుంటానని హామీ ఇచ్చారు. మన రాష్ట్రానికి ప్రధాని మోడీ పూర్తి సహకారం ఉందన్న సిఎం, ప్రపంచానికి మేలు జరిగేందుకు భారత్, అమెరికా కలిసి పనిచేయాలని కోరారు. క్వాంటంను ఐటీ మంత్రి లోకేష్ మరింత ముందుకు తీసుకెళ్లాలని అన్నారు.గ్రీన్‌ఎనర్జీ రంగానికి ఆంధ్రప్రదేశ్ అనుకూలమని చంద్రబాబు తెలిపారు. భవిష్యత్ మెత్తం ఏఐ, డీప్‌టెక్నాలజీ రంగాలదే హవా అని, ఎపిలో సేవలన్నీ వాట్సాప్ గవర్నెన్స్ ద్వారానే అందిస్తున్నామని వెల్లడించారు. ఆగస్టు నాటికి 100 శాతం సర్వీసులు వాట్సాప్ గవర్నెన్స్‌ద్వారానే అందిస్తామని స్పష్టంచేశారు. ప్రజలు కార్యాలయా లకు వచ్చే అవసరం లేకుండా సర్వీసులు అందిస్తామన్న చంద్రబాబు, చాట్‌జీపీటీ ద్వారా అనేక సమస్యలకు పరిష్కారం లభిస్తోందన్నారు. క్వాంటమ్ కంప్యూటింగ్‌ద్వారా శ్రమ, సమయం తగ్గుతుందని, గతంలో వినియోగదా రులుగా ఉండేవాళ్లమని ప్రస్తుతం తయారీదారులుగా మారామన్నారు. సరైన సమయంలో సరైననాయకుడు దేశాన్ని పరిపాలిస్తున్నారని మోడీని కొనియా డారు. సంపద సృష్టిస్తామని, సృష్టించిన సంపాదనను ప్రజలపై ఖర్చు చేస్తా మని చంద్రబాబు స్పష్టం చేశారు.

ఆవిష్కరణలకు ఆకాశమే హద్దని అని, అమరావతిలో రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. గతంలో ప్రతి ఇంట్లో ఒక ఐటీ నిపుణుడు ఉండాలనేది తన నినాదమన్న చంద్రబాబు, ప్రస్తుతం ప్రతి ఇంట్లో ఒక ఆవిష్కర్త ఉండాలనేదే తమ లక్ష్యమని చెప్పారు. ఏవైనా అడ్డంకులు ఉంటే తన దృష్టికి తీసుకురండని, పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అమరావతి రూ.లక్షకోట్లు పెట్టుబడులు వస్తున్నాయని గమ నించాలన్నారు. పెట్టుబడులకు ముందుకు వచ్చిన సంస్థల గ్రౌండింగ్ అధికా రులు సహకరించాలన్నారు. ఎపిలో అన్ని ప్రాంతాలను సమతుల్యత అభివృద్ధి చేస్తున్నామన్నారు. అన్ని ప్రాంతాల నుంచి అమరావతికి రవాణా వ్యవస్థను అందుబాటులోకి తీసుకుని వస్తున్నామన్నారు. జాతీయ రహదారులను అమరావతి ఓఆర్ఆర్‌కు అను సంధానం చేస్తున్నామన్నారు.

# తోతాపురి మామిడి రైతుకు చేయూత ఇవ్వండి

>> చేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చిత్తూరు జిల్లా తోతాపురి మామిడిని పండించిన రైతులకు కేంద్ర ప్రభుత్వం అండగా నిలబడాలని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ను ఏపీ మంత్రి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కోరారు.రాష్ట్రంలో రైతుల సమస్యలపై కేంద్ర మంత్రితో మంత్రి అచ్చెన్నాయుడు చర్చించారు. వ్యవసాయ రంగ సమగ్ర అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందించాలని కేంద్ర మంత్రిని కోరారు. ముఖ్యంగా రాష్ట్రంలో తోతాపురి మామిడి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. తొతాపురి మామిడి ధర తగ్గడంతో రైతులకు వచ్చే నష్టాన్ని ముందు గానే గ్రహించి, ధర రూ.8 కన్నా తక్కువకు పడిపోవడంతో ప్రభుత్వం జోక్యం చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ధరల లోటు చెల్లింపు పథకం కింద మద్దతు ధరగా రూ.12 నిర్ణయించినట్లు వివరించారు. 6.5 లక్షల మెట్రిక్ టన్నుల తొతాపురి మామిడి పంట కొనుగోలు చేయాల్సి ఉంటుందని కేంద్ర మంత్రికి అచ్చెన్నాయుడు తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం రూ.260 కోట్లు ఖర్చు చేస్తుందని.. కేంద్ర ప్రభుత్వం తగిన తోడ్పాటును అందచేయాలని కోరారు. మార్కెట్ మద్దతు పథకం క్రింద తొతాపూరి మామిడిపండ్లను ఫ్యాక్టరీలు లేదా వ్యాపారుల ద్వారా ప్రతి కిలో రూ.12/ ఇందులో రూ.8/ ను ఫ్యాక్టరీలు / వ్యాపారులు చెల్లించగా, మిగిలిన రూ.4/ను రైతుల ప్రయోజనార్ధం ప్రభుత్వం భరించనుందని, ఈ పథకానికి కేంద్ర ప్రభుత్వం నిధులు అందించాలని కేంద్ర మంత్రికి వివరించారు. ప్రతి పాదిత పంట కోసం క్రింద ధర లోటు చెల్లింపు అమలులో కనీస మద్దతు ధరలో 50శాతంను రాష్ట్ర ప్రభుత్వం భరించనున్నట్లు, కేంద్ర ప్రభుత్వం 100 భరించవలసిందిగా విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా వెనుకబడిన జిల్లాల కోసం మైక్రో ఇరిగేషన్ పథకానికి రాయితీ పెంచాలని కోరారు. ఉత్తర్ ప్రదేశ్ల లోని బుందేల్ ఖండ్ తరహాలో ఏపీకి కేంద్రం అదనపు సాయం చేయాలన్నారు. గుంటూరులో చిల్లీ బోర్డ్, శ్రీకాకుళంలో జీడిపప్పు బోర్డ్, చిత్తూరు లో మామిడి బోర్డ్ లను ఏర్పాటు చేస్తే రైతులకు ఎంతో ప్రయోజనకరమైన ఫలితాలను రాబట్టవచ్చని వివరించారు. విభజన చట్టం ప్రకారం శ్రీకాకుళం జిల్లాలో కేంద్ర అగ్రికల్చర్ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సంవత్సరంలో మామిడిపండు గుజ్జు ఫ్యాక్టరీల్లో నిల్వలు పెరగడం మరియు ఉత్పత్తి అధికంగా ఉండటం వల్ల, ధరలు గణనీయంగా పడిపోవడాన్ని దృష్టిలో ఉంచుకుని, రైతులకు న్యాయమైన ధర లభించేందుకు కేంద్ర ప్రభుత్వ మద్దతు అవసరం ఉందన్నారు. రూ.12/ కిలో ధరకు, మొత్తం అంచనా వ్యయం రూ.780 కోట్లు అవుతుందని, ఇందులో ఫ్యాక్టరీలు/వ్యాపారులు ప్రతి కిలోకు రూ.8/ చెల్లించగా, అంచనా వ్యయం రూ.520 కోట్లు, మిగిలిన రూ.260 కోట్లు (రూ.4/ కిలోకు) ప్రభుత్వ భాగస్వామ్యంగా ఉంటుందన్నారు.

పై అంశాలను దృష్టిలో ఉంచుకొని, కేంద్ర ప్రభుత్వం, రైతుల ప్రయోజనాన్ని కాపాడటానికి, ధర పతనం అయిన నేపథ్యంలో మార్కెట్ మద్దతు పథకం కింద ఆర్థిక సహాయం రూ.260 కోట్లు విడుదల చేయాలని కేంద్ర మంత్రిని కోరారు. మైక్రో ఇరిగేషన్ అమలు ద్వారా వ్యవసాయ స్థాయిలో నీటి వినియోగ సామర్థ్యాన్ని మెరుగుపరచడం, ఎరువుల వినియోగం, కూలీ ఖర్చులు మరియు ఇతర పెట్టుబడులను తగ్గించడం ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచడమే ప్రధాన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుం దన్నారు. రైతులలో 78 మంది చిన్న మరియు అతి చిన్న రైతులే కాగా, మైక్రో ఇరిగేషన్ వ్యవస్థల ఏర్పాటుకు అవసరమైన 45 రైతుల వాటాను భరించలేని స్థితిలో ఉన్నారని, వ్యవసాయ రంగంలో సుస్థిరత కోసం మైక్రో ఇరిగేషన్ ప్రాధాన్యతను గుర్తించి, ఈ ఎనిమిది వెనుకబడిన జిల్లాల్లో మైక్రో ఇరిగేషన్ విస్తరణను లక్ష్యంగా పెట్టుకొ న్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు.2025-26 సంవత్సరంలో సుమారు 3 లక్షల హెక్టార్ల మైక్రో ఇరిగేషన్ విస్తరణతో పాటు, తదుపరి ఐదు సంవత్సరాలలో మొత్తం 15 లక్షల హెక్టార్ల మైక్రో ఇరిగేషన్ విస్తరణను లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.15 వృద్ధి సాధించడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం మైక్రో ఇరిగేషన్ పథకాలను ప్రోత్సహిస్తోందని అన్నారు. ఈ పథకం కింద, చిన్న మరియు అతి చిన్న రైతులకు 90 సబ్సిడీతో, అలాగే ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 సబ్సిడీతో మైక్రో ఇరిగేషన్ అమలు చేస్తున్నా మన్నారు.

# అండగా నేనున్నా

>> పునర్నిర్మాణ పనులు 95 శాతం పూర్తి అయ్యాయని మిగిలిన ఐదు శాతం పనులు నిలిచిపోవడం జరిగిందని ఆలయ మాజీ చైర్మన్ కృష్ణ తేజ వైఎస్ జగన్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో కడప పార్లమెంట్ సభ్యుడు వైఎస్ అవినాష్ రెడ్డి, సతీష్ కుమార్ రెడ్డి వైసిపి నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

**జ్వరంలోనూ చిరునవ్వుతో సమస్యలు తెలుసు కొన్న జగన్..**

ప్రజా దర్బార్‌కు వచ్చిన ప్రజల, వైఎస్సార్సీ శ్రేణుల సమస్యలను తీవ్ర జ్వరంలోనూ అలపు లేకుండా ఓపిగ్గా వింటూ, చిరునవ్వుతో ఆప్యా యంగా పలకరిస్తూ తోడుగా నేనుంటానని వారికి భరోసా ఇచ్చారు.

ప్రజలు ఈ సందర్భంగా సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. దీనికి ఆయన స్పందిస్తూ సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటం చేస్తానని, మనకు అన్యాయం జరిగితే న్యాయ పరంగా ముందుకు వెళ్దామని, ఎవరు అధైర్య పడకుండా ముందుకు వెళ్లాలన్నారు. సాయంత్రం మూడు గంటలకు హెలికాప్టర్ ద్వారా బెంగళూరుకి బయలుదేరి వెళ్లిపోయారు.

## వారం - వర్జ్యం

తేది : 09-07-2025, బుధవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆషాఢ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు, శుక్ల పక్షం
చతుర్దశి రా.1.35
మూల తె.4.49
వర్జ్యం : 2.52-4.32
దు.ఉ.11.47-12.39
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం:** సంతానం నుండి కీలక సమాచారం అందుతుంది. గృహనిర్మాణ ఆలోచనలలో తొందరపాటు వద్దు.

**వృషభం :** ఉద్యోగాలలో స్థానచలనం వుంటుంది. దూరప్రాంతాల నుండి వచ్చిన వార్త కొంత ఆనందం కలుగుతుంది.

**మిథునం:** బంధువులతో అనవసరంగా మాటపడాల్సిన సమయం, జాగ్రత్త అవసరం.

**కర్కాటకం :** ముఖ్యమైన వ్యవహారాలలో ఆచితూచి అడుగవేయండి. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది.

**సింహం:** విలువైన ఆభరణాలు, వాహనాలు కొనుగోలు చేస్తారు. వివాహ, ఉద్యోగయత్నాలు కలిసివస్తాయి.

**కన్య :** సన్నిహితులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. సభలు, సమావేశాలలో చురుకుగా పాల్గొంటారు.

**తుల :** ఊహించని బాధ్యతలు పెరుగుతాయి. వాటిని సమర్థవంతంగా వ్యాపిస్తారు.

**వృశ్చికం:** ఆర్థికపరిస్థితి అంతంత మాత్రంగా వున్నా అవసరాలకు డబ్బు అందుతుంది.కాంట్రాక్టులు దక్కుతాయి.

**ధనుస్సు:** రాజకీయ, పారిశ్రామిక రంగాల వారికి ప్రభుత్వం నుండి ఆహ్వానాలు అందుతాయి.

**మకరం:** వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు ఎదురైనా సన్నిహితుల సాయం అందుతుంది.

**కుంభం:** ఆరోగ్య సమస్యలు ఎదురై చికాకులు పెట్టినా అధిగమిస్తారు. అనుకున్న దొకటి జరిగేది వేరొకటిగా ఉంటుంది.

**మీనం :** రాజకీయ, కళారంగాల వారికి కొంత అనుకూలంగా వుండును. పనులు సత్తనడకన సాగుతాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డిపై వ్యాఖ్యలు అత్యంత జుగుప్సాకరం

## మహిళలను అవమానపరిచే లక్ష్యం మీ డిఎన్ఎలోనే ఉంది: సిఎం చంద్రబాబు

**విజయవాడ,జులై8,ప్రభాతవార్తప్రతినిధి:** కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డిపై వైఎస్సార్సీ మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు అత్యంత జుగుప్సాకరమని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. మహిళలను అవమానపరచడం, వ్యక్తిత్వ హననానికి పాల్పడటం ఆ పార్టీ డిఎన్ఎలోనే ఉందంటూ వైసీపీ నేతలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం అమరావతిలో సిఎం చంద్రబాబు నాయుడు విలేకర్లతో మాట్లాడుతూ.. ప్రశాంతి రెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. వైఎస్సార్సీ నేతల తీరులో మార్పు రావడం లేదని ఆయన మండిపడ్డారు. మహిళలను దూషించడం, బూతులు తిట్టడం, కించపరచడం అనేది ఆ పార్టీ రాజకీయ సిద్ధాంతంగా పెట్టుకుందని విమర్శించారు. పార్టీ ఘోర ఓటమికి ఇలాంటి పోకడలు ఒక కారణమని తెలిసినా.. వారి సహజ గుణంలో మాత్రం మార్పు రావడం లేదన్నారు. చెల్లి పుట్టుకపైనా వ్యాఖ్యలు చేసిన వారి నాయకత్వంలో పని చేస్తోన్న నేతలు అంతే దారుణంగా, అసహ్యంగా మాట్లాడుతూ వారి నీచ సంస్కృతిని చాటుకుంటున్నారని వైఎస్సార్సీ నేతలపై సిఎం చంద్రబాబు మండిపడ్డారు.

మహిళలపై వ్యక్తిగత విమర్శలు చేసి వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ప్రవర్తిస్తున్న వీరు మనుషులేనా? అని ప్రశ్నించారు. ఇది రాజకీయమా? అంటూ వైసీపీ నేతల వ్యవహరిస్తున్న తీరుపై సందేహం వ్యక్తం చేశారు. ఇంత కండ కావరం పనికిరాదు,ఇంత సంస్కారం హీనంగా వ్యవహరిస్తారా ?మహిళలు, మహిళా నాయకుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ప్రణాళికా బద్ధంగా వైసీపీ చేస్తున్న కుట్రలను ప్రతి పౌరుడు గమనించాలని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు సూచించారు. మహిళల పట్ల అనుచితంగా ప్రవర్తించిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని ఆయన స్పష్టం చేశారు.

## విశాఖలో జిజిసి ఇన్నోవేషన్ క్యాంపస్ ఏర్పాటుకు ఒప్పందం!

### 10వేల ఉద్యోగాలు కల్పించేలా ఎఎన్ఎస్ఆర్ సంస్థతో మంత్రి నారా లోకేష్ సమక్షంలో ఎంఒయు

**విజయవాడ, జులై8,ప్రభాతవార్తప్రతినిధి:** గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్స్ (జిసిసి ) స్థాపన, నిర్వహణలో ప్రపంచంలోనే అగ్రగామిగా ఉన్న ఎఎన్ఎస్ఆర్ సంస్థ విశాఖపట్నంలో బిదిద్బి కోసం ఒక ప్రత్యేకమైన ఇన్నోవేషన్ క్యాంపస్‌ను స్థాపించడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో ఒక అవగాహన ఒప్పందం (ఎంఒయు)పై సంతకం చేసింది. రాష్ట్ర ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సమక్షంలో ఈ మేరకు కుదిరిన ఒప్పందం ప్రకారం ఎఎన్ఎస్ఆర్ సంస్థ మధురవాడ ఐటి క్లస్టర్‌లో అత్యాధునిక జీసీసీ ఇన్నోవేషన్ క్యాంపస్ ఏర్పాటుకు పెట్టుబడులు పెట్టనుంది. ఈ క్యాంపస్ ద్వారా రాబోయే ఐదు సంవత్సరాల్లో 10వేలమందికి పైగా ఉద్యోగాలు కల్పించనుంది. ఆంధ్రప్రదేశ్‌లోని అత్యుత్తమ ప్రతిభ గల పర్యావరణ వ్యవస్థను ఉపయోగించుకోవడంలో ప్రపంచస్థాయి సంస్థలకు తివిళీళి మద్దతునిస్తుంది. తివిళీళి సంస్థ సిఇఒ లలిత్ అహూజా మాట్లాడుతూ... ప్రపంచస్థాయి ప్రతిభ, బలమైన మౌలిక సదుపాయాలు, విజనరీ లీడర్ షిప్ మేలు కలయికగా ఉన్న విశాఖ మహానగరం అద్భుతాలను సృష్టిస్తుంది, విశాఖలో తాము ఏర్పాటుచేసే ఇన్నోవేషన్ క్యాంపస్ ప్రపంచస్థాయి ప్రతిష్టాత్మక సంస్థలకు గమ్యస్థానంగా మారబోతోందని చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... రాబోయే నాలుగేళ్లలో ఎపిలో 20లక్షల ఉద్యోగాలు కల్పించాలన్నది మా లక్ష్యం, ఇందులో ఐటి, జిసిసి రంగాల్లోనే 5లక్షల ఉద్యోగాలు కల్పించబోతున్నాం. ఇందుకోసం విశాఖ మహానగరం నుంచే మా ప్రయాణం ప్రారంభించాం. దీనిని మేం టార్గెట్ గా మాత్రమేగాక ఒక ఉద్యమంలా స్వీకరించాం. బెంగుళూరు, గోవా నగరాల మేలు కలయిక విశాఖ నగరం. వ్యాపారానికి అనుకూలమైన నగరంగానే గాక ప్రతిభను ఆకర్షించే ప్రాంతంగా విశాఖను తయారుచేయాలన్నది మా విధానం. ఇందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. మా ఆర్థిక వృద్ధి వ్యూహంలో జిసిసిలదే కీలకపాత్ర, కొద్దినెలల్లోనే మేము ఈ రంగంలో గ్లోబల్ ప్లేయర్లను ఆకర్షించడం మా తొలి విజయం. జిసిసిలను స్ట్రాటజిక్ హబ్ లుగా మార్చేందుకు ఇప్పటికే చర్యలు చేపట్టాం. ఇందులో భాగంగా టిసిఎస్, కాగ్నిజెంట్‌లకు ఎకరా 99 పైసలకే భూములను కేటాయించా మన్నారు.

# శ్రీవారి 'పుస్తకప్రసాదం'!

>> సనాతన ధర్మంయొక్క ప్రాధాన్యత, శ్రీవారి వైభవం, హిందూ సాంప్రదాయం,మహాపురుషుల చరిత్రకు సంబంధించిన పుస్తకాలను ముద్రించిన టిటిడి పంపిణీ చేయబోతోంది. అలాగే తిరుమలకొండపై వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లలోని కంపార్టుమెంట్లలో స్వామివారి దర్శనంకోసం వేచివుండే భక్తులకు నిరంత రంగా పుస్తకాలను వితరణచేయనున్నారు. పుస్తకప్రసాదంగా 1.శ్రీవేంకటేశ్వరవైభవం, 2.విష్ణు సహస్ర నామం, 3.వేంకటేశ్వర సుప్రభాతం, 4.భజగోవిందం,5.లలితా సహస్రనామం, 6.శివస్తోత్రం, 7.భగవ ద్గీత, 8.మహనీయులుచరిత్ర తదితరపుస్తకాలను ఛైర్మన్ నాయుడు ధర్మప్రచారపరిషత్ అధికారులకు అందజేశారు.

# మరో 6 నెలల్లోనే క్వాంటమ్ వ్యాలీ

>> వైపు చూస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు ఇదే సరైన సమయం. టిసిఎస్, ఐబిఎం, ఎల్ అండ్ టి వంటి దిగ్గజ సంస్థల భాగస్వామ్యంతో అమెరికాలోని సిలికాన్ వ్యాలీ తరహాలో దేశంలోనే తొలిసారిగా ఎపి రాజధాని అమరావతిలో మరో ఆరునెలల్లోనే క్వాంటమ్ వ్యాలీ ఆవిష్కృతం కాబోతోంది. ఇది భారత్ సాంకేతిక విప్లవంలో గేమ్ ఛేంజర్‌గా నిలుస్తుంది. విశాఖ మహానగరం ఐటి హబ్‌గా తయారవుతోంది. విజనరీ లీడర్ చంద్రబాబు నాయుడు గారి నేతృత్వంలో ప్రస్తుతం ఎపిలో ఇన్వెస్టర్స్ ఫ్రెండ్లీ విధానాలు అమలు చేస్తున్నాం. దేశంలో మరే రాష్ట్రం ఇవ్వని విధంగా రాయితీలు అందజేస్తున్నాం. అధునాతన సాంకేతికతలకు నిలయంగా మారుతున్న ఎపిలో పెట్టుబడులు పెట్టాల్సిందిగా మంత్రి లోకేష్ విజ్ఞప్తిచేశారు. ఈ రోడ్ షోలో లోవ్స్ ఇండియా ఎండి అంకుర్ మిట్టల్, రోల్స్ రాయ్స్ వైస్ ప్రెసిడెంట్ హరిహరన్ గణేశన్, శాక్స్ గ్లోబల్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ మధు నటేశన్, జెసి పెన్నీ ఇండియా ఎండి కౌశిక్ దాస్, లులూ లెమన్ వైస్ ప్రెసిడెంట్ ప్రవీణ్ మైసూర్, డెల్టా ఎయిర్ లైన్స్ డైరక్టర్ సైఫ్ అహమ్మద్ షరీఫ్, విక్టోరియా సీక్రెట్ వైస్ ప్రెసిడెంట్ వసుధారిణి శ్రీనివాసన్, నసుని ఇండియా సీనియర్ డైరక్టర్ పెద్దరెడ్డెప్ప, ఎఎన్ జె సిఎఫ్ఓ కవితా రమేష్, ఆస్ట్రల్ ల్యాబ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ శివానంద ఆర్. కోటేశ్వర్, జాగ్వర్ ల్యాండ్ రోవర్ సిఇఓ లలితా ఇంద్రకంటి, ఐటి శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్ పాల్గొన్నారు.

# 4 లక్షల మంది రాక

>> అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారు. కోర్కెలు తీరిన వారు రొట్టెలను వదలడం. కోర్కెలతో వచ్చిన వారు ఆ రొట్టెలను స్వీకరించడం వంటి దృశ్యాలతో స్వర్ణాల చెరువు ఘాట్ పరిసర ప్రాంతాలు సరికొత్త శోభను సంతరించుకున్నాయి. ఉద్యోగం వివాహం సంతాన రొట్టెల కు డిమాండ్ పెరిగింది. జిల్లా యంత్రాంగం పటిష్టంగా చేపట్టిన ఏర్పాట్ల పట్ల సుదూర ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దర్గా ప్రాంగణంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా, క్యూలైన్లు సజావుగా సాగేలా, శాంతి భద్రతలను పరిరక్షించేందుకు పటిష్ట పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. పోలీస్ కంట్రోల్ రూం 24 గంటలూ అనౌన్స్‌మెంట్ చేస్తూ ఎప్పటికప్పుడు భక్తులను అప్రమత్తం చేస్తున్నారు. తప్పిపోయిన చిన్నారులను, వృద్ధులను వెంటనే సంబంధికులకు అప్పగిస్తున్నారు. భక్తులు పోగొట్టుకున్న పర్సులను అందిస్తున్నారు. ఈ మూడు రోజుల్లో సుమారు 100 మందికి పైగా తప్పిపోయిన వారిని గుర్తించి వారి సంబంధికులను అప్పగించారు. దీంతో పోలీసు కంట్రోల్ రూం సేవలను అందరూ శభాష్ అని మెచ్చుకుంటున్నారు.

# కార్పొరేషన్ ఏర్పాటు

>> ఏర్పాటు తర్వాత రూ.80 వేల కోట్లతో పునర్వ్యస్థీకరించిన జల్‌జీవన్ పనులకు కేంద్రం నుంచి ఆమోదం వచ్చేలోపు గత ప్రభుత్వ హయాంలో కేంద్ర ప్రభుత్వం కేటాయించిన రూ.26 వేల కోట్లలో మిగిలిపోయిన రూ.22 వేల కోట్లు ఖర్చు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా రూ.13 వేల కోట్లతో సింగిల్, మల్టీ విలేజ్ తాగునీటి పథకాల పనులకు ఇటీవల టెండర్లు పిలిపి కాంట్రాక్టు ఏజెన్సీలను ఖరారు చేసింది. మరో రూ.9 వేల కోట్ల పనులకు ఇంకా టెండర్లు పిలవాల్సి ఉంది. ఇప్పుడీ పనుల్లో ముందడుగు పడాలంటే రాష్ట్ర ప్రభుత్వం వాటాకింద రూ.11 వేల కోట్లు మొదట సమకూర్చాలి. అప్పుడు గానీ కేంద్ర ప్రభుత్వ వాటా నిధులు విడుదలయ్యే అవకాశంలేదు. ఈ నేపథ్యంలోనే కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి బ్యాంకులనుంచి నిధులు సమీకరించాలని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ నిర్ణయించింది. దీనికి రాష్ట్ర ఆర్థికశాఖ కూడా అనుమతి ఇవ్వడంతో మంత్రివర్గం ఆమోదం కోసం ప్రతిపాదిస్తున్నారు. జల్‌జీవన్‌మిషన్ రుణం మంజూరు చేసేందుకు రెండు, మూడు జాతీయ బ్యాంకులు ముందుకొచ్చాయి. వడ్డీ వాయిదాల చెల్లింపు తదితర అంశాల్లో తుది నిర్ణయం తీసుకోవలసి ఉందని తెలుస్తోంది. వైఎస్సార్సీ హయాంలో కేంద్ర ప్రభుత్వం రూ.26వేల కోట్లకు పైగా విలువైన జల్‌జీవన్ ప్రాజెక్టులు మంజూరు చేసింది. ఇందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 50% చొప్పున నిధులు సమకూర్చాలన్నది ఒప్పందం. అయితే జగన్ ప్రభుత్వం రాష్ట్ర వాటా నిధులు సమకూర్చని కారణంగా కేంద్రం కేటాయించిన నిధుల్లో నుంచి రూ.4 వేల కోట్లకు మించిఖర్చు చేయలేకపోయారు. దాంతో చేసిన కొద్దిపాటి పనులూ ప్రయోజనం లేకుండా పోయాయి. నీటి లభ్యత లేకుండానే గ్రామాల్లో ఇళ్లకు కుళాయి కనెక్షన్లు ఇవ్వడంతో అవి అలంకారప్రాయంగా మిగిలాయి. ఈ నేపథ్యంలోనే సమీపంలోని నదులు, జలాశయాలు నుంచి నీరు సేకరించి ప్రజలకు అన్ని సీజన్లలోనూ కుళాయిల ద్వారా నీరు అందించేలా కూటమి ప్రభుత్వం జలజీవన్ పనులను పునర్వ్యవస్థీకరించింది. ప్రతి ఇంటికి తమ ప్రభుత్వం మంచినీటిని అందిస్తుందని ఇప్పటికే డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పష్టం చేసారు.

# నిబంధనలు అతిక్రమిస్తే కేసులు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ చందోలు

## - వైఎస్ జగన్ పర్యటనపై ఆంక్షలు - ఎస్పీ మణికంఠ చందోలు

**బంగారుపాళ్యం, జులై 8 ప్రభాతవార్త:** మామిడి రైతులను పరామర్శించడానికి బుధవారం ఉదయం మాజీ సిఎం, వైకాపా అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి బంగారుపాళ్యంకు వస్తున్నారని ఎస్పీ మణికంఠ చందోలు అన్నారు. నిబంధనల ప్రకారం వైఎస్ జగన్ పర్యటన కొనసాగాలని, నిబంధనలు అతిక్రమిస్తే కేసులు పెడ్తామని ఎస్పీ స్పష్టం చేశారు. మంగళవారం మధ్యాహ్నం స్థానిక పోలీస్ స్టేషన్‌లో వైఎస్ జగన్ పర్యటనపై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మణికంఠ చందోలు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ధేశించిన ఆదేశాల మేరకు వైఎస్ జగన్ పర్యటన బంగారుపాళ్యంలో కొనసాగేలా వైకాపా నాయకులు, కార్యకర్తలు చూడాలన్నారు. నిర్ణయించిన ప్రదేశాల వరకే వైఎస్ జగన్‌కు ప్రభుత్వం పరంగా అనుమతి వుందని, ఇష్టానుసారంగా ర్యాలీలు, బహిరంగ సభలు నిర్వహించడానికి అనుమతులు లేవన్నారు. ప్రభుత్వ అనుమతులను బేఖాతరు చేసి ఇష్టానుసారంగా ర్యాలీలు చేపడితే చట్టపరంగా పోలీసు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. చెన్నై-బెంగళూరు జాతీయ రహదారి కొత్తపల్లి వద్ద వైఎస్ జగన్ పర్యటన కోసం హెలిప్యాడ్ ఏర్పాటు చేశారని, అక్కడి నుండి రోడ్డు మార్గంలో తిమ్మోజిపల్లి-నలగాంపల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జి మాధవనగర్ మీదుగా వ్యవసాయ మార్కెట్ యార్డుకు వైఎస్ జగన్ చేరుకోవాల్సి వుందన్నారు. అలా కాకుండా ర్యాలీలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే వైఎస్ జగన్ పర్యటనకు వివిధ వాహనాల్లో జన సమీకరణ చేయరాదని, వైఎస్ జగన్ పర్యటనకు కేవలం 500 మందికి మాత్రమే ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. హెలిప్యాడ్ వద్ద 30 మందికి మాత్రమే అనుమతులు వున్నాయని చెప్పారు. మార్కెట్ యార్డుకు చేరుకున్న వైఎస్ జగన్ మామిడి రైతులతో ముఖాముఖి చర్చించి వారి సమస్యలను తెలుసుకోవచ్చునని చెప్పారు. అలాగే వైఎస్ జగన్ పర్యటించే రోడ్డు మార్గంలో కొందరు మామిడికాయల కుప్పలు వేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలపడానికి ప్రయత్నిస్తే వారిపై పోలీసు కేసులతో పాటు రౌడీ షీట్లు నమోదు చేస్తామని హెచ్చరించారు. వైఎస్ జగన్ పర్యటన కోసం 500 మందితో పోలీసు బందోబస్తు నిర్వహిస్తున్నామని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో పలమనేరు డిఎస్పీ ప్రభాకర్, బంగారుపాళ్యం సిఐ కత్తి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై నల్లపురెడ్డి వ్యాఖ్యలు అభ్యంతరకరం : డిప్యూటీ సిఎం పవన్

**విజయవాడ,జులై 8,ప్రభాతవార్త ప్రతినిధి:** నెల్లూరు జిల్లా కోవూరు ఎంఎల్ఏ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై వైకాంగ్రెస్‌పార్టీ నేత నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ తీవ్రంగా ఖండించారు. ఎంఎల్ఏ ప్రశాంతిరెడ్డిపై నల్లపు రెడ్డి కొన్ని వివాదస్పద వ్యాఖ్యలు చేసారు.ఈ విషయమై డిప్యూటీ సీఎం పవన్"ఎక్స్' సామాజిక మాధ్యమం వేదిక తీవ్రస్థాయిలో మండిపడ్డారు. వైకాంగ్రెస్ నాయకుల్లో రాను.రాను విలువలు దిగజారుతున్నా యన్నారు. మహిళలపై సభ్యతా రాహిత్యంగా మాట్లాడుతున్నారన్నారు. ప్రసన్నకుమార్‌రెడ్డి మహిళల వ్యక్తిత్వాన్ని అవహేళన చేస్తూ కించపరిచేలా మాట్లాడారని మండిపడ్డారు. 'మహిళలపై అసభ్యకరంగా మాట్లాడటం వైకాంగ్రెస్‌పార్టీ నేతలకు అల వాటుగా మారింది. ప్రశాంతిరెడ్డిపై ప్రసన్న కుమార్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకర మైనవి. వ్యక్తిగత జీవితాలను లక్ష్యంగా చేసుకొని వ్యాఖ్యలు చేస్తారా? మహిళలను కించపర చడాన్ని ప్రజాస్వామికవాదులంతా ఖండిం చాలి. మహిళల గౌరవానికి భంగం కల్గిస్తే చట్టప్రకారం చర్యలుంటాయి. శాసనసభలోనూ ఇలాంటి వ్యాఖ్యలే చేయడంతో ప్రజలు సరైన తీర్పు ఇచ్చారు. మహిళా సమాజం మరోసారి ఆ పార్టీకి తగిన విధంగా సమాధానం చెబుతుంది' అని వ్యాఖ్యానించారు.

# పాల ట్యాంకర్‌ను ఢీ కొట్టిన కారు, తల్లి, కుమారుడు మృతి .. మరొకరికి పరిస్థితి విషమం



**చంద్రగిరి, జూలై 8 ప్రభాతవార్త:** పాల ట్యాంకర్‌ను కారు ఢీ కొట్టిన ప్రమాదంలో తల్లి తనయుడు మృతి చెందగా, మరొకరి పరిస్థితి విషమంగా వున్నది. తిరుపతి జిల్లా చంద్రగిరి మండల పరిధిలోని తొండవాడ వద్ద మంగళవారం ముందు వెళుతున్న పాల ట్యాంకర్‌ను కారు ఢీకొట్టింది. విజయవాడకు చెందిన కోటేశ్వర్ రావు తన భార్య పద్మావతి, అక్క హేమలత, కుమారుడు జస్వంత్ సాయితో కలసి తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చారు. తిరుమల శ్రీవారి దర్శనం ముగించుకుని తమిళనాడులోని తిరువణ్ణామలై (అరుణాచలం) వెళుతుండగా తొండవాడ వద్ద ప్రమాదవశాత్తూ ముందు వెళుతున్న వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన కోటేశ్వర్ రావు భార్య పద్మావతి (38) అక్కడికక్కడే మృతి చెందినది. తీవ్రంగా గాయపడిన జస్వంత్ సాయిని ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. అదేవిధంగా హేమలత పరిస్థితి విషమంగా వున్నట్లు వైద్యులు తెలిపారు. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం దెబ్బతినగా, డ్రైవింగ్ సీట్‌లో వున్న కోటేశ్వర్ రావుకు ఎయిర్ బెలూన్ ఓపెన్ కావడంతో ప్రమాదం నుండి సురక్షితంగా బయటపడ్డారు. కాగా కోటేశ్వర్ రావు విజయవాడలోని చిట్టినగర్, పెనుబాక వారి వీధికి చెందిన వారుగా గుర్తించారు. సమాచారం అందుకున్న ఇన్‌చార్జ్ సిఐ ఇమ్రాన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## సిఆర్డిఏ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

**విజయవాడ,జులై 8,ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రజారాజధాని అమరావతిలో ఏపీ సిఆర్డిఏ సౌజన్యంతో బసవతారకం ఇండో అమెరికన్ ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దాంతో పాటు ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరాలు జరగనున్నాయి. ఈ మేరకు సిఆర్డిఏ ఒక ప్రకటన జారీ చేసింది. ఈ నెల 10వ తేదీన ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు తుళ్లూరులోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో, ఈ నెల 11వ తేదీన ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు యర్రబాలెంలోని అర్బన్ హెల్త్ సెంటర్(గేబీది) లో ఈ శిబిరాలు నిర్వహించడం జరుగుతుంది. ఈ శిబిరాలలో బసవతారకం ఇండో అమెరికన్ ఆసుపత్రికి చెందిన అనుభవజ్ఞులైన వైద్య బృందం మరియు సిబ్బంది సేవలందిస్తుంది. కావున అమరావతి పరిసర ప్రాంతవాసులు ఈ శిబిరానికి హాజరై వైద్య బృందం సేవలను వినియోగించుకోవలసినదిగా విజ్ఞప్తి చేసింది

# భక్తుల అభిప్రాయాలకు మరింత ప్రాధాన్యత

## - సాంకేతికత సహాయంతో సకాలంలో శ్రీవారి దర్శనం - కదిలిన టిటిడి యంత్రాంగం



**తిరుమల, జూలై 8ప్రభాతవార్తప్రతినిధి:** ఆపదమొక్కులవాడా గోవిందా...అనాథరక్షక గోవింద నినాదాలతో తిరుమలకు చేరుకుంటున్న సామాన్యభక్తులకు సాంకేతికత సాయంతో నిర్ధేశించిన సమయానికి దర్శనం అయ్యేలా చర్యలు తీసుకోవాలని టిటిడి ఇఒ జె.శ్యామలరావు సూచించారు. తిరుమలేశుని దర్శనార్థం టిటిడి జారీచేస్తున్న పలు రకాల దర్శనాల్లో సర్వదర్శనం, సమయ నిర్దేశిత దర్శనం(ఎస్ఎస్‌డి),ప్రత్యేక ప్రవేశ దర్శనం(ఎస్ఇడి) దివ్యదర్శనం మార్గాల ద్వారా తిరుమలకు భక్తులు వస్తుంటారని, ఆయా భక్తులకు సాంకేతికత (టెక్నాలజీ)సాయంతో సకాలంలో దర్శనం చేయించడంపై తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. మంగళవారం "వార్త" పత్రిక ప్రధానపేజీలోఅభిప్రాయసేకరణతో రుమలలో మెరుగైన సేవలు -తిరుమలేశుని దర్శనంలో మార్పులు రావాలి"అనే కథనంపై టిటిడి ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి స్పందించారు. భక్తుల సమస్యలు, వారి అభిప్రాయాలను టిటిడి అధికారులకు ప్రత్యక్షంగా తెలుసుకున్న అనుభూతి కలిగించిన 'వార్త'పత్రిక అంశంపై మంగళవారం ఇఒ ,అదనపు ఇఒ ఇతర ముఖ్య అధికారులతో సమావేశమయ్యారు. టిటిడిలో ఐటి విభాగం నిర్వహణలో కీలకంగా ఉన్న టిసిఎస్ ప్రతినిధులు, ఐటి అధికారులతో వర్చువల్‌గా సమావేశమయ్యారు. తిరుమలకు వచ్చిన భక్తులు దేవదేవుని దర్శనానికి క్యూలైన్లలో చేరుకున్నప్పటి నుండి దర్శనం అయ్యేవరకు సాంకేతికత ఉపయోగించి స్వామివారి దర్శనం సులభతరం చేయించే అంశానికి పంబంధించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ అంశంపై నిర్ధిష్ట నిర్ణయానికి వచ్చేందుకు టిసిఎస్ ప్రతినిధులు, ఐటి విభాగం ప్రతినిధులు తరచూ సమావేశాలు నిర్వహించి, ప్రణాళికా బద్ధంగా చర్యలు చేపట్టాలని కోరారు. టిటిడిలో ఇప్పటివరకు ఉన్న విధానంలో టిటిడి సిబ్బందితో భక్తులను ధృవీకరించడం జరుగుతోందని, సాంకేతిక రంగంలో వేగంగా మారుతున్న మార్పులకు అనుగుణంగా క్యూఆర్ కోడ్, ముఖగుర్తింపు పద్ధతి ద్వారా భక్తులను నిర్ధారించే మరింత సమయాన్ని ఆదాచేసే విషయంపై పరిశీలిం చాలన్నారు. భక్తులు క్యూలైన్లో ప్రవేశించనప్పటి నుండి కంపార్టుమెంట్లలో ఎంతసయం ఉంటున్నారని, క్యూలైన్లలో భక్తులు చేరినప్పటి నుండి శ్రీవారి దర్శనానికి ఎంత సమయం అవుతోందని, ఆలయం నుండి వెలుపలకు రావ డానికి ఎంత సమయం పడుతోందన్నారు.

## 11న చిక్ జాజూర్ ప్యాసింజర్ రద్దు

**గుంతకల్లు రైల్వే, జూలై 8,ప్రభాతవార్త** గుంతకల్లు-చిక్ జాజూర్-గుంతకల్లు మధ్య తిరిగే పాసింజర్‌తో పాటు తిరుపతి-కదిరి దేవరపల్లి- తిరుపతి మధ్య తిరిగే పాసింజర్ రైలు సర్వీసులను ఈ నెల 11న రద్దు చేసినట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. నైరుతి రైల్వే, హుబ్లీ డివిజన్ పరిధిలోని సోమలాపురం- రాయ దుర్గంల మధ్య కి.మీ 38.803వద్ద కొత్తగా ఏర్పాటు చేస్తున్న బద్నాహాళ్ళు క్రాసింగ్ స్టేషన్‌లో ఈ నెల 11న ఉదయం 6గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు యుద్ద ప్రాతిపదికన ఇంజనీరింగ్ పనులు చేపట నున్న ందున ఈ నెల 11న గుంతకల్లు-చిక్ జాజూర్-గుంతకల్లు పాసింజర్ రైలు సర్వీసులతో పాటు ఈ నెల 10న తిరుపతి నుంచి కదిరిదేవరపల్లికి బయలుదేరే నెంబర్ 57405పాసింజర్ రైలును ఈ నెల 11న గుంతకల్లు వరకు మాత్రమే నడుపుతున్నట్లు తెలిపారు. 57405/06 గుంతకల్లు-కదిరిదేవరపల్లి- గుంతకల్లు మధ్య తిరిగే 57405/06 రైలుసర్వీసులను పాక్షికంగా రద్దు చేయడంతో ఈ రైళ్ల ఈ నెల 11న గుంతకల్లు-తిరుపతి-గుంతకల్లు మధ్య మాత్రమే రాకపోకలు సాగిస్తాయి.

# క్వాష్ పిటిషన్‌ను ఉపసంహరించుకున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

## - ముందస్తు బెయిలు పిటిషన్ దాఖలు - హైకోర్టులో నేడు విచారణ

**విజయవాడ,జూలై8,ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం కుంభకోణం కేసును కొట్టివేయాలని కోరుతూ హైకోర్టులో దాఖలు చేసిన క్వాష పిటీషన్‌ను చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి(ఏ39) ఉపసంహారించుకున్నారు. సిఐడీ తనపై నమోదు చేసిన కేసును కొట్టివేయాలని, నిందితుల జాబితా నుంచి తన పేరును తొలగించాలని, కేసులో తనను నిందితుడిగా పేర్కొంటూ సాక్షిగా విచారణకు రావాలని దర్యాప్తు అధికారి నోటీసు ఇవ్వడం చెల్లదంటూ హైకోర్టులో మోహిత్‌రెడ్డి క్వాష్ పిటీషన్ దాఖలు చేసారు. ఈ వ్యాజ్యంపై ఇటీవల జరిగిన విచారణలో అరెస్ట్ నుంచి రక్షణ కల్పించాలని అతని తరపు సీనియర్ న్యాయవాది పి.నాగేశ్వరారవు అభ్యర్థించగా, ఉత్తర్వులు ఇచ్చేందుకు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసరెడ్డి నిరాకరించారు. అరెస్ట్‌పై ఆందోళన ఉంటే ముందస్తు బెయిలు పిటీషన్ వేసుకోవాలన్నారు. వైకాంగ్రెస్ పార్టీ నేత చెవిరెడ్డి భాస్కరరెడ్డి కుమారుడు మోహిత్‌రెడ్డి మద్యం కుంభకోణం కేసులో ముందస్తు బెయిలు కోసం హైకోర్టులో పిటీషన్ దాఖలు చేశారు.

## ఆంధ్రప్రదేశ్ రియాలిటీ రంగంలో పెట్టుబడులు పెట్టండి :మంత్రి లోకేష్

**విజయవాడ,జూలై8,ప్రభాతవార్తప్రతినిధి:** శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఆంధ్రప్రదేశ్ లో పెట్టుబడులు పెట్టాలని ప్రెస్టేజ్ గ్రూపు ప్రతినిధులకు రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ విజ్ఞప్తిచేశారు. ప్రెస్టేజ్ గ్రూప్ చైర్మన్ ఇర్ఫాన్ రజాక్, ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ జాయాద్ నోమాన్ లతో మంత్రి లోకేష్ బెంగుళూరులో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ... ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ లో పెట్టుబడులకు పూర్తి అనుకూల వాతావరణం నెలకొని ఉంది, సుమారు రూ.65వేల కోట్ల రూపాయలతో అమరావతి రాజధాని పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి, గూగుల్, టిసిఎస్, కాగ్నిజెంట్ వంటి సంస్థల రాకతో విశాఖపట్నం ఐటి హబ్ గా మారుతోంది. రిలయన్స్, రెన్యూ వంటి సంస్థలు రాయలసీమలో ఫుడ్ ప్రాసెసింగ్, గ్రీన్ ఎనర్జీ రంగంలో పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టబోతున్నాయి. ఏడాది కాలంలోనే రాష్ట్రంలో వివిధ సంస్థలు 9.5లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చాయి. అన్నివిధాల అనుకూలమైన వాతావరణం కలిగిన ఎపి రియాలిటీ రంగంలో పెట్టుబడులు పెట్టండి. ప్లగ్ అండ్ ప్లే మోడల్ ప్రిబిల్డ్ మౌలిక సదుపాయాల అభివృద్ధికి సహకారం అందించాలని లోకేష్ విజ్ఞప్తిచేశారు దేశంలో ప్రఖ్యాత రియల్ ఎస్టేట్ డెవలపర్స్ కంపెనీల్లో ప్రెస్టేజ్ గ్రూప్ ఒకటి. బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, కొచ్చి, ముంబై, మంగళూరు, గోవా, ఢిల్లీవిదిళి సహా 13 ప్రధాన భారతీయ నగరాల్లో ప్రెస్టేజ్ గ్రూప్ బలమైన ఉనికిని కలిగి ఉంది. ఈ కంపెనీ సుమారు 180 మిలియన్ చదరపు అడుగుల అభివృద్ధి చెందిన ప్రాంతాన్ని కవర్ చేస్తూ 350 కి పైగా ప్రాజెక్టులను పూర్తి చేసింది. ప్రస్తుతం 56 ప్రాజెక్టులు భవిష్యత్ అభివృద్ధికి పైప్ లైన్ లో ఉన్నాయి. భారతదేశంలో సీఆర్ఐఎస్ఐఎల్ డిఎ 1+ రేటింగ్‌ను అందుకున్న ఏకైక రియల్ ఎస్టేట్ డెవలపర్ సంస్థ ప్రెస్టేజ్. మంత్రి లోకేష్ వినతిపై ప్రెస్టేజ్ చైర్మన్ ఇర్ఫాన్ రజాక్ స్పందిస్తూ... ఆంధ్రప్రదేశ్ లో పెట్టుబడులు పెట్టే అంశాన్ని పరిశీలిస్తామని చెప్పారు.

# హైదరాబాదులో వైయస్సార్ మెమోరియల్ ఏర్పాటు చేయాలి

## కోట్ల మంది జీవితాలలో వెలుగు నింపిన వైయస్సార్, సోనియా, రాహుల్, రేవంత్ లకు లేఖల ద్వారా విజ్ఞపి : ఎపి పిసిసి చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి




**పులివెందుల,జూలై 8,ప్రభాత వార్త:** హైదరాబాద్ లో వైయస్సార్ అభిమానుల కోసం వైయస్సార్ మెమోరియల్ పార్క్ ఏర్పాటు చేయాలని ఏపీ సీపీపీ చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి కోరారు.మహానేత వైయస్సార్ 76 వ జయంతి సందర్భంగా ఇడుపుల పాయలోని వైయస్సార్ సమాధి వద్ద ఆమె కాంగ్రెస్ నాయకులతో కలిసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వైయస్ షర్మిల మీడియా తో మాట్లాడుతూ వైయస్సార్ ఉమ్మడి రాష్ట్రంలో ముఖ్య మంత్రిగా రెండు సార్లు పని చేశారనీ రాష్ట్రంలోనే కాదు దేశంలో కూడా కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి కీలకమయ్యారు అని, పరిపాలన, పథకాలతో కోట్ల మందిని అభిమానులుగా చేసుకున్నారు అని ఆరోగ్య శ్రీ, ఫీజు రీయింబర్స్, జలయజ్ఞం లాంటి పథకాలు మార్క్ పథకాలను ఆయన ప్రవేశ పెట్టారని,మాట తప్పక పోవడం ,మడిమ తిప్పక పోవడం ఆయన నైజం అని అందుకే వైయస్సార్ చనిపోతే ఆయన వెనకాలే 700 మంది ప్రాణాలు వదిలారనీ వైయస్సార్ మరణం తరువాత అభిమానులు ఆకాంక్ష కోసం హైదరాబాద్ లో మెమోరియల్ పార్క్ ఏర్పాటు కలగానే మిగిలింది అన్నారు. ఇప్పుడు తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది అని అందుకే సోనియాగాంధీ,రాహుల్ లకు , సీఎం రేవంత్ రెడ్డి లకులేఖ ద్వారా హైదరాబాద్ లో మెమోరియల్ ఉండాలని విజ్ఞప్తి చేశా అన్నారు. వైయస్సార్ జయంతులకు, వర్ధంతులకు అభిమానులు నివాళులు అర్పించేందుకు మెమోరియల్ పార్క్ ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో వైయస్ విజయమ్మ,పి సి సి రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ తులసి రెడ్డి, పులివెందుల నియోజకవర్గ సమన్వయకర్త ధ్రువ కుమార్ రెడ్డి ప్రొద్దుటూరు నియోజకవర్గం సమన్వయకర్త ఇర్ఫాన్, అలాగే జమ్మలమడుగు మరియు కమలాపురం మరియు మదనపల్లి, పీలేరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తిరుమల సమాచారం

## కవచ సమర్పణతో ముగిసిన గోవిందరాజుని జ్యేష్టాభిషేకాలు



**తిరుమల, జూలై 8ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలతిరుపతిదేవస్థానం ఆధ్వర్యంలోని తిరుపతిలోని గోవిందరాజ స్వామి ఆలయంలో ఉత్సవమూర్తులకు జరిపించిన జ్యేష్టాభిషేకాలు మంగళవారం సాయంత్రం శాస్త్రోక్తంగా ముగిశాయి. చివరిరోజు ఉత్సవ మూర్తులకు కవచసమర్పణతో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయంలో నిత్యకైంకర్యాలు ముగిసిన తరువాత ఆలయంలోని కల్యాణమండపంలో శ్రీదేవిభూదేవి సమేత గోవిందరాజస్వామి ఉత్సవమూర్తులకు ఆలయ అర్చకులు వేదోక్తంగా శతకలశస్నపనం, మహాశాంతిహోమం, తిరుమంజనం, సమర్పణ, కవచప్రతిష్ట, ఆరగింపు,అక్షతారోహణం నిర్వహించి బ్రహ్మఘోష వినిపించారు. ఆ తరువాత శాత్తుమొర, ఆస్థానం వేడుకగా జరిగాంది. మధ్యాహ్నం స్వామిఅమ్మవార్లకు కవచ సమర్పణ చేశారు. అంతకుముందు పాలు,పెరుగు, తేనె,చందనం, కొబ్బరిజలంతో ,పండ్లరసాలతో ఉత్సవర్లను అభిషేకించారు. సాయంత్రం ఉభయనాంచారులతో కలసి గోవిందరాజస్వామి ఆలయ నాలుగుమాఢవీధుల్లో ఊరేగి భక్తులకు అభయమిచ్చారు. ఈ కార్యక్రమాల్లో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, ఆలయ డిప్యూటీ ఇఓ విఆర్ శాంతి, ఏఇఓ మునికృష్ణారెడ్డి, ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

## భక్తులకు మంచి సేవలుఅందుతున్నాయి తెలంగాణ ఎస్సీ, ఎస్టీకమిషన్ ఛైర్మన్



**తిరుమల,జూలై 8ప్రభాతవార్తప్రతినిధి:** తెలంగాణా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సుపరిపాలన అందిస్తోందని, ప్రజలంతా అన్ని విధాలా సంతోషంగా ఉన్నారని తెలంగాణ ఎస్సీ ఎస్టీకమిషన్ ఛైర్మన్ బక్కివెంకటయయ్య, సభ్యులు నవీన్, రాంబాబునాయుడు, దేవి తెలిపారు. తిరుమలేశుని దర్శనాలలో తెలంగాణ ప్రజలకు టిటిడి మంచి అవకాశం కల్పించి దేవుని దర్శనాలు చేయిస్తుండటం అభినందనీయమన్నారు. రెండు తెలుగురాష్ట్రాలు అన్ని విధాలా అభివృద్ధి చెందాలని, ప్రజలు సుఖసంతోషాలతోఉండాలని దేవుని ప్రార్థించినట్లు వెంకటయ్య తెలిపారు. సభ్యులతో కలసి ఆయన తిరుమలకు చేరుకుని శ్రీవారిని దర్శించుకు న్నారు. స్వామివారి ఆశీస్సులందుకున్నారు. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## అన్యమత ఆచరణ ఆధారాల ఎఫెక్ట్ ! టిటిడిలో ఎఇఒ రాజశేఖర్‌బాబుపై వేటు

**తిరుమల, జూలై 8ప్రభాతవార్తప్రతినిధి:** హిందూ ధార్మికసంస్థ తిరుమలతిరుపతిదేవస్థానంలో హిందూ మతం ఆచరిస్తానని ఉద్యోగంలో చేరి అన్యమత ఆచారాలు, ప్రార్థనలు చేసుకుంటున్న అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ అధికారి(ఎఇఒ)ఏ.రాజశేఖర్‌బాబుపై టిటిడి వేటువేసింది. ఆయనను సస్పెండ్ చేస్తూ మంగళవారం టిటిడి ఇఒ శ్యామలరావు ఉత్తర్వులిచ్చారు. శ్రీవారి భక్తులు సమర్పించుకుంటున్న కానుకల రూపంలో దేవుని ఖజానానుండి జీతాలు తీసుకుని ఆయన ప్రతి ఆదివారం తిరుపతి జిల్లా పుత్తూరులోని స్థానిక చర్చి ప్రార్థనల్లో పాల్గొంటున్నారు. టిటిడికి అందిన సమాచారంతో టిటిడి ఉద్యోగిగా ఉన్న ఆయన సంస్థ ప్రవర్తనానియమావళి పాటించలేదని భావించడమేగాక హిందూ ధార్మికసంస్థకు ప్రాతినిధ్యం వహించే అధికారిగా ఉండా బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారని తేల్చారు. అన్యమత ప్రార్థనల్లో పాల్గొంటున్నారనే ఆరోపణలపై టిటిడి విజిలెన్స్ విచారణ చేపట్టి సమగ్ర నివేదికను, ఇతర ఆధారాలను సేకరించారు. పరిశీలించిన అనంతరం నిబంధనల ప్రకారం ఆయనపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడంతోబాటు ఆయనను తక్షణమే సస్పెండ్ చేసినట్లు టిటిడి వెల్లడించింది.

## తిరుమలలో డిజిటల్ చెల్లింపులు సులభతరం చేయాలి

### - కౌంటర్‌ల తనిఖీల్లో ఇఒ శ్యామలరావు



**తిరుమల,జూలై 8ప్రభాత వార్తప్రతినిధి:** దేశ విదేశాల నుండి దేవదేవుడు తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనార్థం వస్తున్న భక్తులకు సౌకర్యవంతంగా సేవలందుకునే విషయంలో డిజిటల్ చెల్లింపులు అమలయ్యేలా చూడాలని టిటిడి ఇఒ జె.శ్యామలరావు అధికారులను ఆదేశించారు. ఆలయానికి ఎదురుగాఉన్న బంగారు.వెండి డాలర్ల విక్రయ కేంద్రాల్లోని కౌంటర్లలో జరుగుతున్న అమ్మకాలు, భక్తులు డిజిటల్ చెల్లింపులను ఆయన పరిశీలించారు. డిజిటల్ చెల్లింపులను టిటిడి పెద్దఎత్తునప్రోత్సాహమిస్తోందని, ఈ చెల్లింపులు భక్తులకు అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. ఆలయానికి ఎదురుగా ఉన్న కొబ్బరికాయల కౌంటర్‌వద్ద డిజిటల్ చెల్లింపులకు నెట్‌వర్క్ సక్రమంగా లేదనే ఫిర్యాదులఉఉన్నాయన్నారు. దీన్ని సరిచేసి భక్తులకు అసౌకర్యం కలగకుండా చూడాలని ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవికి ఆదేశించారు. డాలర్ల విక్రయ కౌంటర్ వద్ద భక్తులు సాఫీగా,సులభంగా కొనుగోలుచేసేలా చూడాలన్నారు. తిరుమలకు వచ్చిన భక్తుల రద్దీ పెరిగిన సమయంలో సేవలను సులభంగా అందించాలని ఇఒ శ్యామలరావు అధికారులను ఆదేశించారు. తిరుమలలో లడ్డూవితరణశాలతోబాటు ఆలయానికి ఎదురుగా ఉన్న బంగారు. వెండి డాలర్ల విక్రయాలు కేంద్రాన్ని, అగరబత్తీలు, పుస్తకవిక్రయ కేంద్రాన్ని ఇఒ తనిఖీ చేశారు. భక్తులకు అందిస్తున్న సేవలు గమనించారు. మెరుగ్గాసేవలందించాలని ఆదేశించారు.

## భగవంతుని ఆశీస్సులు అందరికీ ఉండాలి

### - రేమాండ్స్‌అధినేత గౌతమ్‌సింఘానియా



**తిరుమల,జూలై 8ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగ ప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో సేవాకార్యక్రమాలకు శక్తినిచ్చారని, దేవుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని స్వామివారిని కోరుకున్నట్లు రేమాండ్స్ అధినేత గౌతమ్ సింఘానియా తెలిపారు. తిరుమలలో టిటిడి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నారన్నారు. మంగళవారం ఉదయం విఐపి బ్రేక్‌లో ఆయన ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శనం చేయించారు.పండితులు వేదాశీర్వచనం చేశారు. తీర్థప్రసాదాలు అందజేశారు.

## భక్తులతో మర్యాదగా ప్రవర్తించాలి: ట్రాఫిక్ సిఐ హరిప్రసాద్

**తిరుమల, జూలై 8ప్రభాతవార్తప్రతినిధి:** వేంకటేశ్వరస్వామి దర్శనార్థం లక్షమందివరకు భక్తులు తిరుమలకు వస్తున్నారని, వేలాదిమంది భక్తులు తమతమ సొంత వాహనాల్లో చేరుకుంటున్నారని ,భక్తులకు ఎక్కడా అసౌకర్యం లేకుండా చూడాలని తిరుమల ట్రాఫిక్ సిఐ పి.హరిప్రసాద్ కోరారు. భక్తులు తిరుమలలో స్థానికంగా ఉన్న ఆలయాలు, పుణ్యతీర్థాలు, ఆధ్యాత్మిక స్థలాల సందర్శనకు వస్తుంటారని వారికి మర్యాదపూర్వకంగా సేవలందించాలని హితవు పలికారు.


ప్రతి మనిషి ఎంత గొప్పవాడైనప్పటికీ, అతని మెదడుకున్న శక్తిలో శతకోటి భాగం కూడా తన జీవిత కాలంలో ఉపయోగించుకోలేడనేది యథార్థం.

-ఎన్. డుబినిన్

# వారసుడెవరు?

కుటుంబ వ్యవస్థలో ఔరసపుత్రుడే వారసుడిగా మనగలుగుతాడు. సామాజిక వ్యవస్థలోమాత్రం ఒకరి ఆశయాలు ఆకాంక్షలను ముందుకు తీసుకెళ్లగలిగినవాడే వారసుడు కాగలుగుతాడు. అలాంటి అంశాలలో సరైన వారసుడిని ఎంపికచేయడంలో నిబద్ధత కలిగినవారు దొరకడం దుర్లభం. తొంభైయేళ్లు నిండిన దలైలామా మరో 30,40 ఏళ్ల ప్రజాసేవలో ఉండాలని ఆకాంక్షిస్తున్నా వారసునికోసం అన్వేషణ తప్పలేదు. టిబెట్ బౌద్ధమత గురు దలైలామా ఇప్పటికే వారసుడి ఎంపిక ప్రక్రియ కొనసాగుతుందని ప్రకటించారు. బుద్ధుడి బోధనల వ్యాప్తికి విశేషకృషి చేస్తున్న ఆయన 15వ దలైలామా ఎంపిక గురించి ప్రస్తావించగానే భారత్, చైనాల మధ్య ఈ ఎంపిక ప్రక్రియ తమదంటే తమదన్నట్లుగా వాదించుకుంటున్నారు. కరుణ, జాలి కలిగిన సుహృదయంతో జీవించగలిగితే మనశ్శాంతిని పొందగలమని మనసా, వాచా, కర్మణా, ఆయన విశ్వసిస్తారు. టిబెటన్ బౌద్ధానికి దలైలామాయే గురువు. హిమాలయ పరిసర ప్రాంతాల్లో టిబెటన్ బౌద్ధం బాగావ్యాపించి ఉంది. స్థానిక సంస్కృతీ, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను ఆకళింపు చేసుకోవడం ద్వారా టిబెటన్ బౌద్ధం రూపుదిద్దుకొంది. బుద్ధుడు బోధించిన తత్వాలను విస్తృత ప్రాతిపదిక మీద జనబాహుళ్యానికి దగ్గర చేయడమే లక్ష్యంగా పర్వతసానువుల్లో దలైలామా నేతృత్వంలో బౌద్ధమత వ్యాప్తి జరుగుతోంది. టిబెట్‌ను పాలించిన ఎంతో శక్తివంతమైన మంగోళులు సైతం దలైలామా పీఠాధిపత్యాన్ని గౌరవించేవారు. ప్రస్తుత దలైలామా ఎంపిక సమయంలో అప్పటి చైనా ప్రభుత్వం తగినంత ప్రాధాన్యత నివ్వలేదు. టిబెట్ తమ ఆధిపత్యం నుంచిఎక్కడ జారిపోతుందోనని ఆనాటి చైనా పాలకులు దలైలామాను ఇబ్బందుల పాలు చేసినా జంకలేదు. గొంకు లేకుండా నిబ్బరంగా నిలబడ్డారు. 1959లో దలైలామా ఎంపికను చైనాలో కమ్యూనిస్టు ప్రభుత్వం చిక్కుల పాల్జేసింది. సాధారణంగానైతే ప్రతిపాదిత పేర్లను ఓ బంగారు పాత్రలో వేసి లాటరీ తీయడంద్వారా ఎన్నుకోవడం ఆనవాయితీ. తమ అనుమతి పర్యవేక్షణ లేకుండా పీఠాధిపతిని ఎన్నుకోరాదని చైనా లింకుపెట్టింది. లేకుంటే తొలగించే అధికారాన్ని చేజిక్కించుకుంది. ప్రస్తుత దలైలామా విషయంలో అభద్రతా భావం ఏర్పడిన చైనా ప్రభుత్వం 66ఏళ్ల క్రితం ఆయనను అపహరించాలని వ్యూహం పన్నగా టిబెట్‌లో తిరుగుబాటు జరిగింది. ఎంతోమంది టిబెటన్లు ఊచకోతకు గురయ్యారు. అదే సమయంలో టిబెటన్లు దలైలామాను మిలటరీ సైనికుడిలా మారు వేషంలో భారత్‌కు పంపేశారు. చాలామంది టిబెటన్లకు భారత్ ఆశ్రయమిచ్చింది. టిబెట్ విషయంలో దలైలామా చైనాకు కొరకరాని కొయ్యగా మారాడు. భారత్‌లో టిబెట్ శరణార్థులకు ప్రత్యేక పునరావాస కేంద్రాలున్నాయి. వాటికి పలు సౌకర్యాలు కోవాలని భారత ఎంపీలు ఫోరమ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తోంది. దలైలామా 90వ పుట్టిన రోజు వేడుకల సందర్భంగా వారసుని ఎంపికలో ఆయన అంతరార్థం బయటపడింది. పుట్టిన రోజు వేడుకలు తనకిష్టం లేదని, పలు సమూహాలకు కరుణ, పరోపకారాన్ని గురించి సందేశాలు చేరతాయన్న ఆలోచనలను అభినందించారు. బ్రెజిల్‌లోని రియో డి జనీరోలో ఉన్న భారత ప్రధాని నరేంద్రమోడీ దలైలామాను అభినందిస్తూ 1.4బిలియన్ల భారతీయుల తరపున శుభాకాంక్షలు తెలిపారు. ఇదే సమయంలో అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో కూడా పుట్టిన రోజు శుభాకాంక్షలు అందచేశారు. ఇవే చైనాకు కంటక ప్రాయమయ్యాయి. సరిగ్గా దలైలామా వారసుడి ఎంపిక సమయంలో టిబెటన్ బౌద్ధానికి ఆ బౌద్ధపీఠానికి అందుతున్న ప్రశంసల వెల్లువ నేపథ్యంలో టిబెట్ మీద తమ పట్టు కోల్పోతామన్న ఆందోళన చైనాలో బయలుదేరింది. ఇలా వారసుడి ఎంపికలో భారత్, చైనాలమధ్య వ్యాఖ్యలు, వ్యాఖ్యానాల యుద్ధం మొదలైంది. ఆది నుంచీ దలైలామా టిబెట్‌కు సమాంతర ప్రభుత్వాన్ని నడుపుతున్నారని చైనా ఆరోపణ. ఇలా అనుకున్నప్పుడు దలైలామా గుర్తింపు రద్దు చేయచ్చుననే నిబంధన తన వద్దనే ఉంచుకున్న చైనా ప్రభుత్వం అలాంటి ప్రయత్నాలేమీ చేయడం లేదు. కానీ అడుగడుగునా దలైలామాకు ఆటంకాలు ఏర్పరచడమే పనిగాపెట్టుకుంది. దలైలామా వారసుడిని బీజింగ్ ఆమోదించిన పద్ధతుల ప్రకారమే ఎంపిక జరగాలని, టిబెట్ సంబంధిత విషయాల్లో భారత్ జాగ్రత్తగా వ్యవహరించాలని ఇటీవల చైనా విదేశాంగ శాఖహెచ్చరించింది. టిబెటన్ బౌద్ధమతంలో లివింగ్ బుద్ధాపునర్జన్మ 700ఏళ్లకు పైగా కొనసాగుతున్న ఒక చారిత్రిక, సంప్రదాయమని దానిని కొనసాగించే విషయమై నిర్ణయాధికారం దలైలామాకు లేదని భారత్‌లో చైనా రాయబారి జు ఫెయిహాంగ్ వివరించారు. కాగా చైనా చట్టాలు, మతపరమైన ఆచార వ్యవహారాల ప్రకారమే పునర్జన్మ ప్రక్రియ జరుగుతుందని కూడా వారి వాదనలో భాగం. చైనా ఆస్థిత్వ రీత్యా వారి వాదన వారిది. మత విశ్వాసాలు, నమ్మకాలకు సంబంధించిన విషయాల్లో జోక్యం చేసుకునేందుకు భారత ప్రభుత్వం సిద్ధంగా లేదు. పైగా పునర్జన్మ పూర్తిగా మతపరమైన అంశమైనందున ఇతరుల జోక్యం సరికాదంది. మరోపక్క చైనా వ్యాఖ్యలను టిబెట్ ప్రవాస ప్రభుత్వం ఖండిస్తూ టిబెట్ల గుర్తింపును మటుమాయం చేసేందుకు చైనా సాంస్కృతిక మారణహోమానికి పాల్పడుతోందని ప్రవాస ప్రభుత్వ అధ్యక్షుడు పెన్పా త్సెరింగ్ ఆరోపించారు. పుట్టిన రోజు నాటి ప్రసంగంలో దలైలామా సవివరంగా కొన్ని అంశాలను స్పష్టం చేశారు. భారత్‌లో ప్రవాస జీవితం గడుపుతున్నప్పటికీ, తాను స్థాపించిన భారత్ ఆధారిత 'గాడెన్ ఫోడ్రాంగ్ ట్రస్ట్' మాత్రమే తన వారసుడిని ఎంపిక చేయగలదని తేల్చిచెప్పారు.

ప్రపంచాన్ని అర్థం చేసుకోవాలనే కోరిక, దాన్ని మార్చాలనే ఆకాంక్ష మానవ ప్రగతికి ప్రధాన ప్రేరకాలు.



బెర్ట్రండ్ రస్సెల్

బంగారంలోని ప్రతి కణానికి విలువ ఉన్నట్లే జీవితంలోని ప్రతిక్షణానికి విలువ ఉంది.



జార్జి ఎలియట్

# ప్రజావాక్కు



## నత్తనడకన సాగుతున్న రోడ్డు పనులు

హైదరాబాద్ ఘట్కేసర్ నుండి నాగారం వెళ్లే పది కిలో మీటర్లదూరం ఉన్న రోడ్డుపనులు నత్తనడకన సాగడంతో వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతూ వున్నారు. గుత్తేదారుపనిప్రారంభించి ఏడాదిగడిచి నెమ్మదిగా పనులు చేస్తుండంతో ఈ రహదారి గుండా వెళ్లే వారు దుమ్ము ధూళితో అవస్థలుపడుతూ వున్నారు. నిత్యం రోడ్డు ప్రమాదాలు జరిగి వాహనదారులు మృత్యు వాత పడుతూ వున్నారు. వంద ఫీట్స్ వెడల్పుతో రోడ్ ఘట్కేసర్ నుండి యమన్ పేట రాంపల్లి ఎక్స్ రోడ్ సత్యనారాయణ కాలనీ ఆర్‌ఎల్ నగర్‌మీదుగా నాగారం వెళుతుంది. వివిధ ప్రాంతాలలో ఉద్యోగాలు చేసి వారు కార్మికులు వివిధ పనుల నిమిత్తం వెళ్లే వారు ఆలస్యంగా పోతున్నారు. తక్షణమే సంబంధిత అధికారులు ప్రజా ప్రతినిధులు స్పందించి రోడ్డు మరమ్మతు పనుల లో వేగం పెంచాలి.

- కామిడి సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి జిల్లా

## ఇతర డిపార్ట్మెంట్ జోక్యం తగదు

జులై పదో తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని స్కూళ్ళలో జరుగబోవు మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ కొరకు లీప్‌యాప్‌లో విట్నెస్ రిజిస్ట్రేషన్ అన్నిస్కూల్స్‌లో చేయాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. విట్నెస్‌గా విద్యాశాఖలో పని చేస్తున్న ఉద్యోగులు కాకుండా వేరే ఏదో ఒక డిపార్ట్ మెంట్‌కు చెందిన ప్రభుత్వ ఉద్యోగిని రిజిస్ట్రేషన్ చెయ్యాలని చెబుతున్నారు. ఈవిట్నెస్‌గా ఉన్న వ్యక్తి సమావేశం రోజున 30 సెకండ్ల వీడియో4 ఫోటోలను అప్లోడ్ చెయ్యాల్సి ఉంటుంది. స్కూళ్లలో జరిగే తల్లిదండ్రుల ఉపాధ్యాయుల సమావేశాలలో స్కూళ్ళలో వేరే డిపార్ట్మెంట్ వారి జోక్యం తగదు. దీనికి స్కూళ్లలోని టీచర్లనే వాడాలి. దీన్ని పూర్తిగా ప్రభుత్వం విరమించుకోవాలి.

- వాసిలి సురేష్, నెల్లూరు జిల్లా

## ఆదాయ మార్గాలను సృష్టించాలి

ఇటీవల కాలంలో కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు సంక్షేమ పథకాలకు విపరీతంగా ఖర్చు చేస్తున్నాయి. ఇది దీర్ఘకాలంలో ఆర్థిక అస్థిరతకు దారితీస్తుంది. వీలైనంత త్వరగా ప్రభుత్వాలు సంక్షేమ పథకాలకు కోత విధించి ఆదాయ మార్గాలను సృష్టించాలి. ఉచిత పథకాలను ఎత్తివేసి ఆదాయ మార్గాలను సృష్టించి ఉపాధి అవకాశాలు కల్పించాలి .

- టి.ముత్యం, సిద్దిపేట జిల్లా

## ఫీజు రిఫండ్ పథకం

ప్రైవేటు విద్యాసంస్థలు ఒకపద్ధతిలేకుండా ఇష్టారాజ్యంగా ముందుచూపు లేకుండా ఫీజులు పెంచుతున్నందున మధ్య తరగతి, పేద కుటుంబాలపై భారంగా మారింది. ఒక్కో విద్యార్థి వార్షిక ఫీజు లక్షల్లో వుండగా అడ్మిషన్ ఫీ, ల్యాబ్ ఫీ, యాక్టివిటీచార్జ్, ట్రాన్స్‌పోర్ట్ ఫీవంటి అదనపు ఖర్చులు తల్లిదండ్రుల ఆర్థిక స్థిరత్వాన్ని కుప్పకూలుస్తున్నాయి. ఈనేపథ్యంలో ప్రభుత్వం ఐదుదశలలో చర్యలు చేపట్టాలి. ఫీజు నియంత్రణ సంఘాన్ని జిల్లాల స్థాయికి విస్తరించి, ప్రతి స్కూల్ తమ ఫీజు నిర్మాణాన్ని సంవత్సరంముందే ఆన్‌లైన్‌లో ఉంచే విధానాన్ని తప్పనిసరి చేయాలి. అనుమతి లేకుండా 10శాతం కంటే ఎక్కువ పెంచిన విద్యాసంస్థలపై లైసెన్సు రద్దు వరకు చర్యలు పాటించాలి. పేద విద్యార్థు లకు ఫీజు రీఫండ్ పథకం విస్తరించి, డిబిటి పద్ధతిలో ప్రత్యక్షంగా ఖాతాల్లోజమచేయాలి. పారదర్శకత కోసం మొబైల్‌యాప్ తల్లిదండ్రులు ఫీజుల వివరాలు, ఫిర్యాదులు ఒకే ప్లాట్‌ఫాంలో నమోదు చేసేలా రూపొందించాలి.

-సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

## రిటైర్డ్ ఉద్యోగులకు ఆరోగ్య భిక్ష పెట్టండి

పవిత్ర గోదావరి నదీ పరివాహక ప్రాంతంలో ఉద్భవించినది సింగరేణిబొగ్గగనుల సిరులతల్లి గోదావరి. తెలంగాణకు సాగు, త్రాగు, పరిశ్రమలకు ఇతరత్రా ఉపయోగపడుతున్న విధంగా సింగరేణి కూడా అదేవిధంగా బృహత్తర విస్తృత స్థాయిలో నిధులు అందించి దాదాపు ప్రతి ఒక్క రంగానికి నిధులు సమకురుస్తూ రాష్ట్ర సర్వతో ముఖాభివృద్ధికి తోడ్పడుతున్నది. ప్రతి సంవత్సరం గణనీయమైన లాభాలుగడుస్తున్నది. కానీ బొగ్గును ఉత్పత్తి చేసి లాభాలు గడించుటకు సర్వశక్తులు ధార పోసిన రిటైర్డ్ ఉద్యోగుల పట్ల సింగరేణి తల్లి కనికరం చూపడం లేదు. వైద్యసౌకర్యాలు అందక ఆచేతన స్థితిలో బతుకుతున్నారు.

- దండంరాజు రాంచందర్ రావు, హైదరాబాద్

## నిరుపేదలకు పథకాల ఫలాలు అందాలి

ఐర్లాండ్ రాజ్యాంగం నుండి గ్రహించిన ఆదేశికములకు చాలా ప్రాశస్తంఉంది. బహుశా రాజ్యం తనపరిపాలన ఎలా కొనసాగించాలి అనేది అందులోఉంటుంది. కానీ రాజ్యం ఆవైపుగా ప్రయత్నం చేస్తుందా, ఆ దిశగా పోతోందా అన్నదే అసలు ప్రశ్న. నిరుపేదలకు ప్రభుత్వ ఫలాలు అందాలి అని ప్రభుత్వం పథకాలు నిర్దేశన చేస్తుంది. కానీ అమలులో ఆవైపుగా ప్రయాణం చేస్తున్నామ అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న.

-భారత అవినాష్, జనగామ

మనవి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# రైతుకు భరోసా కాగితాల్లోనేనా?

**రాష్ట్ర రెవెన్యూ శాఖలు, భూసమోదిత శాఖలు, వ్యవసాయ శాఖల మధ్య సమన్వయంతో రైతుల ఖతా వివరాలు, సాగు స్థితి వంటి సమాచారం కేంద్రానికి అందేలా వ్యవస్థను రూపొందించాలి. అలాగే గ్రామీణ స్థాయిలో పథకం వివరాలపై అవగాహన కల్పించి, అర్హత కలిగిన ప్రతి రైతుకు లబ్ధి చేకూరేలా చూడాలి. ఇన్ని విషయాలపై కేంద్రం తక్షణ నిర్ణయం తీసుకుని పథకాన్ని సమర్థవంతంగా రూపురేఖలు మార్చాలి. మార్గదర్శకాల్లో మార్పులు చేయడం, పథకం లబ్ధిని పెంచడం ద్వారానే నిజమైన రైతు సంక్షేమం సాధ్యమవుతుంది. రైతు ఓటువేస్తాడు -కానీ అంత కంటే ముందు పంట వేస్తాడు. ఆపంట నిలదొక్కుకుంటేనే దేశ ఆహార భద్రత నిలబడుతుంది. అలాంటి రైతుకు తక్షణ భరోసా కల్పించడమే ప్రభుత్వం కర్తవ్యంగా తీసుకోవాలి. ప్రధాని మోడీ నేతృత్వంలోని ప్రభుత్వం గతంలో రైతుల కోసం అనేక సంకల్పాలు చేసింది. ఇప్పుడు ఆ సంకల్పాన్ని నిజంగా కార్యరూపంలోకి తేవాలంటే, పీఎం కిసాన్ పథకాన్ని నూతనంగా ఆవిష్కరించాలి. లక్షలాది మంది రైతులను నిబంధనల పేరుతో పక్కన పెట్టకుండా, వారికి ఆర్థిక ప్రోత్సాహాన్ని పెంచుతూ ముందుకు తీసుకెళ్లాలి.**

అప్పన్న గొనప

దేశంలోని రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం 2019లో ప్రవేశపెట్టిన ప్రధాని కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం కిసాన్) పథకం, ప్రారంభంలో ఎంతో ఆశాజనకంగా కనిపించింది. అర్హత కలిగిన రైతు కుటుంబానికి ఏటా రూ.6,000 నేరుగా వారి ఖాతాల్లో జమ చేసే విధంగా రూపొందిన ఈ పథకం, రైతులకు సీజనల్ ఖర్చులకు కొంత ఉపశమనం కలిగించేలా రూపొందించబడింది. పథకం తొలి నిబంధనల ప్రకారం, 2019 ఫిబ్రవరి 1 నాటికి ఎవరి పేరున భూమి ఉందో వారే ఈ పథకానికి అర్హులు. అయితే, తర్వాత భూమిని కొనుగోలు చేసినవారు, గిఫ్ట్ డీడ్, పార్టీషన్ లేదా వారసత్వంగా భూమి పొందిన రైతులు పథకానికి అనర్హులుగా ప్రకటించబడ్డారు. ఈ మార్గదర్శకాలు 2020 మార్చి 29న కేంద్రం జారీ చేసి, ఐదేళ్లపాటు అమల్లో ఉంటాయని ప్రకటించింది. ఇది వేలాది మంది చిన్న, సన్నకారు రైతులకు న్యాయం జరగకుండా అడ్డుపడుతోంది. ఈ 'కట్‌ఆఫ్' నిబంధన వాస్తవిక పరిస్థితులకు పూర్తిగా విరుద్ధం. రైతు జీవితంలో భూమి కొనడం, అమ్మడం, పంచుకోవడం సహజం. వాటిని ఆధారంగా తీసుకుని, నేడు సాగు చేస్తున్న రైతును మద్దతుకు అనర్హుడిగా ప్రకటించడం అన్యాయం. 2019 తర్వాత భూమిని సొంతం చేసుకున్న రైతు కూడా అదే విధంగా సాగు చేస్తుంటే, అతనిని ఎందుకు పథకం బయట ఉంచాలి? ఇకనైనా కేంద్ర ప్రభుత్వం ఈ విషయాన్ని పునః సమీక్షించి, మార్గదర్శకాలను రైతు ప్రయోజనాలకు అనుగుణంగా సవరించాలి. ప్రస్తుతం ఎవరి పేరు మీద భూమి ఉందో, ఎవరు నెరిసి సాగు చేస్తున్నారు అనే అంశాల ఆధారంగా అర్హతను నిర్ధారించాలి. ప్రస్తుతం కొనసాగుతున్న నిబంధనల వల్ల వేలాది మంది చిన్న రైతులు కేంద్రం ఇచ్చే సహాయాన్ని కోల్పోతున్నారు. ఇది కేవలం నిబంధనల సమస్య కాదు - రైతుల జీవితాల్లో నేరుగా ప్రభావం చూపే మానవీయ సమస్య. ఇక ఇదే తరుణంలో మరొక కీలక అంశం - ఈ పథకం ద్వారా ఇచ్చే ఆర్థిక సహాయం మొత్తాన్ని పెంచాల్సిన అవసరం. 2019లో పథకం ప్రారంభమైనప్పుడు, సంవత్సరానికి రూ.6,000 ఇవ్వడం రైతులకు కొంత ఉపశమనం కలిగించేది. కానీ ఇప్పుడు పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. వ్యవసాయ ఉత్పత్తి వ్యయం రెండింతలైంది. ఎరువుల ధరలు పెరిగాయి, విత్తనాలు ఖరీదయ్యాయి, కూలీలకి మజ్దూరులు ఇవ్వాల్సిన ఖర్చుపెరిగింది.



వాతావరణ మార్పుల ప్రభావంతో పంటలకు నష్టాలు కూడా ఎక్కువయ్యాయి. ఇలాంటి సమయంలో ఒక రైతు కుటుంబానికి ఏడాదికి కేవలం రూ.6,000 ఇవ్వడం ద్వారా ఎలాంటి ఉపశమనం కలుగుతుంది? నెలకు 500 రూపాయలు మాత్రమే వస్తున్నాయంటే, అది సాగు అవసరాలే కాదు, నిత్యవసరాల కోసం కూడా సరిపోదు. కనీసం ఈ పథకం ద్వారా అందే మొత్తాన్ని రూ.10,000కి పెంచాలని కేంద్రం పునరాలోచించాలి. అంటే మూడు విడతల్లో రూ. 3,333 చొప్పున ఇవ్వడం ద్వారా రైతుకు కొంత మెరుగైన భద్రత కలిగించవచ్చు. ఈ మొత్తాన్ని పెంచడం వల్ల ప్రభుత్వంపై కొంత భారం పడవచ్చు. కానీ దీన్ని వ్యయంగా కాక, పెట్టుబడిగా చూడాలి. రైతు చేతిలో డబ్బు ఉంటేనే ఆయన ఖర్చులు చేస్తారు. ఖర్చులు చేస్తేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కదులుతుంది. అది కేవలం రైతులే కాదు, కూలీలకు, వ్యవసాయ ఉపకరణాల విక్రేతలకు, చిన్న వ్యాపారులకు లబ్ధి చేకూర్చుతుంది. అంటే ఈ చర్య దేశ ఆర్థిక వ్యవస్థకే లాభకరమైనదిగా మారుతుంది. ఇప్పటి పరిస్థితుల్లో రైతుల స్థితిగతులు గణనీయంగా మారాయి. పాత గణాంకాల ఆధారంగా తీసుకున్న నిర్ణయాలను ఇక కొనసాగించడంసరికాదు. భూమి యాజమాన్యం ఆధారంగా అర్హతను నిర్ణయించడమే కాదు -వారి ప్రస్తుత పరిస్థితిని పరిగణలోకి తీసుకుని, రైతు నిజంగా సాగుచేస్తున్నాడా, అసలైన లబ్ధిదారుడా అనే దానిని గుర్తించాలి. ఆధార్, భూమి నమోదు, బ్యాంక్ లింకింగ్ వంటి ఆధారాల ద్వారా ఈ ప్రక్రియను మరింత సులభంగా చేయొచ్చు. ఇక రాష్ట్ర ప్రభుత్వాల పాత్ర కూడా ఇందులో ముఖ్యమైనది. రాష్ట్ర రెవెన్యూశాఖలు, భూసమోదితశాఖలు, వ్యవసాయ శాఖల మధ్య సమన్వయంతో రైతుల ఖతా వివరాలు, సాగు స్థితి వంటి సమాచారం కేంద్రానికి అందేలా వ్యవస్థను రూ పొందించాలి. అలాగే గ్రామీణ స్థాయిలో పథకం వివరాలపై అవగాహన కల్పించి, అర్హతకలిగిన ప్రతి రైతుకు లబ్ధి చేకూ రేలా చూడాలి. ఇన్ని విషయాలపై కేంద్రం తక్షణ నిర్ణయం తీసుకుని పథకాన్ని సమర్థవంతంగా రూపురేఖలు మార్చాలి. మార్గదర్శకాల్లో మార్పులు చేయడం, పథకం లబ్ధినిపెంచడం ద్వారానే నిజమైన రైతు సంక్షేమం సాధ్యమవుతుంది. రైతు ఓటువేస్తాడు -కానీ అంత కంటే ముందు పంట వేస్తాడు. ఆపంట నిలదొక్కుకుంటేనే దేశ ఆహారభద్రతనిలబడుతుంది. అలాంటి రైతుకు తక్షణ భరోసా కల్పించడమే ప్రభుత్వం కర్తవ్యంగా తీసుకోవాలి. ప్రధాని మోడీ నేతృత్వంలోని ప్రభుత్వం గతంలో రైతుల కోసం అనేక సంకల్పాలు చేసింది. ఇప్పుడు ఆ సంకల్పాన్ని నిజంగా కార్యరూపంలోకి తేవాలంటే, పీఎం కిసాన్ పథకాన్ని నూతనంగా ఆవిష్కరించాలి. లక్షలాది మంది రైతులను నిబంధనల పేరుతో పక్కన పెట్టకుండా, వారికి ఆర్థిక ప్రోత్సాహాన్ని పెంచుతూ ముందుకు తీసుకెళ్లాలి. ●

# 'మండలి'లో చేరికకు ఎన్ని మెట్లెక్కాలి?

కనుమ ఎల్లారెడ్డి

ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో భారత్ చేరిక ఊరిస్తోంది. భారత్ ప్రధాని మోడీ ఏ దేశ పర్యటనకు వెళ్ళినా భారత్‌కు భద్రతా మండలిలో శాశ్వత సభ్య స్థానం ఉండాల్సిందే అని ఆయా దేశాలు నొక్కి చెప్పడం గమనార్హం. మోడీ ఇటీవల బ్రిక్స్ సమావేశానికి వెళ్ళినప్పుడు ఐక్యరాజ్య సమితిలో భారత్‌కు శాశ్వత సభ్యస్థానం ప్రస్తావించారు. శాశ్వత స్థానం భారత్ పొందిన కొన్ని రాజకీయ కారణాల వల్ల కొన్ని దేశాలు అడ్డుపడుతున్నాయి అనేది నగ్న సత్యం. ముఖ్యంగా చైనా, పాక్ దేశాలకు భారత్ భద్రతా మండలిలో చేరడం సుతరాము ఇష్టం లేదు. పాక్, చైనా రాజకీయాల వలన భారత్ చేరిక ఉండటం లేదు. ఒక దశలో అమెరికా కూడా భారత్ చేరికపై అసంతృప్తి వ్యక్తం చేసిన సందర్భాలు ఉన్నాయి. ఆసియా ఖండంలో భారత్ చేరితే చైనా 'ప్రభ' తగ్గుముఖం పట్టడం ఖాయం. ముందు పాక్ ఎట్టి పరిస్థితిలోను ఒప్పుకోదు. పాక్ భద్రత మండలిలో శాశ్వత సభ్య దేశం కాకున్నా భారత్ చేరికను చైనాతో లేక అమెరికాతో అడ్డుకునే ప్రయత్నాలు చేస్తుంది. భారత్‌ను ధైర్యంగా ఎదుర్కొనే సాహసం చేయక శిఖరాగ్ర సమావేశాలలో భారత్‌ను దోషిగా చూపెట్టి తను లాభపడాలని చూసి భంగపడినా తన వైఖరి మార్చుకోవడం లేదు. భారత్ ప్రధాని సందర్శించిన పలు దేశాలలో భద్రతా మండలిలో భారత్‌కు మా మద్దతు ఉంటుంది అని చెప్పినా ప్రయోజనం శూన్యం. రష్యా, ఫ్రాన్స్ దేశాలు భారత్‌కు మద్దతు తెలిపినా చైనా వీటో చేస్తుంది. అమెరికా బ్రిటన్ దేశాలు చైనా ఆ పని చేస్తుందని తెలిసి మౌనంగా ఉంటాయి. రాజకీయం అంటే అదే. విశ్వంలో భారత్‌కు ఐక్యరాజ్య సమితి, భద్రతా మండలిలో పాక్, చైనా తప్పితే దాదాపు ప్రతి దేశం భద్రతా మండలిలో స్థానం ఉండాల్సిందే అని చెప్పినా ఆ దిశలో చర్యలు లేవు. ఐక్యరాజ్య సమితి, భద్రతా మండలిలో అమెరికా పెత్తనం ఉంది. ఎందుకంటే సమితికి భారీ నిధులు ఒక్క అమెరికా నుంచే అందుతున్నాయి. ఆరవ శాశ్వత సభ్య దేశం చేరాలంటే ముందు ఆయా దేశాల కున్న 'వీటో' పవర్ రద్దు చేయాలి. 'వీటో' పవర్ ఎట్టి పరిస్థితులలోనూ రద్దు కాదు. ఎన్నో సంస్కరణలతో అమెరికాను నడిపిస్తున్న డోనాల్డ్ ట్రంప్ భద్రతా మండలిలో ఆరవ దేశంగా భారత్‌ను చేర్చుకోవాలి. ఏ తీర్మానంచేయకనే



అమెరికా, భారత్‌ను ఆహ్వానించాలి. భారత్‌తో పాటు జర్మనీ, దక్షిణ ఆఫ్రికా, బ్రెజిల్ మొదలగు దేశాలు కూడా ముందు వరుసలో ఉన్నాయి. ఒకవేళ భారత్ చేరకుండా మిగతా దేశాలు చేరితే మాత్రం భద్రతా మండలికి అంత హంగు ఉండదు. భారత్ చేరితేనే సమితికి కళ. భారత్ అతి త్వరలో భద్రతా మండలిలో శాశ్వత సభ్య దేశంగా చేరాలి. యుద్ధాలకు ఒక దేశానికి ఒకదేశం మద్దతు ఎలా ఇస్తున్నాయో అలాగే భారత్ సభ్యదేశంగా చేరడానికి కూడా అన్ని దేశాలు మద్దతు ఇవ్వాలి. ప్రస్తుత కాలంలో జరుగుతున్న వివిధ దేశాల యుద్ధాలు ప్రతి దేశంపై ప్రభావం చూపుతున్నాయి. రష్యా, ఉక్రైన్ యుద్ధం రోజు రోజుకు ఉధృతం అవుతోంది. ఈ యుద్ధం ఇలాగే దీర్ఘకాలం కొనసాగినా ఆశ్చర్యపోనవసరం లేదు. శాంతికి కృషి చేయాలనే ఆలోచన ఏ దేశానికి లేదు. మొన్నటికి మొన్న రష్యా దాదాపు 400పైనే డ్రోన్‌ల దాడి చేసింది. ఇది రష్యా చరిత్రలోనే అతి పెద్దదాడి. ఇంతకు మునుపు ఎప్పుడు రష్యా అలా చేసింది లేదు. ఉక్రెయిన్ కూడా కొన్నింటిని కూల్చేశామని చెబుతోంది. జరిగిన నష్టం రెండు దేశాలకు అపారం. నిజానికి అక్కడి పౌరులు బిక్కుబిక్కు మంటూ జీవనం సాగిస్తున్నారు. శాంతికి అడుగు పడకపోవడం శోచనీయం. ఇదిఇలా ఉంటే యుద్ధాన్ని మరో కోణంలోకి రష్యా తీసుకుపోవడం భయభ్రాంతులను చేస్తోంది. అదేమిటంటే తాజాగా రష్యాకు ఉత్తర కొరియా పూర్తిగా మద్దతు ఇస్తోంది. రష్యాకు సహకారాన్ని ఇస్తోంది. ఉక్రైన్ చెప్పినట్లు రష్యా, ఉత్తర కొరియా సైన్యాన్ని వినియోగిస్తోం దని భోగట్టా. ఉత్తర కొరియా సేనలు రష్యాకు అండగా నిలబడటం చూస్తే యుద్ధం ఇప్పట్లో ముగిసేలా లేదు. 30వేల మంది ఉత్తర కొరియా సేనలు రష్యా సైన్యంలో చేరితే మాత్రం ఉక్రెయిన్ కొత్త చిక్కులను ఎదుర్కోవాల్సి వస్తుంది. శాంతిని కాంక్షించాలని టర్కీ ప్రయత్నం విఫలమైంది. ఇప్పుడు ఏ దేశం కూడా రష్యా, ఉక్రైన్ యుద్ధం ఆపటానికి ముందుకు రావడంలేదు. కారణంరెండు దేశాల నేతలకు శాంతి అనే మాటగిట్టడం లేదేమో అనిపిస్తోంది. లేకపోతే యుద్ధం పురిట్లోనే ఆగిపోయి ఉండేది. యుద్ధాన్ని ఆపుతానన్న ట్రంప్ కూడా ఏమిచేయలేని స్థితి. రష్యాకు, ట్రంప్ గట్టిగా చెప్పలేదు. కారణంరష్యా, అమెరికా దేశాలు భద్రతా మండలిలో శాశ్వత సభ్య దేశాలు. చెప్పినా రష్యా ఏమేరకు వింటుందో లేదో అనే అనుమానం. ఉక్రెయిన్‌కు మాత్రం అమెరికా తగిన సహాయం చేస్తోంది. అది కొన్ని షరతులకు లోబడి. యుద్ధం ఆగిపోవాలంటే ఉక్రెయిన్‌ను ట్రంప్ గట్టిగా హెచ్చరిస్తే ఆగిపోతుంది. మరి ఎందుకు ట్రంప్ ఉక్రెయిన్ ను వారించలేదో అర్థం కాలేదు. రష్యా మాత్రం తన పని తాను చేస్తోంది. భీకర దాడులతో ఉక్రెయిను బెంబేలు ఎత్తి స్తోంది. ఇలా ఈ రెండు దేశాల పోరులో నలిగి పోయేది మాత్రం ప్రజలే. ●

# రహదారి భద్రతా విభాగాలు గణాంకాల సేకరణకే పరిమితం!



మేకిరి దామోదర్

మన దేశంలోని రాష్ట్రాల్లో రోడ్డు రవాణా మార్గాలైన జాతీయ, రాష్ట్ర, జిల్లా రహదారులన్నీ చాలా వరకు అభివృద్ధి చెందాయి. ప్రజలను, వస్తువులను గమ్యస్థానాలకు (ప్రయాణాలు)చేరవేయడంలో వేగం, కాలం, దూరాలు తగ్గినాయి. ఇలా సౌకర్యాలు పెరగడంతో వీటిపై ప్రయాణించే అన్నిరకాల వాహనాలు రోడ్డు భద్రతా నియమాలు, ట్రాఫిక్ (నియంత్రణ) సూచనలు పాటించకపోవడంతో మద్యపానం తాగడం, మితిమీరిన వేగం వల్ల ఆక్సిడెంట్ల రోడ్డు ప్రమాదాలు నానాటికీ పెరుగుతున్నాయి. ఇలా గత ఏడాది రోజుకు సరాసరిన 71 రోడ్డు ప్రమాదాలు, 19 మరణాలు జరిగినాయి. రాష్ట్ర రవాణా శాఖలెక్కల ప్రకారమే 2015 నుంచి 2024 వరకు చనిపోయిన వారి సంఖ్య 71,052. రోడ్డు ఎక్కితే క్షేమంగా ఇంటికి తిరిగి వస్తామో, రామో తెలియని పరిస్థితికి ఈ గణాంకాలే నిదర్శనం. నానాటికీ సమస్య తీవ్రమోతుంది తప్ప చక్కదిద్దే చొరువ కనిపించడం లేదు. రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలు నివారణకు ప్రత్యేకంగా పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన దశాబ్దకాలంగా సహకారం కాకపోవడం అందుకు దర్పణం పడుతుంది. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన తక్షణ చర్యలపై ఆరునెలలకోసారి సంబంధిత శాఖలతో సమన్వయ సమావేశం నిర్వహించాల్సి ఉన్నా, కొన్నేళ్లుగా నిర్వహించడం లేదు. గత ఏడాది (2023 డిసెంబర్ నుంచి 2024 డిసెంబర్ వరకు) రాష్ట్రంలో 25,934 రోడ్డు ప్రమాదాలు జరగగా, 7,281 మంది మరణించారు. జాతీయ ఉపరితల రవాణా శాఖ గణాంకాల ప్రకారం జాతీయ రహదారులపై జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో తెలంగాణ 8వ స్థానంలో, మరణాల్లో 9వ, స్థానంలో ఉంది. రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాల తీవ్రత ఏస్థాయిలో ఉందో తెలిపే గణాంకాలివి. 2002లో ప్రత్యేకంగా రహదారి భద్రత విభాగాన్ని ఏర్పాటు చేసింది. సాధారణ పరిపాలన శాఖ (జీఏడి)ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ విభాగం అప్పటి నుంచి ఉత్సవ విగ్రహంగానే మిగిలింది. తర్వాత కాలంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో మరో ప్రత్యేక రహదారి భద్రత విభాగం ఏర్పాటు చేశారు. దీని ద్వారా ఎప్పటికప్పుడు రోడ్డు ప్రమాదాలు, మరణాలు, క్షతగాత్రులు ఎందరో లెక్కల సేకరిస్తుంటారు తప్ప, నియంత్రణకు అవసరమైన చర్యలు అందుకు అవసరమైన వసతులు మాత్రం సమకూర్చడం లేదు. రాష్ట్ర పరిధిలో రోడ్డు ప్రమాదాలు గణనీయంగా తగ్గించే లక్ష్యంతో అన్ని జాతీయ, రాష్ట్ర రహదారుల వెంట ప్రతి 50 కిలోమీటర్ల ఒక పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ప్రతిపాదించారు. ప్రతి ఠానాకు ఓ వాహనం, ఒక ఎస్సై, నలుగురు హెడ్ కానిస్టేబుళ్లు, 12 మంది కానిస్టేబుళ్లు, 8 మంది హోంగార్డులు ఉండాలని ప్రతిపాదించారు. సిబ్బందికి బ్రీత్ ఎనలైజర్లు, వేగాన్ని యంత్రించే స్పీడ్‌గన్లు అందించి, హైవేలపై నిరంతరం తనిఖీలు నిర్వహించడం ద్వారాప్రమాదాలను నియంత్రించాలని నిర్ణయానికి వచ్చారు. ఎక్కడైనా



ప్రమాదం జరిగినప్పుడు గంటలోపే (గోల్డెన్ అవర్) అక్కడికి చేరుకొని చికిత్స అందించడం ద్వారా బాధితుల ప్రాణాలు కాపాడేందుకు ప్రణాళిక రూపొందించారు. ఖర్చులను అంచనా వేశారు. ఈ ప్రతిపాదన ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదు. ప్రతి ఆరు నెలలకోసారి పోలీసు, రవాణా, రోడ్డు భవనాలు, ఆరోగ్యశాఖలతో ఉన్నతస్థాయి సమీక్షనిర్వహించి, రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించాలి. మూడేళ్లుగా ఈ సమావేశం కూడా నిర్వహించకపోవడం గమనార్హం. రాష్ట్రంలో ప్రమాదాలు, మరణాలు పెరగడానికి ఈ నిర్లిప్తత ప్రధాన కారణమని విమర్శలున్నాయి. దీనికి తోడు జీవితకాల ముగిసినా వాహనాలు రోడ్లపై (ఫిట్నెస్ లేనివి)పరుగులు పెడుతున్నాయి. మన రాష్ట్రంలో కాలం చెల్లిన వాహనాల సంఖ్య భారీగా పెరుగుతోంది. రిజిస్ట్రేషన్ జరిగిన ఏడాది బట్టి చూస్తే మొత్తం 42.78 లక్షల వాహనాలకు జీవితకాలం ముగిసినా రోడ్లపై నడిపిస్తూ ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారు. వీటిలో మూడో వంతు బైకులు కాగా, మిగతావి కార్లు, బస్సులు, సరకు రవాణా వాహనాలు ఉన్నాయి. డ్రైవింగ్ చేసేవారు ఎంత జాగ్రత్తగా ఉన్నా, బండికి ఫిట్నెస్ లేకపోతే ప్రమాదాలకు ఆస్కారం అధికం. అంతేకాదు వీటితో కాలుష్యమూ ఎక్కువే, కండిషన్ లేని సరుకు రవాణా వాహనాల్ని డ్రైవర్ అతివేగంగా నడిపే క్రమంలో అధిక ప్రమాదాలు జరుగుచున్నాయి. మరణాలు సంభవిస్తున్నాయి. నిబంధనలు, తనిఖీల్లో ఉదాసీనత. రాష్ట్రంలో కాలం చెల్లిన వ్యక్తిగత వాహనాలు 38,97,695 ఉన్నాయి. రిజిస్ట్రేషన్ తేదీ నుంచి 15 ఏళ్లు దాటిన వాటికాలం చెల్లినవిగా పరిగణిస్తారు. బండి ఫిట్నెస్ పరీక్షల్లో పాసై గ్రీన్ టాక్స్ కడితే మరో ఐదేళ్లు నడిపేందుకు అనుమతిస్తారు. రవాణా వాహనాలు 4,16,961 ఉండగా ఇవి ఎనిమిదేళ్లే ఫిట్‌గా ఉంటాయి. అందుకే ప్రైవేట్ యాజమాన్యాలు బస్సుల అద్దె ఒప్పందాన్ని ఆర్టీసీ ఎనిమిదేళ్లకే పరిమితం చేస్తోంది. ఎనిమిదేళ్లు నిండిన రవాణా వాహనాల్లో అనుమతి తీసుకుని పన్ను కట్టినవి 36,054 మాత్రమే ఉన్నాయి. 42,78,602 కాలం చెల్లిన వాహనాలు ఇలాంటి అనుమతులు లేకుండా రోడ్లపై తిరుగుతున్నా రవాణా శాఖ ఎలాంటి తనిఖీలు చర్యలు చేపడుతున్న దాఖలాలు కనిపించట్లేదు. రహదారి భద్రతను మెరుగుపరచడం, కాలుష్య నియంత్రణకు వాహనాల్ని స్క్రాప్ చేయడానికి ప్రభుత్వ పాలసీ తెచ్చినా ఇంకా ఫలితాలు రావట్లేదు. బడులు, కళాశాలలు ప్రారంభమైన కొన్నాళ్ళు రవాణా శాఖ అధికారులు హడావుడి చేసి ఆ తర్వాత తనిఖీలు ఆపేస్తారు. దేశంలో రహదారి ప్రమాదాలు అధికంగా జరిగే టాప్10 రాష్ట్రాలలో తెలంగాణ ఉంది. ఏది ఏమైనా రోడ్లపై ఫిట్నెస్ లేని వాహనాలు రహదారుల వెంట పరుగులు తీయడంతో ప్రమాదాలు పెరుగుతున్నాయి. ఆధునిక రవాణా వసతులతో ట్రాఫిక్ పెరిగి కంట్రోల్ తప్పుతుంది. వాహనదారు (డ్రైవరు)లు ప్రయాణికులుట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రత నియమాలు తూ.చ తప్పక పాటిస్తేనే ప్రయాణాలు క్షేమంగా గమ్యానికి చేరుతాయి. రెప్పపాటు నిర్లక్ష్యం వల్ల ఘోర యాక్సిడెంట్లతో ప్రమాదాలు, ప్రాణ నష్టాలకు దారితీస్తున్నాయి. జాతీయ, రాష్ట్ర, జిల్లా అన్నిరకాల రోడ్ల నాణ్యత ప్రమాణాలు ఎప్పటికప్పుడు గుర్తించాలి. దెబ్బతిన్నచోట రోడ్డు నిర్మాణాలు చేపడితే, యాక్సిడెంట్లు తగ్గుతాయి. అలాగే వివిధ రకాల రహదారుల వెంట బ్రాండ్ షాపులు తొలగించాలని కోర్టు హెచ్చరికలను ప్రభుత్వాలు అమలు చేయాలి. వాహనదారులు, ప్రయాణికులు రోడ్డు పన్ను చెల్లిస్తున్నందున నాణ్యమైన ప్రయాణాలకు బాధ్యతతో కూడిన హామీ అమలు ప్రభుత్వాలపైనే ఉంది. ఏది ఏమైనా వాహన యజమానులు, డ్రైవర్లు, ప్రయాణదారులు, ప్రభుత్వాలు ఉమ్మడి బాధ్యతతో రోడ్డు ప్రమాదాలు తగ్గించుకోవాల్సిన అవసరం ఎంతో ఉంది. ●

# ఉత్తరాదిని ముంచేస్తున్న భారీ వర్షాలు





## యుపి, గుజరాత్, బెంగాల్, ఉత్తరాఖండ్, రాజస్థాన్, కాశ్మీర్‌లో స్తంభించిన జనజీవనం

## విరిగిపడుతున్న కొండచరియలు, జననష్టం

## ఉత్తరప్రదేశ్‌లో నీటమునిగిన ప్రయాగ్‌రాజ్, వారణాసి ఘాట్‌లు

**అహ్మదాబాద్, జూలై 8:** దేశవ్యాప్తంగా రుతు పవనాల కారణంగా ఉత్తరాది రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా ఉత్తర్‌ప్రదేశ్, బంగాల్, గుజరాత్, ఉత్తరాఖండ్, రాజస్థాన్, జమ్ముకశ్మీర్ రాష్ట్రాల్లో ఎడతెరపిలేని వర్షాలు కారణంగా జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. రోడ్లన్నీ నదులుగా మారాయి. కొన్ని చోట్ల కొండచరియలు విరిగిపడుతున్నాయి. అంతే కాకుండా గంగా నదీ నీటిమట్టం క్రమంగా పెరగడం వల్ల పరివాహక ప్రాంతాలు జలమయమయ్యాయి. ఇదిలా ఉండగా మరో నాలుగు రోజులు పాటు విస్తారమైన వానలు ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ చెబుతోంది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్, వారణాసిలోని ఘాట్‌లు నీట మునిగిపోయాయి. వందలాది మంది భక్తులను ఆకర్షించే గంగాహారతి నిర్వహణ వేదిక వరకు నీరు చేరుకుంది. ఫలితంగా గంగా హారతి స్థలిని మారుస్తారనే ప్రచారంతో స్థానికుల్లో ఆందోళన నెలకొంది. ఇంకో రెండు అడుగుల మేర నీటి మట్టం పెరిగితే గంగా హారతి ఇచ్చే ప్రాంతం పూర్తిగా కనుమరుగు అవుతుందని స్థానికులు చెప్పారు. అయోధ్యలో కూడా సరయూనది నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండటంతో నీటిమట్టం ప్రమాదకర స్థాయిని దాటింది. గంగా, సరయూ నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. భక్తులు పుణ్య స్నానాలు ఆచరించే ఘాట్‌ల వద్ద అదనపు బృందాలతో పాటు రెస్క్యూ సిబ్బందిని మోహరించారు. స్నానం ఆచరించేందుకు భక్తులు నది లోపలికి వెళ్లవద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. తాము సూచించిన నిర్దిష్ట ప్రాంతాల్లో మాత్రమే పుణ్యస్నానాలు ఆచరించాలని భక్తులకు సూచించారు. బోటులో ఎనిమిది మంది మించి ప్రయాణం చేయవద్దని హెచ్చరించారు. రుతు పవనాల కారణంగా రాజస్థాన్‌లో జులై 10వ తేదీ నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిస్తాయని,12వ తేదీ నుంచి మరింత పెరిగే అవకాశం ఉందని సూచించింది. అసోం, మధ్యప్రదేశ్, మహారాష్ట్రాల్లో ప్రవహిస్తున్న నదులు ప్రమాదకర స్థాయి మించి ప్రవహిస్తున్నాయి. దీంతో ఆయా రాష్ట్రాలో వరదలు ముంచెత్తున్నాయి. జమ్ముకశ్మీర్‌లో కూడా భారీ వర్షాలు కురుస్తున్నాయి. మరోవైపు ఉత్తరాఖండ్‌లోని పలు జిల్లాలో భారీవర్షాలు కురుస్తున్నాయి. నదులు, వాగులు పొంగిపోతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో కొండచరియలువిరిగిపడ్డాయి. రోడ్లు, ఇళ్లు నీట మునిగాయి. ఇదిలా ఉండగా ఉత్తరకాశి జిల్లాలో 3.2 తీవ్రతో మంగళవారం మధ్యాహ్నం భూకంపం సంభవించింది. దీంతో ప్రజలు ఇళ్లలో నుంచి బయటకు పరుగులు తీశారు. గుజరాత్‌లో ఇప్పటివరకు 413.52 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సాధారణ వర్షపాతం కంటే 46 శాతం ఎక్కువఅని అధికారులు పేర్కొంటున్నారు. అధిక వర్షపాతం కారణంగా గుజరాత్‌లోని డ్యామ్‌ల్లో నీటమట్టం పెరిగిపోయింది. జూన్ 11వ తేదీ వరకు మత్స్యకారులను సముద్రంలోకి పోవద్దని వాతావర్ణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది.

మంగళవారం తెల్లవారుజాము నుంచే కోల్‌కతా సహా బెంగాల్‌లోని పలు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. రోడ్లు, ఇళ్లు నీట మునిగాయి. దీంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. ఈ క్రమంలోనే దక్షిణ బెంగాల్‌లోని ఐదు జిల్లాలకు వాతావరణ శాఖ అరెంజ్ అలర్ట్ జారీ చేసింది. మోస్తరు నుంచి ఉరుములతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. ఇళ్లలో నుంచి ఎవరూ బయటకు రావొద్దని సూచించింది.




# ఎయిరిండియా ప్రమాదంపై ప్రాథమిక నివేదిక సమర్పణ

## విమానయానశాఖకు అందించిన దర్యాప్తు బ్యూరో

**న్యూఢిల్లీ,జూలై 8:** దేశవ్యాప్తంగా తీవ్ర విషాదాన్ని నింపిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంపై దర్యాప్తులో కీలక ముందడుగు పడింది. ఈ ఘోర దుర్ఘటనకు సంబంధించిన ప్రాథమిక నివేదికను ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో పౌర విమానయాన మంత్రిత్వ శాఖకు సమర్పించింది. గుజరాత్ మాజీ సిఎం విజయ్ రూపానీ సహా 241 మందిని బలిగొన్న ఈ ప్రమాదంపై దర్యాప్తు బృందం తన ప్రాథమిక అంచనాలను ఈ నివేదికలో పొందుపరిచింది. గత నెల జూన్ 12న అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ విమానాశ్రయం నుంచి లండన్‌కు బయలుదేరిన ఈ విమానం, టేకాఫ్ అయిన కేవలం 32 సెకన్లకే కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో విమానంలోని ఇద్దరు పైలట్లు, 10 మంది సిబ్బంది, ప్రయాణికులు సహా 241 మంది సజీవ దహనమయ్యారు. అదృష్టవశాత్తు సీటు నంబర్ 11ఏలో కూర్చున్న ఒక్క ప్రయాణికుడు మాత్రమే ప్రాణాలతో బయట పడ్డాడు. ప్రమాదానికిగల కారణాలను ఛేదించేందుకు అధికారులు ముమ్మర దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ప్రమాద స్థలంలో లభ్యమైన కాక్‌పిట్ వాయిస్ రికార్డర్ (సీవీఆర్), ఫ్లైట్ డేటా రికార్డర్ (ఎఫ్‌డీఆర్)లను విశ్లేషిస్తున్నారు. ముఖ్యంగా విమానం టేకాఫ్ అయ్యే కీలక సమయంలో పైలట్లు ప్రమాదవశాత్తు ఫ్యూయల్ స్విచ్‌లను ఆఫ్ చేశారా? అనే కోణంలో దర్యాప్తు బృందాలు దృష్టి సారించాయి.

బ్లాక్ బాక్స్‌ల డేటాను, విమాన శకలాల్లో లభించిన ఫ్యూయల్ స్విచ్‌ల భాగాలను పోల్చి చూస్తున్నారు. అదే సమయంలో రెండు ఇంజిన్లు ఒకేసారి ఫెయిల్ అయ్యాయా? అనే కోణంలో కూడా విచారణ జరుగుతోంది. విమానం 400 అడుగుల కంటే తక్కువ ఎత్తులో ఉన్నప్పుడు రెండు ఇంజిన్లు ఆగిపోతే ఎలా స్పందించాలనే దానిపై పైలట్లకు శిక్షణ ఉండదని నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో దర్యాప్తు అధికారులు సమర్పించిన నివేదిక కీలకంగా మారింది. ఈ వారంలోనే ఈ నివేదికను ప్రజలకు విడుదల చేయనున్నట్లు, దాని ద్వారా ప్రమాద కారణాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని ప్రభుత్వ ఉన్నతాధికారులు తెలిపారు.

# పెళ్లిరోజు గిఫ్ట్‌గా మొబైల్ ఇస్తే పోలీసులు వచ్చి తలుపుతట్టారు!




**కోల్‌కత్తా, జూలై 8:** పెళ్లిరోజు కానుకగా తన భార్యకు ఒక గిఫ్ట్ ఇవ్వాలనుకున్న ఒక న్యాయవాది ఓ మొబైల్ షాపులో రూ.49 వేల విలువ చేసే మొబైల్ ఫోన్ కొన్నాడు. ఇంటికి తీసుకెళ్లి భార్య చేతిలో పెట్టాడు. ఆమె సంతోషంతో పొంగిపోయింది. ప్రేమతో భర్త తెచ్చిన మొబైల్‌ను ఆన్ చేసింది. అంతే కొన్ని నిమిషాల్లో పోలీసులు వచ్చి ఆ ఇంటి తలుపుతట్టారు. దాంతో ఆ దంపతులు షాకయ్యారు. పెళ్లిరోజు రాత్రి వారికి పీడకలగా మిగిలిపోయింది. కోల్‌కతాకు చెందిన ఓ న్యాయవాది పెళ్లిరోజు కానుకగా తన భార్యకు ఖరీదైన మొబైల్ ఫోన్ కొనిచ్చాడు. రూ.49 వేలు పెట్టి భర్త కొనిచ్చిన ఆ ఫోన్‌ను భార్య ఆన్ చేయగానే పోలీసులు రంగ ప్రవేశం చేశారు. గుజరాత్ రాష్ట్రం రాజ్‌కోట్‌కు చెందిన పోలీసులు ఆ ఇంటి తలుపుతట్టారు. తలుపు తీసిన దంపతులు పోలీసులను చూసి షాకయ్యారు. ఆ ఫోన్‌తో సైబర్ నేరాలకు పాల్పడ్డారని పోలీసులు గద్దించడంతో భయంతో వణికిపోయారు.

తాము ఇవాళే మొబైల్ షాపు నుంచి ఈ మొబైల్ కొనుగోలు చేశామని, తాము ఏ నేరం చేయలేదని చెప్పారు. రాజ్‌కోట్ పోలీసుల సూచన మేరకు ఆ దంపతులు రాత్రికిరాత్రే స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో పోలీసులు మొబైల్ షాపుపై రైడ్ చేశారు. ఆ షాపులో డాక్యుమెంట్స్ అన్నీ సక్రమంగానే ఉండటంతో మొబైల్స్ డిస్ట్రిబ్యూటర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కాగా పెళ్లిరోజు నాడు సంతోషంగా గడుపుదా మనుకున్న ఆ లాయర్ దంపతులకు మొబైల్ గిఫ్ట్ ఓ పీడకలను మిగిల్చింది. రాత్రంతా వారు పోలీస్‌స్టేషన్‌ల చుట్టూ తిరగాల్సి వచ్చింది. ఏ నేరం చేయకపోయినా తమ జీవితంలో ఓ ముఖ్యమైన రాత్రిన వారు అవస్థలు పడాల్సి వచ్చింది.

# స్కూల్ బస్సును ఢీకొన్న రైలు

## ముగ్గురు మృతి, మరో ఆరుగురికి తీవ్ర గాయాలు




**కడలూరు(తమిళనాడు),జూలై 8:** తమిళనాడులోని కడలూరులో పట్టాలు దాటుతున్న స్కూల్ వ్యాన్‌ను ఓ ప్యాసింజర్ రైలు ఢీకొట్టింది. ఈ ఘటనలో ముగ్గురు విద్యార్థులు మృతిచెందగా, మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను సమీప ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అయితే దీనిపై స్కూల్ వ్యాన్ వెళ్లడానికి మూసిన గేటు తెరవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ప్రాథమికంగా తేలింది. దీంతో ఆ గేట్‌కీపర్‌ను విధులు నుంచి తొలగించినట్లు రైల్వే శాఖ తెలిపింది. రైలు వచ్చినప్పుడు రైల్వే గేటు తెరిచే ఉందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. మరోవైపు తమిళనాడు సిఎం స్పందిస్తూ ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. మంగళవారం ఉదయం 7:45 గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగింది. రైల్వే ట్రాక్‌ను దాటుతున్న స్కూల్ వ్యాన్‌ను వేగంగా వస్తున్న 56813 ప్యాసింజర్ రైలు ఢీకొట్టింది. దీంతో వ్యాను చాలా దూరంలోకి ఎగిరిపడింది. ప్రమాదం ధాటికి స్కూల్ వ్యాన్ నుజ్జునుజ్జు అయ్యింది. ఈ వ్యానులోని ఇద్దరు విద్యార్థులు అక్కడికక్కడే మృతి చెందగా, మరికొంతమంది గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటమే ఘటనాస్థలికి వెళ్లి క్షతగ్రాతులను ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన విద్యార్థులు ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నారు. ఆరో తరగతి చదువుతున్న నిమిలేష్ (12), 11వ తరగతి చదువుతున్న సరుమతి (16), చెజియన్ (15)గా గుర్తించారు. ఈ ప్రమాదంలో విశ్వేష్ (16), వ్యాన్‌డ్రైవర్ శంకర్ (47) తీవ్రంగా గాయపడి కడలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

అయితే ఈ ప్రమాదం గేటు కీపర్ నిర్లక్ష్యం వల్లే జరిగిందని ప్రాథమిక విచారణలో తేలిం దని రైల్వే శాఖ తెలిపింది. గేటు కీపర్ భద్రతా నియమాలను ఉల్లంఘించి నందుకు తక్షణమే విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు రైల్వే శాఖ పేర్కొంది. ఈ ప్రమాదంపై దక్షిణ మధ్య రైల్వే శాఖ విచారం వ్యక్తం చేసింది. గాయపడిన వారికి అవసరమైతే మెరుగైన వైద్య చికిత్స కోసం పుదుచ్చేరికి తరలిస్తామని తెలిపింది. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు, తీవ్రంగా గాయపడిన వారికి రూ.2.5 లక్షలు, స్వల్పంగా గాయపడిన వారికి రూ.50 వేలు చొప్పున పరిహారం అందిస్తామని ప్రకటించింది. మరోవైపు తమిళనాడు సిఎం స్టాలిన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతులు కుటుంబాలకు సానుభూతిని తెలియజేశారు. క్షతగ్రాతులకు నాణ్యమైన చికిత్సను అందించాలని అధికారులను ఆదేశించారు.

# ప్రైవేటు విడియోతో బెదిరించి రూ.3 కోట్లు దోపిడి..

## సూసైడ్‌నోట్‌రాసి సిఏ ఆత్మహత్య



**ముంబై, జులై 8:** ఒక యువ చార్టర్డ్ అకౌంటెంట్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గత కొన్ని నెలలుగా వస్తున్న వేధింపులు భరించలేక చివరికి బలవన్మరణానికి ఒడిగట్టాడు. ఇంకా రూ.మూడుకోట్లకు పైగా చెల్లించమని బ్లాక్ మెయిల్ చేస్తూ వేధిస్తుండటంతో చివరికి విషం తాగి ఇవాళ తనువు చాలించాడు. చనిపోతూ మూడు పేజీల సూసైడ్‌నోట్ రాసిన బాధితుడు తన ఆత్మహత్యకు ఆ ఇద్దరే కారణమని తన లేఖలో పేర్కొన్నాడు. ఒక పేజీలో తన తల్లికి, మరొక పేజీలో తన సహోద్యోగులకు తాను ఆత్మహత్య చేసుకోడానికి దారి తీసిన కారణాలను వివరించాడు. ముంబైలో చార్టర్డ్ అకౌంటెంట్‌గా పనిచేస్తున్న రాజ్ లీలా మోర్ అనే 32 ఏళ్ల యువకుడి ప్రైవేట్ వీడియోను లీక్ చేస్తామని కొన్ని నెలలుగా రాహుల్ పర్వానీ, సబా ఖురేషి అనే మహిళ ఇద్దరు బెదిరింపులకు గురిచేస్తున్నారని తన సూసైడ్‌నోట్‌లో రాజ్ పేర్కొన్నాడు. గత 18 నెలల్లో వీరిద్దరు తననుండి కోట్లాది డబ్బును దోచుకున్నారని నోట్‌లో రాశాడు. స్టాక్ మార్కెట్‌లో రాజ్ మోర్ భారీ పెట్టుబడులు పెట్టడం, చార్టర్డ్ అకౌంటెంట్‌గా అతని అధిక జీతం ఉన్న ఉద్యోగం గురించి నిందితులకు తెలుసని పోలీసులు అంటున్నారు. ఈ క్రమంలో మోర్‌ను అతని కంపెనీ ఖాతా నుండి భారీ మొత్తంలో డబ్బును వారి వ్యక్తిగత ఖాతాలకు బదిలీ చేయమని నిందితులు బలవంతం చేశారని చెప్పారు. ఇక, రాజ్ ఆత్మహత్యకు పాల్పడ్డ గది నుండి అధికారులు మూడు పేజీల సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకున్నారు. అందులో ఒకటి అతని తల్లికి రాశాడు. రెండవ పేజీలో, రాజ్ తన సహోద్యోగులకు రాశాడు. దీపా లఖానీ ఈరోజు నాకు క్షమాపణ చెప్పడానికి మాటలు లేవు, ఎందుకంటే నేను మీ నమ్మకాన్ని వమ్ము చేసాను. కానీ నన్నునమ్మండి, ఇది చివరిసారి. మీ నమ్మకాన్ని వమ్ము చేయాలనే ఉద్దేశ్యం నాకు లేదు. నేను ఏమోసం చేసినా, నేనే చేసాను; ఎవరికీ ఏమీతెలియదు. నేను స్టేట్‌మెంట్ (ఖాతాను)ను మార్చ లేదు. శ్వేత, జయప్రకాష్‌లకు ఏమి జరుగుతుందో పూర్తిగా తెలియదు. దయచేసి వారిపై ఎటువంటి చర్య తీసుకోకండి అని ఆయన రాశారు. మూడవ పేజీలో మోర్ తన మరణానికి రాహుల్, సబాను కారణమని పేర్కొన్నాడు. నేను, రాజ్ మోర్. ఈ రోజు ఆత్మహత్య చేసుకుంటున్నాను. నా ఆత్మహత్యకు రాహుల్ పర్వానీదే బాధ్యత. అతను నన్ను మోసగించి నెలల తరబడి నన్ను బ్లాక్ మెయిల్‌చేశాడు. నా మరణానికి రాహుల్ పర్వానీ, ఇంకా సబా ఖురేషి బాధ్యులని రాజ్ తన సూసైడ్ నోట్‌లో రాశాడు. దీంతో పోలీసులు ఇద్దరు నిందితులపై కేసు నమోదు చేశారు.

# రాముడు, శివుడు మావాళ్లే!

## వాళ్లిద్దరూ నేపాల్‌లోనే పుట్టారు: ప్రధాని కెపిశర్మ ఓలి



**ఖాట్మండు,జూలై 8:** నేపాల్ ప్రధానమంత్రి కెపి శర్మ ఓలీ మరోసారి శ్రీరాముడి జన్మస్థలంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. శ్రీరామచంద్రుడు భారతదేశంలోని అయోధ్యలో కాకుండా, తమ దేశమైన నేపాల్‌లోనే జన్మించారని ఆయన పునరుద్ఘాటించారు. ఖాట్మండులో జరిగిన పార్టీ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ వాదనను వినిపించారు. తాను సొంతంగా ఈ మాటలు చెప్పడం లేదని, వాల్మీకి రాసిన అసలైన రామాయణం ఆధారంగానే ఈ విషయం చెబుతున్నానని కెపి ఓలీ స్పష్టం చేశారు. రాముడు పుట్టిన నిజమైన ప్రదేశం నేపాల్‌లోనే ఉందని, ఈ నిజాన్ని ప్రచారం చేయడానికి ప్రజలు ఏ మాత్రం వెనుకాడొద్దని ఆయన పిలుపునిచ్చారు. గతంలో 2020లో కూడా ఓలీ ఇదే తరహా వ్యాఖ్యలు చేయడం గమనార్హం. తమ దేశంలోని చిత్వాన్ జిల్లా థోరి ప్రాంతమే అసలైన అయోధ్య అని, అక్కడే రాముడు జన్మించారని అప్పట్లో పేర్కొన్నారు. కేవలం రాముడే కాకుండా, శివుడు, విశ్వామిత్రుడు కూడా తమ దేశంలోనే జన్మించారని ఓలీ తాజాగా తెలిపారు. ఇతిహాసాల్లో పేర్కొన్న పలు ప్రదేశాలు ప్రస్తుతం నేపాల్‌లోని సున్‌సారి జిల్లాలో ఉన్నాయని ఆయన అన్నారు. ఈక్రమంలో నేపాల్ విదేశాంగశాఖ ప్రకటన విడుదలచేస్తూ ఎవరి మనోభావాలు దెబ్బతీసేందుకు ప్రధాని ఈ వ్యాఖ్యలుచేయలేదని, రాముడి జన్మస్థలంపై అనేక అభిప్రాయాలున్నాయని, రామాయణంపై విస్తృతమైన సాంస్కృతిక, భౌగోళిక అధ్యయనం జరపాల్సిన అవసరం ఉందని మాత్రమే చెప్పారని స్పష్టంచేసింది.

# బీహార్‌లో మహిళలకు 35% రిజర్వేషన్లు

## ఎన్నికల ముందు బీహార్ సీఎం వరాలు

**పాట్నా, జూలై 8:** త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న తరుణంలో మహిళా సాధికారత, ఉద్యోగాల కల్పనకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ సంకేతాలిచ్చారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు రిజర్వేషన్ ప్రకటించారు. ప్రభుత్వ ఉద్యోగాలకు నేరుగా జరిగే అన్ని రిక్రూట్‌మెంట్లలో బీహార్ స్థానికత కలిగిన మహిళలకు 35 శాతం రిజర్వేషన్ కల్పించనున్నట్టు మంగళవారంనాడు ప్రకటించారు. రాష్ట్ర క్యాబినెట్ ఈ మేరకు ఆమోదం తెలిపింది. ఎంపిక చేసిన ప్రభుత్వ సర్వీసులలో బీహార్‌లోని మహిళలకు ఇప్పటికే రిజర్వేషన్ ఉండగా, తాజా నిర్ణయం ప్రకారం అన్ని ప్రభుత్వ శాఖలు, రిక్రూట్‌మెంట్ స్థాయిలలో శాశ్వత నివాసిత మహిళలకు 35 శాతం కోటా వర్తిస్తుంది. బీహార్ యూత్ కమిషన్ ఏర్పాటుకు కూడా రాష్ట్ర ప్రభుత్వం తాజాగా నిర్ణయం తీసుకుంది. ఉద్యోగావకాశాలు పెంచడం, వొకేషనల్ ట్రైనింగ్, రాష్ట్రంలోని యువతకు సపోర్ట్‌గా నిలబడే లక్ష్యంతో ఈ యూత్ కమిషన్ ఏర్పాటు కానుంది. యువతకు సంబంధించిన విధానాలు, అభివృద్ధి పథకాల్లో అడ్వైజరీగా కమిషన్ వ్యవహరిస్తుందని నితీష్ కుమార్ తెలిపారు. నాణ్యమైన విద్య, నైపుణ్యాలు, ముఖ్యంగా ప్రైవేటు రంగంలో జాబ్ ప్లేస్‌మెంట్‌ను మెరుగుపరచేందుకు వివిధ శాఖలతో కమిషన్ సమన్వయం చేస్తుందని చెప్పారు.

ఈ కమిషనల్‌లో ఒక చైర్మన్, ఇద్దరు వైస్ చైర్మన్లు, ఏడుగురు సభ్యులు 45 ఏళ్లలోపు వారు ఉంటారు. ఇక ఇప్పటికే రాష్ట్రంలోని మహిళలకు సామాజిక పెన్షన్‌ను నితీశ్ ప్రభుత్వం పెంచిన విషయం తెలిసిందే. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆ రాష్ట్రంలోని ఎన్డీఏ కూటమి సర్కారు పెన్షన్‌ల పెంపు నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం రూ.400గా ఉన్న పెన్షన్‌ను ఇప్పుడు రూ.1100 లకు పెంచారు. పెరిగిన పెన్షన్ జూలై నెలనుంచే అమలులోకి వచ్చింది. అర్హులందరి బ్యాంకు ఖాతాల్లో జూలై 10న పెన్షన్ డబ్బులు పడుతాయని తాను హామీ ఇస్తున్నానని గత నెల సీఎం ప్రకటించిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో మహిళలకు పెద్ద పీట వేస్తూ.. ఇప్పుడు ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లు ప్రకటించారు.

# మీరూ చంద్రునిపై నడవొచ్చు..



### మీలో చాలామంది వ్యోమగాములు కావచ్చు..

### నేను వచ్చాక మార్గనిర్దేశనం చేస్తా: విద్యార్థులతో శభాంశు శుక్లా చిట్‌చాట్

**న్యూఢిల్లీ, జూలై 8:** ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్ నుంచి భారత వ్యోమగామి శుభాంశు శుక్లా విద్యార్థులతో మాట్లాడారు. భవిష్యత్తులో వ్యోమగాములు కావొచ్చని, చంద్రుడిపైనా నడుస్తారని విద్యార్థులకు చెప్పారు. హ్యామ్ రేడియో సాయంతో మాట్లాడిన ఆయన విద్యార్థుల ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. నేను త్వరలోనే తిరిగి వచ్చి మీకు మార్గనిర్దేశం చేస్తాను. మీలో చాలా మంది వ్యోమగాములు కావొచ్చు. కష్టపడి పని చేయండి. మిమ్మల్ని మీరు నమ్మండి. మీరు చంద్రుడిపైనా నడవచ్చని శుభాంశు శుక్లా చెప్పారు.

హ్యామ్ రేడియో సాయంతో 10 నిమిషాల పాటు మాట్లాడిన ఆయన ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్‌లో అనుభవాలను పంచుకున్నారు. వ్యోమగామిగా శిక్షణ, అంతరిక్షంలో ఆరోగ్యంగా ఉండడం లాంటి విషయాలను వివరించారు. మైక్రో గ్రావిటీ వల్ల మానవ శరీరంలో అనేక మార్పులు వస్తాయని శుక్లా చెప్పారు. అందుకోసమే అంతరిక్షంలో ఆరోగ్యంగా ఉండేందుకు తప్పనిసరిగా వ్యాయామం చేయాలని తెలిపారు. మేము అంతరిక్షంలో సూర్యుడిని అనుసరించం. ప్రతి 90 నిమిషాలకు మేము భూమి చుట్టూ తిరుగుతాం. ఫలితంగా 16 సార్లు సూర్యోదయం, సూర్యాస్తమాలను చూస్తాం. మనం భూమిపై గ్రావిటీతో పెరుగుతాం. కానీ అంతరిక్షంలో గురుత్వాకర్షణ ఉండదు. ఫలితంగా శరీరంలో అనేక మార్పులు వస్తుంటాయి. వీటిని స్వీకరించేందుకు మన శరీరానికి కొంత సమయం పడుతుంది. నాకు కూడా మొదట్లో కాస్త అస్వస్థతగా అనిపించింది. కొన్ని మందులు వేసుకుని వాటిని అలవాటు చేసుకున్నాను. ఈ మైక్రో గ్రావిటీ వల్ల కండరాలు, ఎముకలపై తీవ్ర ప్రభావం పడుతుంది. అందుకే ప్రతి రోజు ట్రేడ్ మిల్స్, సైకిల్స్, వ్యాయామం చేయాలి. మిషన్ కోసం, భూమిపైకి తిరిగి వచ్చేందుకు ఎల్లప్పుడూ ఫిట్‌గా ఉండాలి. ఈ మిషన్‌లో శారీరకంగా, మానసికంగా అప్రమత్తంగా ఉండాలి. రోబోటిక్స్, ఆర్టిఫిషల్ ఇంటిలిజెన్స్ సైతం మా మిషన్‌లో అంతర్భాగం. కొన్ని పనులను మేము రోబోటిక్ సాయం చేస్తాం. దీంతో పని సురక్షితంగా పూర్తి అవుతుదని శుభాంశు శుక్లా చెప్పారు. 12 రోజులుగా అంతరిక్షంలో ఉంటున్న శుక్లా, మేఘాలయా, అసోంకు చెందిన విద్యార్థులతో మాట్లాడారు.

కొంత మంది విద్యార్థులకు షిల్లాంగ్‌లోని నార్త్ ఈస్ట్ స్పేస్ అప్లికేషన్ సెంటర్ నుంచి వ్యోమగామి శుభాంశు శుక్లాతో మాట్లాడే అరుదైన అవకాశాన్ని కల్పించగా, దాదాపు 20 ప్రశ్నలను శుక్లాను అడిగారు. ఆర్మీ పబ్లిక్ స్కూల్ షిల్లాంగ్, ఆల్ఫా హైయర్ సెంకడరీ స్కూల్ నాన్గోప్, ఆర్య విద్యాపీఠ్ హైస్కూల్ గువాహటి, క్రైస్ట్ సీనియర్ సెంకడరీ స్కూల్ ఉమియమ్, పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయం బరపణి, ఆర్మీ పబ్లిక్ స్కూల్ ఉమ్‌రోయ్, బీకే బజోరియా స్కూల్ షిల్లాంగ్‌కు చెందిన విద్యార్థులు వ్యోమగామి శుక్లాతో మాట్లాడారు. ఇంతకుముందు కూడా అనేక పాఠశాలలకు చెందిన విద్యార్థులతో శుక్లా మాట్లాడారు. అంతరిక్షంపై విద్యార్థుల్లో ఉన్న సందేహాలను నివృత్తి చేశారు.

# 67 మందిని రక్షించిన జాగిలం

## హిమాచల్ వరదల్లో వెలుగుచూసిన ఉదంతం

**సిమ్లా,జూలై 8:** హిమాచల్ ప్రదేశ్‌లో భారీ వర్షాలు సృష్టిస్తున్న విలయం మధ్య, ఓ మూగ జీవి 67మంది ప్రాణాలను కాపాడింది. పెంపుడు కుక్క అరవడంతో పెను ప్రమాదం నుంచి 20 కుటుంబాలు సురక్షితంగా బయటపడ్డాయి. కళ్ల ముందే తమ ఇళ్లు మట్టిలో కలిసిపోయినా, ప్రాణాలతో బయటపడ్డామని గ్రామస్థులు ఊరట చెందుతున్నారు. మండిజిల్లా ధర్మపూర్ ప్రాంతంలోని సియాతి గ్రామంలో జూన్ 30 అర్ధరాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. భారీ వర్షం కురుస్తుండగా, నరేంద్ర అనే గ్రామస్థుడి ఇంట్లో నిద్రిస్తున్న కుక్క అర్ధరాత్రి సమయంలో గట్టిగా అరవడం, ఊళలు వేయడం ప్రారంభించింది. దాని అరుపులకు నాకు మెలకువ వచ్చింది. వెళ్లి చూడగా ఇంటి గోడకు పెద్ద పగులు కనిపించి, నీరు లోపలికి రావడం మొదలైంది. వెంటనే కుక్కతో పాటు కిందకు పరిగెత్తి, నా కుటుంబ సభ్యులను, ఆ తర్వాత గ్రామస్తులందరినీ నిద్రలేపి సురక్షిత ప్రాంతానికి వెళ్లమని చెప్పానని నరేంద్ర వివరించారు. వారు గ్రామాన్ని వీడిన కొద్దిసేపటికే కొండచరియలు విరిగిపడి పదుల సంఖ్యలో ఇళ్లు నేలమట్టమయ్యాయి. గ్రామం మొత్తం శిథిలాల కింద కూరుకుపోయింది. ప్రాణాలతో బయటపడిన వారంతా ప్రస్తుతం సమీపంలోని నైనా దేవి ఆలయంలో ఆశ్రయం పొందుతున్నారు. ఈ ఘటనతో చాలామంది రక్తపోటు, మానసిక ఒత్తిడితో బాధపడుతున్నారు. ప్రభుత్వం వారికి రూ. 10,000 తక్షణ సాయం అందించింది. జూన్ 20న రుతుపవనాలు ప్రవేశించినప్పటి నుంచి హిమాచల్ ప్రదేశ్‌లో వర్ష సంబంధిత ఘటనల వల్ల 50 మంది, రోడ్డు ప్రమాదాల్లో 28 మంది సహా మొత్తం 78 మంది మరణించినట్లు రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ వెల్లడించింది. రాష్ట్రవ్యాప్తంగా 16 కొండచరియలు విరిగిపడటం, 19 మేఘ విస్ఫోటాలు, 23 ఆకస్మిక వరదలు సంభవించాయి. అత్యధిక మరణాలు మండి జిల్లాలోనే నమోదయ్యాయి.

# ఎపి బ్రాండ్‌ను దెబ్బతీసేందుకు మాజీ ముఖ్యమంత్రి, మాజీ ఆర్థిక శాఖ మంత్రి కుట్రలు చేస్తున్నారు: మంత్రి పయ్యావుల కేశవ్



**విజయవాడ, జూలై8 ,ప్రభాత వార్తప్రతినిధి:** ఏపీ బ్రాండ్ ను దెబ్బతీసేందు కోసం మాజీ ముఖ్య మంత్రి, మాజీ ఆర్థిక శాఖ మంత్రి కుట్రలు చేస్తున్నారని రాష్ట్ర ఫైనాన్స్ మంత్రి పయ్యావుల కేశవ్ ఆరోపించారు.ఆయన మంగళవారం ప్రభుత్వ సమాచార ప్రచార కేంద్రంలో మీడియాతో మాట్లాడుతూ మాజీ సీఎం జగన్ రాష్ట్రంలో ఏదో జరిగిపోతున్నదంటూ గగ్గోలు పెడుతున్నారు,రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితులను అధ్వాన్నం చేసిన జగన్ మాట్లాడుతున్న విధానం చోద్యంగా ఉందన్నారు.ఆయన రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు, ప్రభుత్వ ఖజానా మరియు ప్రజలపై అవ్యాజమైన ప్రేమను చూపిస్తున్నట్లు నటిస్తూ రాష్ట్రాభివృద్ధిని అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారు ప్రజలు తమకు ఓట్లు వేయలేదనే అక్కసుతో ప్రజల సంక్షేమాన్ని, అభివృద్ధిని అడ్డుకునేందుకు పరోక్షంగా ప్రయత్నిస్తున్నారు రాష్ట్రాభివృద్ధికై ఏపిఎండిసి ద్వారా రూ.9 వేల కోట్ల మేర ఋణా తెచ్చేందుకు ప్రభుత్వం జి.ఓ. నెం.32 ను ఈ ఏడాది మార్చిలో జారీ చేసినప్పటి నుండి ఆ ఋణం రాకుండా అడ్డు పడేందుకు యత్నం చేశారు. జర్మనీలో పనిచేస్తున్న విప్రో ఉద్యోగి ఉదయ భాస్కర్ అనే అతనితో బాంబే మార్కెట్లోని పెట్టుబడిదాలు అందరికీ పెటు ్టబడులు పెట్టవద్దు అంటూ దాదాపు 200 మె యిల్స్ పంపించారు. వారి పార్టీకి చెందిన రాజ్య సభ సభ్యులు మరియు ఫైనాన్సు స్టాండింగ్ కమిటీ సభ్యులతో కేంద్ర ప్రభు త్వానికి /ఆర్.బి.ఐ.కి / సెబీ కి కంప్లైంట్స్ పెట్టించారు, వారి పార్టీ సభ్యులు లేళ్ల అప్పరెడ్డితో హైకోర్టులో పిల్ వేయించారు గతంలో వారు ప్రవేశ పెట్టిన డైరెక్టు డెబిట్ మెకా నిజమ్ తప్పని గగ్గోలు పెడుతూ ఎంతో రాద్ధాంతం చేశారు, కానీ ఈ విధానాన్నే దేశ వ్యాప్తంగా అనుసరిస్తున్నారు ఇన్ని చేసినప్పటికీ ఆర్.బి.ఐ., సెబీ వారు క్లియరెన్సు ఇవ్వడంతో పెట్టుబడిదారులు ఓవర్ గా సబ్ స్క్రైబ్ చేయవన్నారు.



# ప్రసన్నను ప్రజా జీవితం నుంచి బహిష్కరించాలి

## - ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

### - ప్రసన్న వ్యాఖ్యలపై పోలీసులకు ఫిర్యాదు

**నెల్లూరు క్రైమ్, జూలై 8, ప్రభాతవార్త :** రాజకీయంగా తనను ఎదుర్కోలేక మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్ రెడ్డి తనను అసభ్య పదజాలంతో దూషిస్తున్నారని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి తనపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు సంబంధించి జిల్లా అడిషనల్ ఎస్ పి సి హెచ్ సౌజన్యకు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను ప్రసన్నకుమార్ రెడ్డి హయాంలో జరిగిన గ్రావెల్ దోపిడి, అవినీతి అక్రమాల గురించి మాట్లాడుతుంటే మహిళ ఎమ్మెల్యే అని కూడా చూడకుండా సభ్య సమాజం తలదించుకునేలా నోరు పారేసుకున్న ప్రసన్నను మహిళా సమాజం క్షమించదన్నారు. ఆయన చేసిన అవినీతి అక్రమాలు ఇక చెల్లవంటూ కోవూరు ప్రజానీకం ఛీ కొట్టి శాశ్వతంగా ప్రజా జీవితం నుంచి వెలివేశారని గుర్తు చేశారు. సంస్కార రహితంగా మాట్లాడే ప్రసన్న పై చట్టపరంగా ఎదుర్కుంటానన్నారు. ప్రజలు కూడా ఇటువంటి వ్యక్తులను ప్రజా జీవితంలో నుండి బహిష్కరించాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, బుచ్చి మున్సిపల్ చైర్ పర్సన్ మోర్ల సుప్రజ, టిడిపి జిల్లా మహిళా అధ్యక్షురాలు పనబాక భూ లక్ష్మి ,నెల్లూరు మాజీ మేయర్ నందిమండలం భానుశ్రీ, వేగూరు సర్పంచ్ కరేటి అమరావతి తదితరులు వున్నారు.

# వైసిపి మాజీ ఎమ్మెల్యే ప్రసన్న వ్యాఖ్యలు సభ్య సమాజం తలదించుకునేలా ఉన్నాయి : డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్



**నెల్లూరు, జులై 8, ప్రభాతవార్త -వైద్యం** ఎమ్మెల్యే ప్రశాంతమ్మపై వైసీపీ మాజీ ఎమ్మెల్యే ప్రసన్న చేసిన అనుచిత వ్యాఖ్యలు బాధాకరమన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి ఆయన సంఘీభావం ప్రకటిస్తూ ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాజకీయాలను రాజకీయంగా ఎదుర్కోవాలి తప్ప వ్యక్తిగత దూషణలు తగదన్నారు. మహిళా ఎమ్మెల్యేను ఉద్దేవించి ప్రసన్న మాట్లాడిన మాటలు సంస్కార రహితంగా ఉన్నాయన్నారు. సీనియర్ రాజకీయ నాయకుడైన ప్రసన్న దిగజారుడు వ్యాఖ్యలు ప్రతి ఒక్కరు ఖండించాలని కోరారు. సభ్యతా సంస్కారాలు లేని ప్రసన్న లాంటి నాయకులను రాజకీయాల నుంచి బహిష్కరించాలని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు.

# వైసిపి నాయకులకు మహిళలంటేనే ద్వేషం

## - ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అనుచిత వ్యాఖ్యలు ఖండించిన మంత్రి నారా లోకేష్



**నెల్లూరు, జులై 8, ప్రభాతవార్త-వైద్యం** తల్లి, చెల్లిని తరిమేసిన అధినేత జగన్‌రెడ్డి గారిని వైసీపీ నేతలు ఆదర్శంగా తీసుకున్నట్టున్నారన్నారు మంత్రి నారా లోకేష్. ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డిపై ప్రసన్న వ్యక్తి గత దూషణలు చేయడం బాధకరమన్నారు. పెద్ద పెద్ద చదువులు చదివితే సరిపోదు.. కనీస ఇంగితజ్ఞానం ఉండాలని ప్రసన్నకు ఆయన హితవు పలికారు. మహిళల జోలికి వచ్చినా, ఆడ వారిపై అవాకులు చెవాకులు పేలినా ఊరుకునేందుకు ఇది జగన్ జంగిల్ రాజ్ కాదు.. మహిలలకు అండగా నిలిచే ప్రజా ప్రభుత్వమన్నారు. ప్రసన్న లాంటి సంస్కారహీనుల వ్యాఖ్యలు ప్రజా స్వామ్య వాదులందరూ ఖండించాలన్నారు మంత్రి నారా లోకేష్.

# ప్రశాంతిరెడ్డిపై వైసిపి మాజీ ఎమ్మెల్యే నీచమైన వ్యాఖ్యలు చేయడం దారుణం : మంత్రి నారాయణ



**నెల్లూరు, జులై 8, ప్రభాతవార్త-వైద్యం** కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై వైసీపీ మాజీ ఎమ్మెల్యే ప్రసన్న వ్యాఖ్యలను మంత్రి నారాయణ తీవ్రంగా ఖండించారు. మహిళ అని కూడా చూడకుండా సంస్కార రహితంగా మాట్లాడటం దారుణమన్నారు. మహిళలపై నోరు పారేసుకోవడం వైసీపీ నేతలకు కొత్తేమి కాదని గతంలో ఆ పార్టీ అధినేత సొంత చెల్లెలిపైనే దుర్భాషలాడిన ఉదంతాన్ని ఈ సందర్భంగా నారాయణ గుర్తు చేశారు. పసుపు చీర కట్టుకుని చంద్రబాబుని కలిసేందుకు వెళ్లారని షర్మిలపై అసభ్యంగా మాట్లాడిన వైసీపీ నేతలకు సభ్యతా సంస్కారాలు లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ పార్టీ అధినేత బాటలోనే మిగిలిన నేతలూ నడుస్తున్నారన్నారు. మహిళల పట్ల వైసీపీ నేతలకి ఎలాంటి అభిప్రాయం ఉందో మరోసారి బయటపడిందన్నారు. మహిళల పట్ల అగౌరవంగా మాట్లాడే వైసీపీ నేతలను ప్రజా జీవితం నుంచి బహిష్కరించాలని మంత్రి నారాయణ అన్నారు.

# దేశంలో ఏ సిఎం చేయలేనంత మంచి చేసిన నేత వైఎస్సార్

## వైకాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలు



వైకాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలు

**విజయవాడ,జూలై8,ప్రభాతవార్తప్రతినిధి:** దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయలేనంత మంచి చేసిన నాయకుడు వైఎస్ రాజశేఖరరెడ్డి అంటూ వైకాంగ్రెస్ పార్టీ పార్లమెంటరీ పార్టీ నేత వైవీ సుబ్బారెడ్డి కొనియాడారు.వైకాంగ్రెస్‌పార్టీ ప్రధాన కార్యాలయంలో వైఎస్ఆర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.కార్యాలయంలోని ఆయన విగ్రహానికి వైకాంగ్రెస్ పార్టీ నేతలు,కార్యకర్తలు నివాళులర్పించారు,ఈ సందర్భంగా వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. .సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ళలా భావించి పాలనే అందించారు వైఎస్ అన్నారు...ఉచిత విద్యుత్‌తో ఎంతో మంది రైతులు మేలు పొందాలరు. రెండు తెలుగు రాష్ట్రాల రైతుల గుండెల్లో వైఎస్సార నిలిచిపోయారని పేర్కొన్నారు. పేదవాడికి విద్య,వైద్యం, అందుబాటులోకి వైఎస్సార్ తెచ్చారన్నారు. దేశం లోనే ఆరోగ్యశ్రీ ప్రవేశపెట్టిన తొలి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ .ఫీజురీయంబర్స్‌మెంట్ వల్ల ఎంతో మంది విద్యావంతు లయ్యారు... విదేశాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు.ఇవన్ని తీసుకుని వచ్చింది రాజశేఖరరెడ్డి అన్నారు.పజలకు మేలైన సంక్షేమం అందించారు కాబట్టి వైఎస్సార్ అందరి గుండెల్లో నిలిచిపోయారని తెలిపారు.ఇక,రెండు పర్యాయాలు కాంగ్రెస్‌ను జాతీయస్థాయిలో నిలబెట్టింది వైఎస్సారే అన్నారు వైవీ సుబ్బారెడి ...వైఎస్సార్ ఆశయాల సాధన కోసం ఏర్పాటైన పార్టీ వైసీపీ...తండ్రి పాలనను మరిపించేలా సంక్షేమం అందించిన నాయకుడు వైఎస్ జగన్ అని అభివర్ణించారు. తండ్రి నాలుగు అడుగులు వేస్తే...కొడుకుగా జగన్ 10 అడుగులు ముందుకు వేశారన్న ఆయన...విద్య,వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారు. అందరికీ మెరుగైన వైద్యం అందించాలని మెడికల్ కాలేజీలను తెచ్చారు.రైతే రాజులా ఉండాలని వైఎస్సార్,జగన్ పాలన అందించారని గుర్తు చేశారు. అయితే, కూటమి పాలనలో అరాచకం కొనసాగుతోంది. కక్ష సాధింపుకే అధికారాన్ని వాడుకుంటున్నారు. అన్ని వర్గాల వారు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. కూటమి అరాచకాలను తిప్పి కొట్టేలా పోరాడుదాం...మళ్ళీ వైసీపీ అధికారం లోకి తెచ్చుకుందాం అని పిలుపునిచ్చారు వైవీ సుబ్బారెడ్డి.మరో వైపు వైఎస్సార్ ఎంతో మహోన్నతమైన వ్యక్తి...ఎవరైనా కష్టాల్లో ఉంటే వారికి వైఎస్సార్ అండగా ఉండేవారు.. .నేనున్నాను అనే ధైర్యం అందరిలోనూ కల్పించిన వ్యక్తి వైఎస్సార్ అని కొనియాడారు.

# గ్రూప్-1 అక్రమాల కేసులో నిందితుడు మధుసూదన్‌కు బెయిల్

## - ప్రతి ఆదివారం దర్యాప్తు అధికారి(ఐఓ) ముందు హాజరుకావాలి

**విజయవాడ,జూలై8,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ గ్రూప్-1 ప్రధాన పరీక్ష జవాబు పత్రాల మూల్యాంకనంలో అక్రమాలు నిధుల దుర్వినియోగం కేసులో రెండో నిందితుడు,క్యామ్‌సైన్ మీడియా సంస్థ డైరెక్టర్ పమిడికాల్వ మధుసూధన్‌కు హైకోర్టు షరతులతో బెయిలు మంజూరు చేసింది. న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడి సోమవారం ఈ మేరకు తీర్పు ఇచ్చారు. విజయవాడ కోర్టులో రూ.25వేల విలువైన రెండు పూచీకత్తులు సమర్పించాలని ఆదేశించారు. అభియోగపత్రం దాఖలు చేసే వరకు ప్రతి ఆదివారం దర్యాప్తు అధికారి(ఐఓ) ముందు హాజరుకావాలని మధుసూధన్‌కు స్పష్టం చేశారు. మూల్యాంకనంలో అక్రమాలపై విజయవాడ లోని సూర్యారావుపేట పోలీసులు నమోదు చేసిన కేసులో రెగ్యులర్ బెయిలు కోసం మధుసూధన్ హైకోర్టులో పిటీషన్ వేసిన విషయం తెలిసిందే. ఇటీవల వాదనలు పూర్తి కావడంతో తీర్పును రిజర్వు చేసిన న్యాయమూర్తి. సోమవారం నిర్ణయాన్ని ప్రకటించారు. ఏపీపీఎస్సీ తో చేసుకున్న ఒప్పందం లోని నిబంధనలకు అనుగుణంగానే మధుసూధన్ పనులు నిర్వహించారన్నారు. వైద్య నివేదికలు,కేసు లోని వివరాలను పరిగణనలోకి తీసుకొని బెయిలు మంజూరు చేస్తుననట్లు పేర్కొన్నారు.

# వ్యవసాయ ఫీడర్లకు 9 గంటల విద్యుత్ సరఫరా

## వినియోగదారులకు అంతరాయం లేకుండా నాణ్యమైన సరఫరా

## - ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్



**విజయవాడ, జులై8,ప్రభాతవార్తప్రతినిధి:** విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన , నిరంతరాయ విద్యుత్ సరఫరా కు అన్ని చర్యలు తీసుకోవాలని ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం సి ఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుండి ఏపీఈపీడీసిఎల్ , ఏపీఎస్పీడీసిఎల్ పరిధిలో విద్యుత్ సరఫరా గురించి ఛైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ ఐ పృధ్వి తేజ్, ఏపీఎస్పీడిసిఎల్ సిఎండీ కే సంతోష రావు, ఏపీట్రాన్స్కో గ్రిడ్ డైరెక్టర్ ఏకెవీ భాస్కర్ లతో సిఎస్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ , విద్యుత్ సరఫరాలో ఏవైనా అంతరాయాలు తలెత్తితే తక్షణం స్పందించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా , విద్యుత్ అంతరాయాలు లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సిఎస్ ఆదేశించారు. . సర్వీస్ వైర్ (కండక్టర్ ) వల్ల ఏమైనా సమస్యలు తలెత్తితే సర్వీస్ వైర్లు మార్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఒకసారి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటే మళ్ళీ అదే సమస్య పునరావృతం కారాదని సూచించారు. ఎక్కడైనా పవర్ కండక్టర్ తెగిపోతే... ఎందుకు కట్ అయ్యిందో తెలుసుకోవాలని, అలాగే పాత కండక్టర్లను గుర్తించి వాటిని మార్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి మండలానికి గ్యాంగ్ లను ఏర్పాటు చేసి జంపర్లు , హాంగింగ్ వైర్లు , లో వోల్టేజ్ సమస్యలను వెంటనే గుర్తించి తక్షణం పరిష్కరించి నిరంతర విద్యుత్ అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రస్తుతం ప్రజాప్రతినిధులు గ్రామాలను సందర్శించి ప్రజలతో మమేకం అవుతున్నారని , ఈ సందర్భంగా విద్యుత్ సరఫరా కు సంబంధించి ఏదైనా సమస్య విద్యుత్ సిబ్బంది దృష్టికి తీసుకువస్తే వాటి ప్రపిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. సిఎండీ మొదలుకొని , లైన్ మెన్ వరకు అందరు అప్రమత్తంగా ఉంటూ తక్షణం విద్యుత్ సమస్యలు పరిష్కరించి వినియోగదారుల సంతృప్తి స్థాయి మరింత పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో ప్రమాదాలు జరుగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు కూడా తీసుకోవాలని సిఎస్ కె విజయానంద్ ఆదేశించారు.వార్డు సచివాలయాల్లో పని చేసే విద్యుత్ సిబ్బంది పెన్షన్ పంపిణి రోజు మాత్రమే ఆ విధులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని మిగిలిన సమయాల్లో విద్యుత్ సంబందించిన సేవలకు ఉపయోగించుకోవాలని సిఎస్ సిఎండీలను ఆదేశించారు.

# కోవూరులో కదం తొక్కిన మహిళలు

## - ప్రసన్నను అరెస్టు చేయాలని డిమాండ్




**కోవూరు జూలై 8 ప్రభాతవార్త :** కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలపై కోవూరు నియోజకవర్గ మహిళాలోకం భగ్గుమంది. ఈ మేరకు మంగళవారం ఉదయం స్థానిక ఆంజనేయ స్వామి గుడి ప్రాంతంలో నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రాంతాల నుంచి వేలాదిగా మహిళలు ఆ ప్రాంతానికి చేరుకున్నారు. అక్కడి నుంచి స్థానిక తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ కార్యక్రమం చేపట్టడమే కాకుండా ప్లకార్డులు పట్టుకుని ప్రసన్నకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వానికి అభివృద్ధి , సంక్షేమం తప్ప నీచ రాజకీయాలు తెలియవన్నారు. కోవూరు నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో పయనింపజేస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిని.. మాజీ ఎమ్మెల్యే ప్రసన్న పత్రికల్లో రాయలేని భాషను మాట్లాడడం నీచ సంస్కృతికి నిదర్శనమన్నారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో తమవంతుగా సామాజిక కార్యక్రమాలు చేపడుతున్న వేమిరెడ్డి దంపతులకు ఇటువంటి చౌకబారు విమర్శలు చేయడం మాజీ ఎమ్మెల్యేకు తగదన్నారు. ఇటువంటి వ్యాఖ్యలు మరలా చేస్తే పరిస్థితి తీవ్రంగా ఉంటుందని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు. మహిళా ఎమ్మెల్యే అని చూడకుండా అనుచిత వ్యాఖ్యలు చేసిన ప్రసన్నకుమార్‌రెడ్డిపై వెంటనే చర్యలు తీసుకోవడమే కాకుండా ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి బేషరుతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. క్షమాపణ చెప్పకపోతే మహిళల చేతుల్లో మాజీ ఎమ్మెల్యేకు తగిన గుణపాఠం చెబుతామని ఈ సందర్భంగా వారు తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీ చేశారు. ప్రసన్నకుమార్‌రెడ్డి గురించి జిల్లాలోనే కాదు.. రాష్ట్రంలో కూడా అతని గురించి ప్రతి ఒక్కరికి తెలుసన్నారు. అటువంటి వ్యక్తి ఇటువంటి మాటలు మాట్లాడడం సరైనది కాదని, ఇప్పటికే కోవూరు నియోజకవర్గ ప్రజలు అతనిని భారీ మెజార్టీతో ఓడించినా నేటికీ బుద్ధి రాలేదన్నారు. ఈర్యాలీలో కోవూరు నియోజకవర్గ పరిధిలోని టీడీపీ నేతలు జెట్టి రాజగోపాల్‌రెడ్డి, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, పూండ్ల అచ్యుత్ రెడ్డి, పాశం శ్రీహరిరెడ్డి, ఇంతా మల్లారెడ్డి, కొల్లారెడ్డి సుధాకర్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, వేగూరు సర్పంచ్ అమరావతి, నేతలు బాల రవి, సుధాకర్, వెంకట్, అమరేంద్రరెడ్డి, వీరేంద్రనాయుడు, హరి, వెంకట రమణమ్మ, వనమ్మ, రాఖీ, శ్రీనివాసులు నాయుడు, సీహెచ్ పెంచలయ్య, నల్లపరెడ్డి సురేష్‌రెడ్డి, పెద్ద ఎత్తున మహిళా నేతలు , కార్యకర్తలు ఉన్నారు.

# రాయలసీమలో సామాజిక న్యాయం జరగాలి!

## - అమరావతిలో జరిగే ఉద్యోగ నియామకాల్లో ఫ్రీ జోన్ ఏర్పాటు చేయాలి

## - రాయలసీమ ప్రజావేదక చర్చా వేదికలో వక్తలు!



సమావేశంలో మాట్లాడుతున్న మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు ఎస్ఎం బాషా

**అనంతపురం, జూలై 08 ప్రభాతవార్త బ్యూరో** రాయలసీమ ప్రాంతంలో సామాజిక న్యాయం చేయాలని మానవహక్కుల వేదిక రాష్ట్ర నాయకులు ఎస్.ఎం.బాషా పేర్కన్నారు. మంగళవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో రాయలసీమ సమస్యలపై ప్రజా ఉద్యమ కారుడు పసలూరి ఓబిలేసు అధ్యక్షతన చర్చావేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్.ఎం.బాషా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సెప్టెంబర్ 14న పసలూరి ఓబిలేసు ఆధ్వర్యంలో రాయలసీమ ప్రజా వేదిక ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో స్థానికంగా ప్రజా సంఘాలు, మేధావుల సూచనలు, సలహాలు కోసం సమావేశం ఏర్పాటు చేశారు. తర్వాత మిగతా రాయలసీమ జిల్లాలో కూడా ఇలాంటి సభలు ఏర్పాటు చేసి అందరి సూచన , సలహాలు తీసుకోవాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా బాషా మాట్లాడుతూ రాయలసీమలో సామాజిక న్యాయం జరగాల్సిన ఆవశ్యకత చాలా వుందాన్నారు. తన సామజిక ఉద్యమ చరిత్రలోమొదటి సారి సామాజిక రాయలసీమ అంశం చర్చకు వచ్చిందన్నారు. ఇది ఎంతో శుభదాయం, ఆయా వర్గాలు ప్రజాక్షేత్రం రావాల్సిన అవసరం వుంది, ఈ నేరు సందర్భానుసారంగా ఆనంద పడుతున్నానన్నారు. గతం ప్రభుత్వం జిల్లాకొక మెడికల్ ప్రభుత్వరంగంలో మంజూరు చేసిందని, ఆ కాలేజిలు నిర్మాణ దశలో వున్నాయని వాటిని ప్రైవేట్ రంగాలకు అప్పగించడం అన్యాయమన్నారు. ప్రభుత్వం ఏదైనా విధానాల విషయంలో ఒకే రకంగా ఉండాలన్నారు. చివరికి మెడికల్ సీట్లు అడ్మిషన్లు కూడా అవసరం లేద కేంద్ర ప్రభుత్వాని ఉత్తరం రాయడం సరికాదన్నారు. ఇలాంటి సంఘటనలు తను ఎన్నడూ చూడలేన్నారు. దేశంలో అన్ని ఐఐటి లోనూ రిజర్వేషన్లు వున్నాయని, తిరుపతి ఐఐటిలో రిజర్వేషన్ లేక పోవడం వెనక వున్న కుట్ర ఏమని ప్రశ్నించారు. అదే విధంగా అమరావతి రాజదానిలో జరిగే ఉద్యోగ నియామకాలలో రాయలసీమ అభ్యర్థులకు అన్యాయం జరిగే ప్రమాదం వుందన్నారు. అమరావతి రాజదాని పరిధిలో జరిగే ఉద్యోగ నియామకాలకు ఫ్రీ జోన్ ఏర్పాటు చేయాలన్నారు. మిగతా వక్తలు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఇప్పటి వరకు వ్యవసాయం, సాగునీరు లాంటి అంశాలపై రాయలసీమ ఉద్యమాలు జరిగాయని, సామాజిక అంశాలు కూడా చర్చ చేయాలని, వాటి కోసం పోరాడాలని డిమాండ్ చేశారు. ఎయిమ్స్ ను రాయలసీమకు తరలించాలని డిమాండ్ చేశారు. నూతన జిల్లాలకు నవోదయ పాఠశాలలు ఏర్పాటు చేయాలన్నారు. గత ప్రభుత్వంలో మంజూరు చేసిన మెడికల్ కాలేజిలను ప్రభుతమే కొనసాగించాలన్నారు. రాచేపల్లి లెదర్ పరిశ్రమను తక్షణం ప్రారంభించాలన్నారు. ఎస్ సి, ఎస్ టి విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలన్నారు. ఇక్కడి పరిశ్రమలలో స్థానికులకు 60 శాతం ప్రాధాన్యతనివ్వాలని డిమాండ్ చేశారు. స్థానిక సహజన ఖనిజ వనరుల ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలన్నారు. వలసన నివారణ కోసం ఉపాధి హామీ పథకం ఏడాది పొడవునా కొనసాగించి, కనీస వేతనం ద్వారా రోజుకు రూ 500 కూలీ నిర్ణయుంచాలని డిమాండ్ చేశారు. స్థానిక చెరువులు, నీటి కుంటలలో ఉపాధి హామీ పథకం ద్వార పూడిక తీసి, భూగర్భ జలాలను కాపాడలన్నారు. వీటితో పాటు తుంగభద్ర కృష్ణా జలాలలో మన వాటా కోసం పోరాడాలన్నారు. హెచ్ ఎల్ సి నీటి వినియోగం కోసం సమాంతర కాలువ అనివార్యమన్నారు. హంద్రీ నీవా కాలువకు సిమెంట్ నిర్మాణాలు చేస్తే ఈ ప్రాంతంలో భూగర్భ జిలాలు అడుగంటిపోతాయని, కాలువల కోసం భూములు త్యాగం చేసిన రైతుల అన్యాయం చేయవద్దని సూచించారు. కరువు నివారణలో భాగంగా 20 శాతం భూములను పచ్చ బయళ్లుగా ఏర్పాటు చేసి పశులు, గొర్రెలకు నీటి సదుపాయం ఏర్పాటు చేయాలన్నారు. వీటి నుంచి పాడి పరిశ్రమ, గొర్రెలు, మేక పంపకం ద్వార ఉపాధి మెరుగుపడి వలసలు తగ్గితాన్నారు.

# ప్రభుత్వ వైద్యులు అవినీతికి పాల్పడితే కొరడా!

## వైద్య ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్




డిసిహెచ్‌యస్‌లు, డిఎంహెచ్వోల శిక్షణా కార్యక్రమంలో ప్రసంగిస్తున్న వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్

**విజయవాడ,జూలై8,ప్రభాతవార్తప్రతినిధి:** జిల్లా ఆరోగ్య సేవల సమన్వయాధికారుల(డిసిహెచ్‌యస్‌ల) పనితీరులో మార్పురావాలని వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. రెండు నెలల క్రితం డిసిహెచ్‌యస్‌లు, డిఎంహెచ్వోల సమీక్షా సమావేశంలో పలు కీలకాంశాల్ని గమనించానని, వాటిని సరిచేసేందుకు శిక్షణివ్వాలని భావించామని మంత్రి తెలిపారు. జిల్లాల్లో టీంను లీడ్ చేసే లీడర్లుగా జిల్లా అధికారులు ఎదగాలన్నారు. తాడేపల్లిలోని సెకండరీ హెల్త్ డైరెక్టర్ కార్యాలయంలో 26 జిల్లాల డిసిహెచ్‌యస్‌లకు నాలుగు రోజుల రాష్ట్ర స్థాయి శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం మంత్రి ప్రారంభించారు. సెకండరీ హెల్త్ డైరెక్టరేట్ రూపొందించిన సమగ్ర యాప్ ను మంత్రి ఆవిష్కరించారు. డిసిహెచ్‌యస్‌లను ద్దేశించి మంత్రి మాట్లాడుతూ అవినీతిని ఏమాత్రం సహించేదిలేదన్నారు. సమన్వంతో పనిచేయడం ద్వారా వైద్యసేవల్లో ఆశించిన మార్పు తీసుకురావాలని, డిసిహెచ్ యస్ లుగా మీమీ బాధ్యతలకు పూర్తి న్యాయం చేయాలని, డిసిహెచ్ యస్ ల మధ్య ఆరోగ్యకరమైన పోటీ ఉండాలని మంత్రి సూచించారు. క్షేత్ర స్థాయిలో పర్యటించడం వల్ల వాస్తవ పరిస్థితుల్ని తెసుకోగలుగుతారన్నారు. సమయపాలన పాటించని డాక్టర్ల విషయంలో ఉపేక్షించేదిలేదన్నారు. వ్యక్తిగత విషయాలకంటే లోగులకు సేవకు ప్రాధాన్యతనివ్వాలని, ఆర్థికాభివృద్ధికి ఆరోగ్యమే ప్రధానమనే విషయాన్ని గ్రహించాలని, వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యాన్ని చేరుకునే దిశగా అంకిత భావంతో పనిచేయాలని మంత్రి తెలిపారు. సెకండరీ ఆసుపత్రుల్లో సిజేరియన్ ఆపరేషన్లను బాగా తగ్గించాలని, సాధారణ ప్రసవాలు జరిగేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. జిల్లాల్లో డిసిహెచ్‌యస్‌ల ఆధ్వర్యంలోని జిల్లా, ప్రాంతీయ, సామాజిక ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాలు లేకపోవడం, హాజరు పర్యవేక్షణా యంత్రాంగం లేకపోవడం, డయాగ్నోస్టిక్ సేవల లభ్యత, సరైన ఆడిట్ లేకపోవడం, జిల్లా స్థాయిల్లో లోపాలు, కొరతల్ని గుర్తించలేకపోవడం వల్ల వీటిని సరిచేసేందుకు శిక్షణా కార్యక్రమం అవరమని భావించామన్నారు. సరైన ఓరియంటేషన్ ఇవ్వగలిగితే వ్యవస్థను సరిచేయవచ్చునేది ముఖ్యోద్దేశమన్నారు.

కింది స్థాయి నుండి పైస్థాయి వరకు వైద్య సేవల్ని గాడిన పెట్టాలన్నారు. సెకండరీ ఆసుపత్రుల్లో డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, ప్రిఆథరైజేషన్లు పెంచాలని మంత్రి ఆదేశించారు. గతేడాది జూన్‌లో 15 శాతమున్న ప్రిఆథరైజేషన్లు ఈ ఏడాది జూన్ నాటికి 24 శాతానికి పెరిగాయని, దీన్ని 80 శాతానికి పెంచేందుకు కృషి చేయాలన్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో 80 నుంచి 90 శాతం మేర ప్రిఆథరైజేషన్లు జరుగుతున్నాయని, సెకండరీ ఆసుపత్రుల్లో కూడా ఇదే స్థాయిలో జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రిఆథరైజేషన్ల విషయంలో సెకండరీ హెల్త్ డైరెక్టర్, డిసిహెచ్‌యస్‌లు సీరియస్‌గా వ్యవహరించాలన్నారు.

# అనంతపురం, చిత్తూరు మ్యాచ్ డ్రా..

## - మచ్చా దత్తరెడ్డి 164 పరుగులు 9 సిక్సర్లు, 16 ఫోర్లు..

**అనంతపురం, జులై 08 ప్రభాతవార్త బ్యూరో** ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అనంతపురం జిల్లా క్రికెట్ అసోసియేషన్ నిర్వహిస్తున్న సీనియర్స్ మల్టీ డే క్రికెట్ మ్యాచ్‌లో అనంతపురం జిల్లా రంజి క్రీడాకారుడు మచ్చా దత్తారెడ్డి అద్భుత బ్యాటింగ్ ప్రదర్శన వృథా ఆయింది మచ్చా దత్తరెడ్డి 164 పరుగులు చేసిన జట్టుని గెలిపించలేకపోయారు. ఒంటరి పోరాటం చేసిన ఫలితం లేకపోయింది. చివరిదాకా ఆడిన ఉపయోగం లేకుండా అయిపోయింది. అనంతపురం జిల్లాకు చెందిన మిగిలిన బ్యాట్స్‌మెన్లు ఎవరు రాణించకపోవడంతో అనంతపురం జట్టుపై చిత్తూరు జట్టు మొదటి ఇన్నింగ్ ఆధిక్యత సాధించింది. ఆంధ్ర రంజీ ప్లేయర్ మచ్చా దత్తరెడ్డి 196 బంతుల్లో 9 సిక్సర్లు, 16 ఫోర్లతో 164 పరుగులు చేశాడు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ సీనియర్ మల్టీడే క్రికెట్ మ్యాచ్‌లు అనంతపురం ఆర్డీటీ క్రీడా ప్రాంగణంలోని అనంతపురం క్రికెట్ గ్రౌండ్‌లో అనంతపురం, చిత్తూరు జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్ డ్రాగా ముగిసింది. చిత్తూరు జట్టు ఇన్నింగ్స్ ఆధిక్యంతో 3 పాయింట్లు, అనంతపురం జట్టుకు 1 పాయింట్ దక్కింది. మూడోవ రోజు ఓవర్ నైట్ స్కోరు 199/4 బ్యాటింగ్ కు వచ్చిన అనంతపురం 90 ఓవర్లలో 377 పరుగులకు ఆలౌట్ ఆయింది.

అనంతపురం బ్యాటర్ ఆంధ్ర రంజీ ప్లేయర్ మచ్చా దత్తరెడ్డి నిలకడగా రాణించాడు. 196 బంతుల్లో 9 సిక్సర్లు 16 ఫోర్లతో 164 పరుగులు, గిరినాథ్ రెడ్డి 37 పరుగులు, వినయ్ కుమార్ 20 పరుగులు తీశారు.

# మినీ ట్రక్ ఏస్ ప్రోను ఆవిష్కరించిన టాటా మోటార్స్

**రాజమహేంద్రవరం, జులై 08 , ( ప్రభాతవార్త ) :** భారతదేశ అతిపెద్ద వాణిజ్య వాహన తయారీదారు అయిన టాటా మోటార్స్ సరికొత్త టాటా ఏస్ ప్రోను ప్రారంభించడం ద్వారా కార్గో మొబిలిటీలో కొత్త మైలురాయిని సృష్టిస్తూ, చిన్న కార్గో మొబిలిటీలో పరివర్తన యుగానికి నాంది పలికిందని టాటా మోటార్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిరీష్ వాఘ్ తెలిపారు. కేవలం రూ.3.99 లక్షల సాటిలేని ప్రారంభ ధరతో, టాటా ఏస్ ప్రో భారతదేశంలో అత్యంత సరసమైన నాలుగు చక్రాల మినీ ట్రక్. ఇది అసాధారణ సామర్థ్యం, సాటిలేని బహుముఖ ప్రజ్ఞ మరియు ఉన్నతమైన విలువను అందిస్తుందన్నారు. కొత్త తరం వ్యవస్థాపకులకు సాధికారత కల్పించడానికి రూపొందించబడిన టాటా ఏస్ ప్రో పెట్రోల్, రెండు రకాల ఇంధనం (సిఎన్ జీ ప్లస్ పెట్రోల్) మరియు ఎలక్ట్రిక్ వేరియంట్లలో లభిస్తుందన్నారు. ఇది వినియోగదారులకు వారి వ్యాపార అవసరాలకు అనువైన ఉత్పాదనను ఎంచుకునే సౌలభ్యాన్ని అందిస్తుంది. దేశవ్యాప్తంగా ఉన్న టాటా వోటార్స్ 1250 వాణిజ్య వాహనాల అమ్మకాల టచ్‌పాయింట్లలో లేదా టాటా మోటార్స్ ఆన్‌లైన్ అమ్మ కాల ప్లాట్‌ఫామ్ అయిన ఫ్లీట్ వెర్స్‌లో కస్టమర్లు తమకు నచ్చిన ఏస్ ప్రో వేరియంట్‌ను బుక్ చేసుకోవచ్చు అన్నారు. టాటా ఏస్ ప్రో యాజ మాన్యాన్ని సౌకర్యవంతంగా చేయడానికి, టాటా మోటార్స్ ప్రముఖ బ్యాంకులు, ఎన్‌బిఎఫ్‌సిలతో కలిసి పనిచేసి, త్వరిత రుణ ఆమోదాలు, సౌకర్యవంతమైన ఈఎంఐ ఎంపికలు, మెరుగైన నిధుల మద్దతుతో సహా విభిన్న కస్టమర్ అవసరాలకు అనుగుణం గా తిరుగులేని ఫైనాన్సింగ్ పరిష్కారాలను అందిస్తోందని చెప్పారు. 'టాటా ఏస్ ప్రారంభం భారతదేశంలో కార్గో మొబిలిటీని విప్లవాత్మకంగా మార్చిందని, పురోగతి అవకాశాల చిహ్నంగా ఇది గత రెండు దశాబ్దాలుగా25 లక్షలకు పైగా వ్యవస్థాపకులను విజయవంతంగా శక్తివంతం చేసింది. కొత్త తరం కలలు కనేవారి కోసం సరికొత్త టాటా ఏస్ ప్రోతో మేం ఈ వారస త్వాన్ని నిర్మిస్తున్నాం అని తెలిపారు. సుస్థిరత్వం, భద్రత, లాభదాయకత కోసం రూపొందించబడిన ఏస్ ప్రో, వారి భవిష్యత్తును చూసుకోవ డానికి సిద్ధంగా ఉన్న ఔత్సాహిక వ్యవస్థాపకుల ఆశయాలను నెరవేర్చడానికి ఎక్కువ సంపాదన సామర్థ్యాన్ని అందిస్తుంది" అని టాటా మోటార్స్ కమర్షియల్ వెహికల్స్ ఎస్‌సివీపీయూ విభాగ హెడ్ పినాకి హల్దార్ అన్నారు.

# కనకదుర్గ అమ్మవారికి సారే



**కె.గంగవరం, జులై 08 , ( ప్రభాతవార్త ) :** గ్రామంలోని కనకదుర్గ అమ్మవారికి పెంటపాటి ప్రభాకర్ కుటుంబ సభ్యులు,భక్తులు ఆషాడ మాసం సందర్భంగా చీర,రవిక, స్వీట్లు సారెను అందించడం జరిగింది. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

# సర్వీసులు క్రమబద్ధీ కరణ చేయాలి

**మామిడికుదురు., జులై 08 , ( ప్రభాతవార్త ) :** సర్వశిక్షా అభియాన్ లో పనిచేస్తున్న తమ సర్వీసులను క్రమబద్ధీ కరణ చేయాలని కోరుతూ ఎస్ఎస్ఎ ఉద్యోగులు మంగళవారం స్థానిక ఎమ్మార్వో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు ఈ నిరసన కార్యక్రమం చేపట్టారు.ఎస్ఎస్ఎ లో పని చేస్తున్న సిబ్బంది కీ మినిమం టైమ్ స్కేల్ అమలు చేయాలని, హెచ్.ఆర్ పాలసీ ఇవ్వాలని, ఉద్యోగవిరమణ



వయసు 62 సంవత్సరాలకు పెంచాలని గ్రాడ్యూటీ ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. జేఏసీ నాయకులు రాజేంద్ర ప్రసాద్, బత్తుల శ్రీనివాస్, విపర్తి హేమలత, పూర్ణ, మాలతీ, లక్ష్మీనారాయణ,ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# రైతుల పొలాల్లో పూలు, పండ్ల మొక్కల,పెంపకం



**ఆత్రేయపురం, జులై 08 , ( ప్రభాతవార్త ) :** ఉపాధి హామీ పథకం ద్వారా రైతుల పొలాల్లో పూలు, పండ్ల మొక్కల నాటే కార్యక్రమాన్ని సర్పంచ్ కాయల జగన్నాధం ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ బి.కె.ఎస్.ఎస్.వెంకట రామన్, పాల్గొని మొక్కలు పెంపకం గురించి రైతులకు అవగాహన కల్పించారు.రాష్ట్ర వ్యాప్తంగా రైతుల పొలాల్లో పూలు, పండ్ల మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా ఆత్రేయపురం మండలం లొల్ల గ్రామ పంచాయితీ నందు కల్లూరి లక్ష్మీనారాయణ పొలంలో మంగళవారం రైతులు పొలాల్లో పండ్ల, పూల మొక్కలు పెంచాలని అవి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు కూసంపూడి రామకృష్ణంరాజు, ఏపీవో విజయ్ రెడ్డి , కూటమి నాయకులు, ఉపాధి హామీ సిబ్బంది, ఉపాధి హామీ వేతన శ్రామికులు పాల్గొన్నారు.

# ఘనంగా వైఎస్ఆర్ జయంతి వేడుకలు

**సీతానగరం, జులై 08 , ( ప్రభాతవార్త ) :** మండలంలోని పలు గ్రామాల్లో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి 76వ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలుచోట్ల ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. చీపురుపల్లి గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకుడు మనెల్లి వెంకట్రావు ఆధ్వర్యంలో వైఎస్సార్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మనెల్లి మరియమ్మ, గోపిశెట్టి తులసిరామ్, కరాడపు వెంకట కృష్ణ తదితరులు పాల్గొన్నారు. సింగవరం గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకుడు అంబటి రమణ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ జయంతి వేడుకలు



ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో అంబటి స్వరూప, అంబటి రవిచంద్ర, అంబటి శ్రీను, పులిదిండి వీర నాగేశ్వరరావు, మద్రే వీరేంద్ర, నక్కిరిగంటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# పాన్ షాపుల్లో తనిఖీలు ,సిగరెట్, గుట్కా, పాన్ పాకెట్ల స్వాధీనం



**రావులపాలెం, జులై 08 , ( ప్రభాతవార్త ) :** రావులపాలెం మండల పరిధిలో గల పాన్ షాపులలో మత్తుపదార్థాలు, సిగరెట్, గుట్కా అమ్మకాలపై మంగళవారం పోలీసుల తనిఖీలు నిర్వహించారు. రావులపాలెం టౌన్ సిఐ ఎం శేఖర్ బాబు, పోలీసు సిబ్బందితో కలిసి స్కూల్స్, కళాశాలలు కు 100 మీటర్ల దూరం లో గల పాన్ షాపులలో తనిఖీలు నిర్వహించారు. ఈ సంధర్భంగా వలు షాపుల్లో సిగరెట్టు,గుట్కా, పాన్ మసాలాలను స్వాధీన పరుచుకుని షాపు నిర్వాహకులకు ఫైన్ విధించారు. హాస్పిటల్స్, పాఠశాలలు, కాలేజి సమీపాలలో గల పాన్ షాపుల్లో సిగరెట్లు, గుట్కా, పాన్ ల వంటి మత్తు పదార్థాల అమ్మకాలు సాగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సిఐ శేఖర్ బాబు హెచ్చరించారు.

# రోడ్డు ప్రమాదానికి గురైన యువతి చికిత్స పొందుతూ మృతి

**అంబాజీపేట, జులై 08 , ( ప్రభాతవార్త ) :** యిమండలంలోని గంగలకుర్రు అగ్రహారం శివారు ఫీర్మియాపాలెం హెచ్పీ పెట్రోల్ బంక్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న ఓ యువతి సోమవారం రాత్రి మృతి చెందింది. అంబాజీపేట పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక కొర్లపాటివారిపాలెంకు చెందిన మిండుగుదిటి పవిత్ర ధనలక్ష్మి (21) ఈ నెల 5న మోటారు సైకిల్పై అమలాపురం వైపు వెళు తుండగా ప్రక్కదారి నుండి వచ్చిన మరో వోటారు సైకిలిస్టు ఢీ కొట్టిన ఘటనలో తీవ్ర గాయాలపాలయ్యిందన్నారు. కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతురాలి సోదరుడు మిండుగుదిటి సిద్ధివినయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్లు హెచ్సీ వి.సత్యనారాయణ తెలిపారు.

# ప్రశ్నించేతత్వం లేని వారు ప్రజాప్రతినిధులు కాలేరు

**- గంజాయి,మాదకద్రవ్యాల విక్రేతలపై ఉక్కు పాదం**
**- అంబాజీపేట మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే గిడ్డి**

**అంబాజీపేట, జులై 08 , ( ప్రభాతవార్త ) :** ప్రశ్నించేతత్వం లేని వారు ప్రజాప్రతినిధులు కాలేరని, ప్రశ్నించే స్థాయి నుండి పాలన చేసే స్థాయికి చేరిన జనసేనాని,ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చక్కటి ఉదాహరణ అని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు.అంబాజీపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు మెరుగైన సేవలందించడంతో పాటు ప్రభుత్వ సమాచారం ఇవ్వడంలో అధికారులు విఫలమవుతున్నారని తక్షణమే అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అంబాజీపేటలో గంజాయి, మాదకద్రవ్యాల అక్రమ రవాణా సాగుతుందని తన దృష్టికి వచ్చిందని, దానిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి చర్యలు తీసుకునేలా పి.గన్నవరం సిఐ రుద్రరాజు భీమరాజుకు ఆదేశాలిచ్చామన్నారు. స్థానిక బస్ స్టేషన్ ఎదురుగా మద్యం షాపు నిర్వహించడం వల్ల బస్ స్టేషన్ మందుబాబులకు అడ్డాగా మారిపోయిందని, దాంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకవచ్చారు. దీనిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ మద్యంషాపు వల్ల ఇబ్బందులు ఉంటే స్థానిక ప్రజలే ఎందుకు నిలదీయడం లేదని,వారి నుండే చైతన్యం రావాలన్నారు. ప్రజాప్రతినిధులకు, సామాన్య ప్రజలకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా, సేవలందింకుండా, సమస్యలను పరిష్కరించకుంటే అధికారులు ఎందుకు ఉన్నారన్నారని అధికారులను నిలదీశారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేసే విషయంలో స్థానిక ప్రజాప్రతినిధులకు తప్పకుండా తెలియజేయాలన్నారు. వెలుగు పథకంలో



జరుగుతున్న అవినీతిని వెలికి తీచేందుకు ప్రత్యేక అధికారిని నియమించామని, డ్వాక్రా యానిమేటర్ల నియామకంపై నూతన పాలసీని అమలు చేస్తామని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తెలిపారు.పుల్లేటికుర్రు సర్పంచ్ జల్లి బాలరాజు మాట్లాడుతూ కులధృవీకరణ పత్రాలు, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు, పొజీషన్ సర్టిఫికెట్లకు దరఖాస్తు చేసుకున్నవారిని వీఆర్వోల వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఎంపీటీసీ సభ్యుడు పబ్బినీడి రాంబాబు మాట్లాడుతూ పుల్లేటికుర్రు గ్రామంలో ఇద్దరు వీఆర్వోలు కావలసి ఉండగా ఒక్కరే ఉన్నారని, ఒక్క విఆర్ఓ పై పని వత్తిడి పెరిగిపోవడంతో పనులు సకాలంలో పనులు పూర్తి కావడం లేదన్నారు. దీనిపై తహసీల్దార్ బి.చినబాబు మాట్లాడుతూ వీఆర్వోలతో సమావేశం ఏర్పాటు చేసి ప్రభుత్వ నిబంధనల మేరకు ధృవీకరణ పత్రాలు ఇస్తామని, వీఆర్వో పోస్టుల మంజూరుకు ఉన్నతాధికారులకు తెలియపర్చామన్నారు. కె.పెదపూడి ఎంపీటీసీ సభ్యురాలు ఈతకోట ఉషా భార్గవి మాట్లాడుతూ పంచాయతీలో నిధులు దుర్వినియోగం అవడంతో పాటు గత కొన్ని నెలలుగా పాలకవర్గం సమావేశం కూడా ఏర్పాటు చేయడం లేదని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు.వైస్ ఎంపీపీ నేతల నాగరాజు,ఎంపిటిసిలు విత్తనాల దుర్గాభవాని, వాకపల్లి దొరబాబులు తమ తమ గ్రామాల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.ఈ సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు బూడిద వరలక్ష్మి, ఇన్చార్జ్ ఎంపీడీవో ఎ.ఎల్. నరసింహం,డిప్యూడీ ఎంపీడీఓ కె.శ్రీనివాస్, సర్పంచ్లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ప్రత్తిపాడు నియోజకవర్గంలో పొగాకు ఉత్పత్తులపై పోలీసులు తనిఖీలు



**- బహిరంగ ధూమపానం, మద్యపానం నేరం**
**- సీఐ బి.సూర్య అప్పారావు**

**ప్రత్తిపాడు, జులై 08 , ( ప్రభాతవార్త ) :** బహిరంగంగా ధూమపానం, మద్యపానం నిషేధమని ప్రత్తిపాడు సీఐ బి. సూర్య అప్పారావు అన్నారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గంజాయి నిర్మూలన కు ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసినటువంటి ఈగల్ వింగ్ ఐ జి పి ఎ.కే రవికృష్ణ, ఆదేశాల ప్రకారం, ఎస్పీ జి . బిందు మాధవ్, పెద్దాపురం డి.ఎస్.పి శ్రీ హరిరాజు, ప్రత్తిపాడు సర్కిల్ లిమిట్స్ లో "ఆపరేషన్ సేఫ్ క్యాంపస్" అనే కార్యక్రమంలో భాగంగా ప్రత్తిపాడు,ఏలేశ్వరం అన్నవరం, రౌతులపూడి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఉన్న స్కూల్స్ కు 100 మీటర్ల పరిధిలో ఉన్నటువంటి కిరాణా దుకాణంలు, కిళ్లీ షాపులు నందు పొగాకు మరియు గుట్కా సంబంధిత ఉత్పత్తులు అమ్మకాల నిమిత్తం తనిఖీలు జరపగా, తనిఖీల్లో ఎటువంటి పొగాకు సంబంధిత ప్రొడక్ట్స్ లభించలేదు. ఈ తనిఖీ కార్యక్రమాల్లో ఎస్సైలు ఎస్ లక్ష్మీకాంతం, జి. హరిబాబు, ఎన్ రామలింగేశ్వర రావు, సిబ్బంది పాల్గొనడం జరిగింది.

## ఘనంగా వైయస్సార్ జయంతి



**అంబాజీపేట, జులై 08 , ( ప్రభాతవార్త ) :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి వైయస్. రాజశేఖర్ రెడ్డి 76వ జయంతిని అంబాజీపేట మండలంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. అంబాజీపేటలో వైఎస్సార్సీపీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్ ఆధ్వర్యంలో స్థానిక బస్ స్టేషన్ ఎదురుగా ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పి.గన్నవరం నియోజవర్గ కో-ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. కేకును కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. అనంతరం స్థానిక స్త్రీల ఆసుపత్రిలో గర్భిణీలు, బాలింతలకు పాలు, రొట్టెలు పంచిపెట్టారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి,ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, పీకే రావు, ఎం.ఎం.శెట్టి, కొర్లపాటి కోటబాబు, వాసంశెట్టి తాతాజీ, పేరి శ్రీను,వక్కలంక రాధాకృష్ణమూర్తి, వాసంశెట్టి పెదబాబు,మట్టపర్తి హరి,కుసుమ శ్రీను,మట్టపర్తి బాలాజీ, మైలా ఆనందరావు తదితరులు పాల్గొన్నారు. మొసలపల్లి, పుల్లేటికుర్రు, కె.పెదపూడి,ముక్కామల,వక్కలంక, గంగలకుర్రు, గంగలకుర్రు అగ్రహారం గ్రామాల్లో వైఎస్సార్ జయంతిని నిర్వహించారు.

# సోమవారం గ్రామంలో ఎత్తు పోతల పథకం ద్వారా నీరు విడుదల

**కిర్లంపూడి , జులై 08 , ( ప్రభాతవార్త ) :** మంగళవారం సోమవారం పంపింగ్ స్కీం వద్ద రైతులకు నీరు విడుదల చేసారు. సుమారు 1200 ఎకరాల రాయికట్టుకు నీరు అందించడం జరుగుతుందని జ్యోతు ల నెహ్రూ తెలిపారు..కూటమి ప్రభుత్వం సంక్షేమం అభివృద్ధి చేయండం జరుగుతుంది అన్నారు.ఎత్తుపోతల పథకం ఖర్చు నిమిత్తం డిఈ దుర్గా గురవయ్యను అడిగి తెలుసుకున్నారు. సుమారు పది సంవత్సరాలపాటు ఎనిమిది కోట్ల రూపాయలు అవసరం అవుతాయి అని వాటికి తగినట్లు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు ప్రభుత్వానికి పంపించినట్లు ఎమ్మెల్యే నెహ్రూకి వివరించారు. తప్పకుండా రైతులకు మేలు చేయాలన్నారు ఈకార్యక్రమంలో ఎంపిపి తోట రవి తోట గాంధీ టిడిపి మండాలాధ్యక్షుడు చదరం చంటి బాబు టిడిపి సీనియర్ నాయకులు జంపన సీతా రామ చంద్ర వర్మ నీటి సంఘం అధ్యక్షుడు జ్యోతుల కోటి టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు మంచి కంటి



శ్రీను గంగిరెడ్ల దొరబాబు భూపాలపట్నం గ్రామ సర్పంచ్ వీరంరెడి కాశీబాబు జట్ల సదా సాంబశివరావు అరిజింపూడి శ్రీనివాస్ పలువురు పాల్గొన్నారు. తూము కుమార్ టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ కుర్ల చినబాబు గుడాల రాంబాబు కాళ్ల వెంకటేష్ జంపన రవివర్మ జనసేన పార్టీ నాయకులు ఏనుగు పల్లి శ్రీనివాస్ ఎంపిడివో హరికృష్ణ కృష్ణ ఎన్ ఆర్ ఈజియస్ జేఈ కుమారి గోవిందు రాజేష్ ఉన్నారు.

# మండలంలో అంబరాన్నంటిన వై.ఎస్.అర్ జయంతి వేడుక



**జగ్గంపేట, జులై 08 , ( ప్రభాతవార్త ) :** మండలంలోదివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి 76వ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గం వైసిపి ఇంచార్జ్ తోట నరసింహం ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయంలో వైయస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.అనంతరం అక్కడి నుంచి బయలుదేరి సెంటర్లో ఉన్న వైయస్సార్ విగ్రహం వద్దకు చేరుకుని భారీ కేకును కట్ చేశారు. ఈ సందర్భంగా నరసింహం మాట్లాడుతూ వైయస్ రాజశేఖర్ రెడ్డి చేసిన సేవలు మరవలేనివని తన తండ్రి అడుగుజాడలో నాయకులు జగన్మోహన్ రెడ్డి నడుస్తున్నారని ఆయన చెప్పిన విధంగా తూచా తప్పకుండా నియోజవర్గంలో అమలు చేస్తామని కార్యకర్తలు అందరికీ తెలిపారు అనంతరం రాజశేఖరరెడ్డి తో తనకి ఉన్న బంధాలను కొనియాడారు 108, 104 అంబులెన్సులు ఇప్పటికే నడుస్తున్నాయంటే దానికి కారణం ఏకైక వ్యక్తి వైఎస్సార్ అన్నారు.వైసీపీ మాజీ శాసన సభ్యులు జ్యోతుల చంటిబాబు ఆధ్వర్యంలో జగ్గంపేట నియోజకవర్గం లో వైయస్సార్ జయంతి వేడుకలు ఆయా మండలాల్లో ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా మండల కేంద్రమైన జగ్గంపేట తమ పార్టీ కార్యాలయంలో సీనియర్ నాయకులు జ్యోతుల రామస్వామి ఆధ్వర్యంలో జగ్గంపేట గ్రామ ఉపసర్పంచ్ బండారు రాజా అధ్యక్షతన వైఎస్ఆర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.పార్టీ కార్యాలయం నుంచి అధిక సంఖ్యలో బైక్ ర్యాలీతో మెయిన్ రోడ్ లో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి చేరుకున్నారు అనంతరం అభిమానుల నడుమ భారీ కేకును కట్ చేసి నాయకులకు కార్యకర్తలకు అందజేశారు.జగ్గంపేట నియోజకవర్గ కేంద్రంలో జగ్గంపేట జడ్పీటీసీ ఒమ్మి బిందుమాధవి ఆధ్వర్యంలో జరిగిన వై యస్ ఆర్ 76 వ జయంతి వేడుకల్లో ఒమ్మి రఘురామ్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ముందుగా జడ్పీటీసీ బిందుమాధవి, రఘురామ్ వై యస్ ఆర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. తదుపరి జగ్గంపేట ప్రధాన కూడలిలో మరియు గోకవరం రోడ్డులో గల వై యస్ ఆర్ విగ్రహాలకు పూలమాల వేసి కేక్ కట్ చేసి నాయకులకు కార్యకర్తలకు, వై యస్ ఆర్ అభిమానులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అధికసంఖ్యలో వై.ఎస్.అర్ అభిమానులు, వైస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉధృతంగా ప్రవహిస్తున్న కోటిపల్లి గోదావరి

**కె.గంగవరం, జులై 08 , ( ప్రభాతవార్త ) :** గంగవరం మండలం కోటిపల్లి గోదావరి ఎగువ కురిసిన భారీ వర్షాల వల్ల ఉధృతంగా ప్రవహిస్తుంది. స్నాన ఘట్టం వరకు వరద నీరు ప్రవహించడం వలన లంక ,తీరప్రాంతంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు తెలియజేశారు.



# కొబ్బరి తోటల్లో ఉద్యాన పంటలను ప్రోత్సహించాలి - ఎమ్మెల్యే గిడ్డి

## ఉద్యాన పంటలకు ఆసరాగా ఉపాధిహామీ పథకం



**అంబాజీపేట, జులై 08 , ( ప్రభాతవార్త ) :** కొబ్బరి తోటల్లో ఉద్యాన పంటలను ప్రోత్సహించాలని, తద్వారా రైతుకు అదనపు ఆదాయం కలగడంతో పాటు కొబ్బరి చెట్లకు ప్రయోజనం చేకూరుతుందని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. ఉద్యాన పంటల ప్రోత్సాహంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా జరుతున్న ఈ కార్యక్రమం సందర్భంగా మండలంలోని మాచవరం పంచాయతీ పరిధిలోని పోతాయిలంకలో రైతు ముత్యాల సత్యనారాయణ కొబ్బరి తోటలో అంతర పంటగా కోకో మొక్కలను ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఎన్డీఏ కూటమి శ్రేణులతోపాటు ఉపాధి హామీ పథకం హక్కుదారులతో కలిసి మంగళవారం నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఉపాధి హామీ పథకాన్ని ఉద్యాన శాఖతో అనుసంధానం చేయటం వల్ల కోకో,ఇతర ఉద్యాన పంటల సాగులో రైతులకు నిర్వహణా వ్యయం తగ్గి ఆదాయం పెరిగే దిశగా ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ఈ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉపాధి హామీ పథకం ఏపీవో అడపా శ్రీ వెంకట కృష్ణ మాట్లాడుతూ మండలంలోని 73.56 ఎకరాలలో 41 మంది రైతులకు, 11,466 కోకో మొక్కలు పంపిణీ చేస్తున్నామని,ఇందుకు అవసరమైన రూ. 73.63 లక్షలను రాష్ట్ర ప్రభుత్వం భరిస్తోందని వివరించారు. ఉద్యాన శాఖ, ఉపాధి హామీ పథకం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రైతు నాయకులు ముత్యాల జమీల్, కూటమి నాయకులు శిరిగినీడి వెంకటేశ్వరరావు, దాసరి వీర వెంకట సత్యనారాయణ, బొంతు పెదబాబు,గణపతి వీరరాఘవులు,మైపాల తాతాజీ,కొర్లపాటి గోపి, గూడాల ఫణి, రవణం రాము, నాగాబత్తుల సుబ్బారావు, మట్టపర్తి సాంబశివరావు, సుంకర పేరయ్య నాయుడు, పత్తి దత్తుడు, అడబాల సుబ్బరాజు,మట్టపర్తి సోమేశ్వరరావు,న్యాయవాది నందెపు వెంకటేశ్వరరావు, కొప్పినీడి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**రహదారుల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి..**

మాచవరం పంచాయతీ పరిధిలోని కోటివారి అగ్రహారం, కామయ్య కోడు వాటర్ ట్యాంక్ నుండి నందెపువారిపాలెంలోకి వెళ్లే రహదారుల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఆ ప్రాంతాలవాసులు కోరారు. పోతాయిలంకలో కోకో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తున్న ఎమ్మెల్యేను కోరారు. కోటివారి అగ్రహారం రహదారి నిర్మాణానికి సంబంధించి నిధులు విషయంలో ఇబ్బంది లేదని, రహదారికిరువైపులా ఆక్రమణలను తొలగించి రహదారి నిర్మాణం చేపట్టాలనే పిటిషన్ హైకోర్టు పరిధిలో ఉందని, హైకోర్టు నుండి లిఖితపూర్వకహామీ లభిస్తే తక్షణమే రహదారి నిర్మాణం చేపడతామన్నారు. అలాగే కామయ్య కోడు రక్షిత మంచినీటి పథకం చెరువుకు వెళ్లే రహదారిని నిర్మించేందుకు సరిగా తీసుకుంటామని ఎమ్మెల్యే గిడ్డి హామీ ఇచ్చారు.

# రేపు జరగబోయే సార్వత్రిక సమ్మెకు ఏపీ.అర్.సి.ఎస్ మద్దతు - కర్నాకుల



**జగ్గంపేట, జులై 08 , ( ప్రభాతవార్త ) :** కేంద్రంలో మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన లేబర్ చట్టాలను నిరసిస్తూ దేశవ్యాప్త కార్మిక సంఘాలు ఇచ్చిన సార్వత్రిక సమ్మెకు ఏపీ అర్ సి ఎస్ మద్దతు తెలుపుతుందని ఈ సమ్మెను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు-కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు పిలుపునిచ్చారు. జగ్గంపేట మండలం రంగవల్లి నగర్లో రైతు కూలీలతో సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పదేళ్ల కాలంలో కార్మిక వ్యతిరేక విధానాలను అనుసరించాడని కార్పొరేట్ అనుకూల విధానాలను తీసుకొచ్చాడని తెలిపారు. బహుళ జాతి సంస్థలకు ఊడిగం చేసే మోడీ విధానాలను ప్రతీ కార్మికుడు వ్యతిరేకించాలని పేర్కొన్నారు. అనేక త్యాగాలతో సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానాన్ని మోడీ,చంద్రబాబు కూటమి ప్రభుత్వాలు 10 గంటలకు మార్చాయని ఇది కార్మికుల శ్రమను కార్పొరేట్కు దోచిపెట్టడమేనని ఎద్దేవా చేశారు. కార్మిక సంక్షేమాన్ని విస్మరిస్తే ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. వెంటనే పని గంటల పెంపును ఉపసమరించుకోవాలని నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్పోరేట్ కంపెనీల ప్రయోనాల కోసమే ఆపరేషన్ కగార్ చేపట్టారని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన విమర్శించారు. తక్షణమే కగార్ నిలిపి వేసి మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలని ఆయన డిమాండ్ చేశారు. జూలై 9 వ తేది రేపు జరిగే దేశవ్యాప్త కార్మిక సమ్మెను అన్ని వర్గాల ప్రజలు జయప్రదం చేయాలని రైతులు,రైతు కూలీలు సమ్మెలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు-కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రమేష్,ఏ ఐ ఎఫ్ టీ యు జిల్లా అధ్యక్షుడు కుంచే అంజిబాబు,పిడిఎస్ యు రాష్ట్ర కార్యదర్శి కడితి సతీష్, నాయకులు కె.రామలింగేశ్వరావు,డాన్ శ్రీను,అర్జున్, తదితరులు పాల్గొన్నారు

# తాండవపల్లి లో సుపరిపాలనలో తొలి అడుగు



**కోనసీమ బ్యూరో, జులై 08 , ( ప్రభాతవార్త ) :** సుపరిపాలనలో తొలిఅడుగు ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా అమలాపురం మండలం, తాండవపల్లి గ్రామంలో ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, ఆముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, రైతు అధ్యక్షులు మట్టా మహాలక్ష్మి ప్రభాకర్, రాష్ట్ర ఎస్.సి సెల్ ఉపాధ్యక్షులు పొలమూరి ధర్మపాల్, అమలాపురం మండల టిడిపి అధ్యక్షులు చొల్లంగి సాయిబాబు, దేవరపల్లి వీరేష్ కుమార్, మాజీ జడ్పీటీసీ అధికారి జయవెంకటలక్ష్మి బాబ్జీ, గ్రామ కమిటీ నంద్యాల దొరబాబు, ఏరుబండి వెంకటేశ్వరరావు , పెచ్చెట్టి విజయలక్ష్మి, పార్లమెంటు అధికార ప్రతినిధి కైరాం రాము, పరమట శరత్ బాబు, నడింపల్లి ఉదయబాబు, మాడా మాధవి, గుత్తుల సాయిబాబు, కైరాం సత్తిబాబు, రంకిరెడ్డి శ్రీను, పొలమూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# సొసైటీ చైర్మన్ లుగా వియ్యంకులు అల్లాడ, మెట్ల





**కోనసీమ బ్యూరో, జులై 08 , ( ప్రభాతవార్త ) :** కొమరగిరిపట్నం సొసైటీలకు చైర్మన్ లుగా వియ్యంకులు బాధ్యతలు చేపట్టనున్నారు. అమలాపురం కళా వెంకట రావు సొసైటీ అధ్యక్షులు గా అల్లాడ శరత్ బాబు, కొమరగిరిపట్నం మెట్ల రామూర్తి సొసైటీ అధ్యక్షులు గా మెట్ల రమణబాబు లును నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

# మొక్కలు నాటే కార్యక్రమం మరియు రైతులకు విత్తనాలు పంపిణీ చేసిన : ఎమ్మెల్యే సత్య ప్రభ



**ప్రత్తిపాడు, జులై 08 , ( ప్రభాతవార్త ) :** పండ్ల తోటలు సాగు చేసే చిన్న,సన్న కారు రైతులకు ప్రభుత్వం ప్రోత్సా హం అందిస్తుందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ అన్నారు. మండలంలోని మండలం రాచపల్లి గ్రామంలో ఉపాధిహామీ పథకం లో రైతులకు పండ్ల తోటలు, పూల తోటలు పెంపకంపై రైతులకు అవగాహన కల్పించారు. అధికారులు, కూటమి నాయకులు రైతులతో కలిసి మొక్కలు నాటే కార్యక్రమంలో ఎమ్మెల్యే సత్యప్రభ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజక వర్గంలో ఉద్యాన వన తోటలు, పండ్ల,పూల తోటలు పెంపకంతో సన్న, చిన్న కారు రైతులు వృద్ధి సాధించడం జరుగుతుంది అన్నారు. ఈ పథకం ద్వారా సన్నకారు, చిన్నకారు రైతులకు కొబ్బరి, మామిడి, జీడి మామిడి, నిమ్మ , నారింజ,సపోటా, పామాయిల్, గులాబీ, మల్లె తోటలు పెంచుకోవచ్చు అని ఎమ్మెల్యే తెలిపారు. ఏడాది కి ఎకరాకు 40 వేలు రూపాయలు చొప్పున మూడు సంవత్సరాలు పాటు రైతుకి ప్రభుత్వం నిర్వహణ ఖర్చులు ఇస్తుంది తెలిపారు. పొలాల్లో కోతుల బెడద అధికంగా ఉందని ఎమ్మెల్యే దృష్టికి రైతులు తీసుకొని వచ్చారు. త్వరలోనే అటవి సిబ్బంది తో మాట్లాడి ఆ సమస్య పరిష్కరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వత్సవాయి సూర్యనారాయణ రాజు (మీసాల రాజు) టిడిపి జిల్లా వైస్ ప్రెసిడెంట్ కొమ్ముల కన్నబాబు, అన్నవరం దేవస్థానం ట్రస్ట్ బోర్డు మాజీ మెంబర్ బుద్ధరాజు గోపిరాజు, నియోజవర్గ జనసేన సమన్వయకర్త మేడిశెట్టి సూర్యకిరణ (బాబీ) మార్కెట్ కమిటీ చైర్మన్ బద్ది మణి రామారావు, బిజెపి నియోజకవర్గ కన్వీనర్ సింగిలి దేవి సత్తిరాజు, సత్యం శెట్టి సీతబాబు, ఎంపీడీవో ఎం వి ఆర్ కుమార్ బాబు, ఏపీవో కుమార్ స్వామి, గ్రామపంచాయతీ కార్యదర్శి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని యు జె పురం గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం గట్లపై అంతర పంటగా మినుములు, కందులు, రాగులు వేసుకోవడం ద్వారా రైతులకు మేలు జరుగుతుందని ఎమ్మెల్యే సత్య ప్రభ అన్నారు. ఖరీఫ్ సీజన్ లో మెట్ట ప్రాంతాలలో విత్తుకోవడానికి వరి పంట గట్లపై అంతర పంట గా వేసుకోవడానికి కంది విత్తనాలు పంపిణీ చేయడం జరిగింది. సబ్సిడీపై వరి విత్తనాలు ఎమ్మెల్యే రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో జగ్గంపేట డివిజన్ ఏడిఏ శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి జోక అమృత, ఏఈఓ ఆర్ వీర అర్జున్ , వివిఏ మణికంఠ, అమరాది వెంకట్రావు, పల్లా గోపి, వట్టి కోళ్ల కృష్ణ, గొర్లి నాగేశ్వరరావు, ఎద్దు కృష్ణ, వాకపల్లి సర్పంచ్ రొ0గాల నాగేశ్వరరావు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# రాష్ట్రంలో చంద్రబాబుతోనే అభివృద్ధి - ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



**కిర్లంపూడి, జులై 08 , ( ప్రభాతవార్త ) :** మండలంలోని వేలంక గ్రామంలో కిర్లంపూడి మండల తెలుగు యువత అధ్యక్షులు గండే కాశి విశ్వనాథ్ ఆధ్వర్యంలో జరిగిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమానికి జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సుపరిపాలన లో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొని గ్రామంలోని ఇంటింటికి వెళ్లి ప్రజలకు ఏడాది సుపరిపాలన తొలి అడుగు కరపత్రాలను పంపిణీ చేస్తూ రాష్ట్రంలోనూ,నియోజకవర్గంలోనూ జరిగిన అభివృద్ధిని వివరిన్తూ ప్రజలతో మాట్లాడారు. అందుతున్న సంక్షేమం,జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ అభివృద్ధి,సంక్షేమం సమపాళ్లలో ముందుకు తీసుకెళ్లే సత్తా ఒక్క చంద్రబాబుకే సాధ్యమని ఎమ్మెల్యే నెహ్రూ అన్నారు. జగ్గంపేట నియోజవర్గలో విద్య,వైద్యం, ఉపాధి,నీటి ప్రాజెక్టులపై ప్రత్యేక ప్రణాళిక రూపొందించడం జరిగిందని,వాటిని ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారంతో నియోజవర్గం అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు చదరం చంటిబాబు,నాయకులు కుర్ల చినబాబు,తూము కుమార్,కాళ్ల వెంకటేష్,బొదిరెడ్ల సుబ్బారావు,బొడ్డేటి సుమన్, సర్పంచ్ రాయుడు బాబురావు,వేలంక గ్రామ అధ్యక్షుడు ఇంటి చెల్లబాబు,బేతాళ బాబ్జి,గండే రామలక్ష్మణమూర్తి, గండే వివి సత్యనారాయణ,గండే రాయుడు,ఎరికిరెడ్డి బాబ్జి,ఎరికిరెడ్డి రాజబాబు,ఎరికిరెడ్డి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# రెడ్ క్రాస్ వృద్ధాశ్రమంలో ఘనంగా వైయస్సార్ జయంతి వేడుకలు

**కాకినాడ రూరల్, జులై 08 , ( ప్రభాతవార్త ) :** కాకినాడ రూరల్ మండలం వాకలపూడి సంతోష్ నగర్ లో రెడ్ క్రాస్ వృద్ధుల ఆశ్రమం లో మాజీ ముఖ్యమంత్రి, మహానేత వైయస్ రాజశేఖర్ రెడ్డి 76వ జయంతి వేడుకలు వైసీపీ రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి రామశర్మ దంపతుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వృద్ధులకు అల్పాహారము మధ్యాహ్నం భోజనం స్వయంగా వడ్డించారు. వైకాపా మహిళ నేత నాగమణి మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా నిరుపేదలకు కార్పొరేట్ హాస్పిటల్లో ఉచితంగా వైద్య సేవలు అందించడమే కాకుండా పేద విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ ప్రవేశపెట్టి భరోసా ఇచ్చారని అన్నారు. మడమ తిప్పని నాయకుడు రాజశేఖర్ రెడ్డి కి తగ్గ తనయుడుగా మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి పరిపాలన చేశారని గుర్తు చేశారు. అనంతరం వైసిపి నాయకులు అనుసూరి ప్రభాకర్ రావు, తిమ్మాపురం సర్పంచ్ బెజవాడ వీర వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ అపర భగీరథుడు వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు పురస్కరించుకుని జమ్మలమడక నాగమణి రామశర్మ దంపతులు వృద్ధులకు అల్పాహారం భోజనం అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కోప్పిశెట్టి శివ, గుత్తుల సూర్యప్రకాశరావు, నందిపాటి ఆదినారాయణ, కుసుమ రెడ్డి ,సిద్దా శివాజీ, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

# వైసిపి ప్రత్తిపాడు నియోజకవర్గ నేత మురళి రాజు ఆధ్వర్యంలో ధర్మవరంలో వైయస్సార్ జయంతి వేడుకలు



**ప్రత్తిపాడు, జులై 08 , ( ప్రభాతవార్త ) :** నిమిషాల వ్యవధిలో 108 వాహనం వస్తుందంటే అది ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి ఘనతే అని ప్రతిపాడు నియోజకవర్గ వైసిపి నేత, నరసాపురం పార్లమెంట్ పరిశీలకులు ముదునూరి మురళి కృష్ణం రాజు అన్నారు. ధర్మవరం గ్రామంలో మంగళవారం వైయస్సార్ 76వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వైయస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి వైసీపీ శ్రేణులు, పేదలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మురళి రాజు మాట్లాడుతూ వైయస్సార్ ఒక వైద్యుడిగా తన ప్రయాణాన్ని ప్రారంభించారు. క్రింది స్థాయి నుండి అంచలంచెలుగా ఎదిగిన మహానేత అన్నారు. రెండుసార్లు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఎన్నికయ్యారు. స్వయంగా ప్రజాబలం కలిగిన నాయకుడు వైఎస్సార్ అన్నారు. అనంతరం ఆస్పత్రిలో పేషెంట్లకు ఫ్రూట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముదునూరి సీతారామరాజు , వైస్ సర్పంచ్ బొల్లు సీతారామరాజు, నానిపల్లి చంటి, వైసీపీ మండల ఉపాధ్యక్షులు కిల్లాడి బాబ్జి,మాజీ వైస్ సర్పంచ్ జువ్వల సత్యనారాయణ, మాజీ ఎంపిటిసి కోలా తాతబాబు, బొల్లు నాగేశ్వరావు,మాజీ సొసైటీ అధ్యక్షులు బొల్లు రాజబాబు,మచర్ల దాసు, మాచర్ల రాజు, కోన బాబ్జి,జువ్వల దొరబాబు,పోకనాటి వెంకటేశ్వరరావు,పోకనాటి శేషయ్య,వదొడ్డిపట్ల కృష్ణ , గుమ్మిడి రామకృష్ణ , వార్డు మెంబర్లు కుప్పిన శ్రీను , గదుల శివ, గోనగాని రామకృష్ణ, రాయుడు దొరబాబు, నానిపల్లి రమణ, కెసరపు శ్రీను, నల్ల వెంకటేష్ , దాడి శీను,దాడి పుత్రయ్య,సిద్ధ అప్పలరాజు ,దొడ్డిపట్ల శివ ,జువ్వల ముసలయ్య,రాపా అప్పన్న, కుప్పిన నరసింహమూర్తి , మద్రి సుబ్బారావు ,తుపాటి బాబ్జి ,కోలా సూరిబాబు ,గుత్తుల వీరరాఘవ,అనుసూరి రాంబాబు, వైఎస్ఆర్సిపి నాయకులు,మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు


# వకుళమాత అన్నదాన భవనం నిర్మాణానికి విరాళం



**ఆత్రేయపురం, జులై 08 , ( ప్రభాతవార్త ) :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వెంకటేశ్వరస్వామి వారి ఆలయానికి మంగళవారం వేలాది భక్తులు వచ్చి స్వామివార్ని దర్శించుకున్నారు. ఉదయం మేల్కొలుపు, ఐశ్వర్య లక్ష్మి హెూమం, గోపూజ అష్టోత్తర శతనామావళి నిత్య కళ్యాణం బాలభోగం నివేదన పవళింపు సేవ తదితర కార్యక్రమాలు అర్చకులు కనుల పండువగా నిర్వహించారు శ్రీ స్వామివారి దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు ఆలయ సన్నిధిలో నూతనంగా నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవనం నిర్మాణానికి హైదరాబాద్ దుండిగల్ చెందిన ఏలూరి ఎస్ ఎస్ దివాకర్ సరళాదేవి దంపతులు మరియు వారి కుటుంబ సభ్యులు రూ. 1,0,5001 లక్ష విరాళంగా అందించారు. వీరికి ఆలయ అర్చక బృందం వేదమంత్రాలతో వేద ఆశీర్వచనం అందించగా ఆలయ డిప్యూటీ కమిషనర్ . కార్యనిర్వాహణాధికారి నల్లం సూర్య చక్రధరరావు, వై శ్రీను , శ్రీ స్వామి వారి చిత్రపటం తీర్థప్రసాదాలు అందజేశారు

# శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరికి సారే, చీర సమర్పించిన ఆర్యవైశ్య మహిళలు





**కోనసీమ బ్యూరో, జులై 08 , ( ప్రభాతవార్త ) :** అమలాపురం మెయిన్ రోడ్ లో వేంచేసి ఉన్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారిని ఆషాడమాసం సందర్భంగా మంగళవారం శాకాంబరి అలంకారంలో అలంకరించారు. అమ్మవారితోపాటు ఆలయ ముఖ మండపాన్ని వివిధ రకాల కూరగాయలతో అలంకరించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య మహిళలు స్థానిక గాంధీ సెంటర్ నుండి బయలుదేరి చీర సారే తో మెయిన్ రోడ్డు మీదుగా అమ్మవారి ఆలయానికి చేరుకొని అమ్మవారికి సారె సమర్పించారు. ఈ కార్యక్రమంలో వందలాది మహిళలు పాల్గొనగా శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి వైశ్య సంఘం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అనంతరం రాత్రి జరిగిన అన్న సమారాధన కార్యక్రమంలో వందలాదిమంది పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాలలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి సంఘం అధ్యక్షుడు నంబూరి సత్యనారాయణమూర్తి కార్యదర్శి నంబూరు నరేష్, కోశాధికారి కొమ్మూరి వేంకటాచల ప్రసాద్, ఉత్సవ కమిటీ చైర్మన్ అప్పన్న వీరన్న, కో చైర్మన్లు పచ్చిగోళ్ళ సోమరాజు, నూలు శ్రీనివాస్, ముఖ్య సలహాదారు వరదా సూరిబాబు, తదితరులు వారి వారి సేవలను అందించారు.

# వాడ వాడలా వైయస్సార్ 76వ జయంతి వేడుకలు

**రౌతులపూడి, జులై 08 , ( ప్రభాతవార్త ) :** మండలంలో వాడవాడలా వైయస్సార్ 76వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. బలరాంపురంలో మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీయువజన సంఘ అధ్యక్షుడు సోమరౌతు రాజా,అచ్చింత సాంబ, దాసరి కృష్ణ,ఏఐ ఎం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కొంకిపూడి రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రాహుల్ గాంధీ పుట్టినరోజు వేడుకలు

**రావులపాలెం, జులై 08 , ( ప్రభాతవార్త ) :** కాంగ్రెస్ పార్టీ ఎంపీ రాహుల్ గాంధీ 54 పుట్టినరోజు వేడుకలు రావులపాలెంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం అయ్యప్ప స్వామి ఆలయంలో రాహుల్ గాంధీ పేరున ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు కొత్తపేట కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ రౌతు ఈశ్వరరావు తెలిపారు,అనంతరం కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మధ్యాహ్నం ప్రత్యేక ప్రతిభావంతుల హాస్టల్ వద్ద విద్యార్థులకు ఫ్రూట్స్ బిస్కెట్స్ డ్రింక్స్ భోజనం సదుపాయం కల్పించి వారి సమక్షంలో రాహుల్ గాంధీ పుట్టిన రోజు వేడుకలను నిర్వహించినట్లు రౌతు ఈశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంధి శేషగిరిరావు, ఊడిమూడి తమ్మి రాజు,కానుమౌని నాగేశ్వరరావు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408.
RNI No.64863/96,“Editor : *Damerla Sai Baba, *Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps

# ఆధునిక ఫ్యాషన్‌లు అలంకార సోయగాలు



తరాలు మారిన కొద్దీ ఫ్యాషన్లు కూడా మారుతు న్నాయి, కొన్ని సందర్భాల్లో వెర్రి పోకడలు కూడా సంతరించ ుకుంటున్నాయి. ప్రతి ఒక్కరు తమ ఫ్యాషన్ భావాలను వ్యక్తీకరించడానికి ఒక ప్రత్యేక మార్గాన్ని ఎంచుకుంటారు. ఒక్కొక్కరి వస్త్రధారణ ఒక్కో విధంగా ఉంటుంది. కులాలు, మతాలు, జాతులు, దేశాలు, ప్రాంతాలను బట్టి ఫ్యాషన్స్ మారుతుంటాయి. ఒక్కో జాతికి ఒక రకమైన విలక్షణ వస్త్రధారణ పద్ధతులు ఉంటాయి. ఫ్యాషన్ ప్రపంచం, పరిశ్రమ చాలా పెద్దది. ఫ్యాషన్ టెక్నాలజీ క్షణక్షణం మారుతోంది. . ప్రపంచ మానవాళి దృష్టిని తమ ఫ్యాషన్ల వైపుకు మరల్చుడానికి, ప్రత్యేక సౌందర్య భావాలను వ్యక్తం చేయడానికి, వారి వారి విభిన్న దుస్తులు లేదా ఉపకరణాలను ప్రదర్శించడానికి ఒక వేదికగా ప్రతి ఏటా జూలై 9న "అంతర్జాతీయ ఫ్యాషన్ దినోత్సవం (ఇంటర్నేషనల్ ఫ్యాషన్ డే)" పాటించడం 2016 నుంచి ఆనవాయితీగా మారింది.

**ఫ్యాషన్ ప్రపంచం చాలా పెద్దది:** ఫ్యాషన్ రంగం చాలా పెద్దది. నేడు ప్రపంచ ఫ్యాషన్ పరిశ్రమ/మార్కెట్ దాదాపు 1.84 ట్రిలియన్ డాలర్ల వ్యాపారంగా మారింది. ప్రపంచ మానవ జనాభా 8 బిలియన్లకు సాలీనా దాదాపు 100 బిలియన్ల వరకు దుస్తులు ఉత్పత్తి అవుతున్నాయి. ప్రతి ఒక్కరికి సగటున ఒక ఏడాదికి 12 14 దుస్తులు కొనుగోలు చేస్తున్నారు. వస్త్ర ఉత్పత్తిలో అతి పెద్ద దేశంగా చైనా తొలి స్థానాన్ని ఆక్రమించింది. ఫ్యాషన్ పరిశ్రమ ద్వారా సృజన, ఆవిష్కరణ, సంస్కృతి, వేషధారణ, పలు రకాలు దుస్తులు, కేశాలంకరణ, అలంకరణ, ఆభరణాలు లాంటి పలు అంశాలు ఉంటాయి. ఫ్యాషన్ ప్రపంచంలో వ్యక్తులు, డిజైనర్లు, క్రియేటర్స్, మోడల్స్, స్టైలిస్ట్స్, ఇన్నోవేటర్స్, ట్రెండ్స్, ఇన్ఫ్లుయెన్సర్స్ ద్వారా పలు రకాల ఫ్యాషన్స్ పుట్టుకొస్తున్నాయి, మార్కెట్‌ను ముంచేస్తున్నాయి. నిన్నటి ఫ్యాషన్ నేడు పాతబడిపోయి, నేటి ఫ్యాషన్స్ కోకొల్లలుగా పుట్టుకొస్తున్నాయి. **ఫ్యాషన్ అంటే దుస్తులు మాత్రమే కాదని, ఇది ఒక హద్దులు లేని వింత ప్రపంచమని అర్థం అవుతున్నది. ఫ్యాషన్ రంగం అంటేనే సృజనశీలత, ఆవిష్కరణ, సంస్కృతికి వైవిధ్యం, ప్రత్యేక గుర్తింపు లాంటి అంశాలకు పుట్టిల్లు. సామాజిక మార్పులు, కళలకు అపూర్వ వేదికగా అంతర్జాతీయ ఫ్యాషన్ దినం ఉపయోగపడుతున్నది.**


**ఫ్యాషన్ టెక్నాలజీ ఫ్యాషన్ డిజైనర్స్:** ఫ్యాషన్ డిజైన్ అంటే దుస్తులు, కొన్ని వస్తువులను అందంగా, వినూత్నంగా తీర్చి దిద్దే కళ అని తెలుసుకోవాలి. దీనిలో అవలంభించే పద్ధతుల సమాహారాన్ని ఫ్యాషన్ టెక్నాలజీ అని పిలుస్తాం. మానవ అభిరుచులను బట్టి దుస్తులు, అలంకార వస్తువులను తయారు చేసే నిపుణులను ఫ్యాషన్ డిజైనర్స్ అంటాం. దుస్తులు, ఉపకరణాల రూపకల్పన, ఉత్పత్తిలో సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించడాన్ని ఫ్యాషన్ టెక్నాలజీగా పిలుస్తున్నాం. ఫ్యాషన్ టెక్నాలజీలో ఫ్యాషన్ డిజైన్స్, వస్త్ర సాంకేతికత, ఫ్యాషన్ ఉత్పత్తులు, ఫ్యాషన్ మార్కెట్, రిటైల్ లాంటి పలు రంగాలు ఉంటాయి. నేటి డిజిటల్ యుగంలో కంప్యూటర్‌సహాయ ఉత్పత్తి/డిజైన్స్, 3డి ప్రింటింగ్, ఆగ్మెంటెడ్ రియాలిటీ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ లాంటి పరిజ్ఞానాలు వాడబడుతున్నాయి. ఇవి ఫ్యాషన్ ప్రపంచ పరిశ్రమను మరింత సమర్థవంతంగా, సుస్థిరంగా, వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా, ఆకర్షణీయంగా మార్చడంలో సహాయపడుతున్నది.



**అంతర్జాతీయ ఫ్యాషన్ దినోత్సవ వేడుకలు:** ఆధునిక పౌర సమాజ అభిరుచులకు అద్దం పడుతున్నది నేటి ఫ్యాషన్ పరిశ్రమ. మారుతున్న కాలంతో పాటు ఫ్యాషన్లు కూడా అత్యంత వేగంగా మారుతున్నాయి. అంతర్జాతీయ ఫ్యాషన్ దినం వేదికగా ప్రదర్శనలు, పోటీలు, సామాజిక మాధ్యమ అవగాహనలు, నూతన బ్రాండ్ల ప్రదర్శనలు, డిస్కౌంట్స్, స్థానిక బ్రాండ్ల ప్రోత్సాహం, కొత్త బ్రాండ్ల ప్రారంభం, ఫ్యాషన్ టెక్నాలజీ సృజనకారుల గుర్తింపు లాంటి కార్యక్రమాలను నిర్వహించ వచ్చు. మానవ జాతి పుట్టుక నుంచి నేటి వరకు ఫ్యాషన్ రంగం కొత్తపుంతలు తొక్కుతూనే ఉన్నది. ఇదో వింత, విచిత్ర ప్రపంచం. పౌర సమాజంతో విడదీయరాని సంబంధం కలిగిన ఫ్యాషన్ ప్రపంచం నిన్నటి, నేటి, రేపటి తరాలకు తగిన విధంగా తమ ఉత్పత్తులను విడుదల చేస్తూనే ఉన్నాయి. ఫ్యాషన్ టెక్నాలజీ పెరగడంశుభ సూచకమే అయినప్పటికీ ఫ్యాషన్లు వెర్రితలలు వేయకూడదు, మన సాంస్కృతిక మూలాలను మరిచి పోకూడదు. మన ప్రాంత వాతావరణాన్ని, అవసరాలను, సందర్భాలను బట్టి మన వేషధారణ ఉండాలి. ఫ్యాషన్ పేరుతో అసహ్యకర రూపును పొందరాదని గమనించాలి.

- డా: బుర్ర మధుసూదన్ రెడ్డి

# కోబ్రాను పట్టిన సాహస వనిత



ఎదురుగా ఓ చిన్న పాము కనిపిస్తే చాలు.. ముచ్చెమటలు పడతాయి. వెంటనే పరుగు లంకించుకుంటాం. అలాంటిది కింగ్ కోబ్రా, కొండ చిలువ.. వంటి ప్రమాదకర పాములైతే..? ఇక చెప్పే పనే లేదు. పై ప్రాణాలు పైనే పోతాయి? కానీ రోషిణి ఇలా భయపడదు. పరిగెత్తదు. వాటిని పట్టుకిని సురక్షిత ప్రాంతాల్లో వదలేస్తుంటుంది. అలా ఒకటి కాదు, రెండు కాదు.. ఇప్పటివరకు కొన్ని వందల పాముల్ని కాపాడిందామె. వృత్తిరీత్యా అటవీ అధికారిణి అయిన రోషిణి.. ఇటీవలే ఓ కింగ్ కోబ్రాను పట్టుకొని వార్తల్లో నిలిచింది. ఈ సాహస వనిత గూర్చి తెలుసుకుందాం..

**మూగజీవాలపై ప్రేమతో..!** రోషిణిది కేరళలోని తిరువనంతపురం.ఆమె చిన్నతనం నుంచే ధైర్యశాలి. మూగజీవాలు, వాటి సంరక్షణ కోసం ఏదో ఒకటి చేయాలి పరితపించేది. ఈ ఆసక్తే ఆమెను 2017లో అటవీ శాఖాలో చేరేలా చేసింది. 'బిట్ ఫారెస్ట్ ఆఫీసర్‌గా విధుల్లో చేరిన.. 2019లో ఆ రాష్ట్ర ప్రభుత్వ శాఖ నిర్వహించిన శిక్షణలో ఆమె హాజరైంది. ఇందులో భాగంగా పాముల్ని సురక్షి తంగా ఎలా పట్టుకోవాలో మెలకువలు నేర్చుకుంది. ప్రస్తుతం పరుథిపల్లి అటవీ చెందిన 'ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్'లో సభ్యురాలిగా పనిచేస్తోంది రోషిణి. ఇలా ఈ ఆరేళ్లలో సుమారు 800లకు పైగా విషపూరితమైన, విషపూరితం కాని పాముల్ని పట్టుకొని.. సురక్షిత ప్రాంతాల్లో వదిలేసిందామె. జనావాసాల్లో వన్యప్రాణులు సంచరించినప్పుడు ప్రజలకు, వారి పంటలకు హాని కలిగే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా ఆటవీ ప్రాంతాలకు సమీపంలో నివసించే వారికి ఈ ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. దీనికి పరిష్కారంగా కేరళ రాష్ట్ర శాఖ ప్రజల భద్రత కోసం ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాన్ని ఏర్పాటు చేసింది. ఈ బృందం జనావాసాల్లోకి వచ్చిన వన్యప్రాణులను సురక్షితంగా పట్టుకోవడమే కాకుండా, వాటిని తిరిగి అడవిలో విడిచిపెడుతుంది.

**'కొండ చిలువ'తో సాహసం!** ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్ సభ్యురాలిగా జనావాస ప్రాంతాలను సంచరించే వన్యప్రాణులను సంరక్షించడం ఆమె బాధ్యత. ఆమె ఎక్కువగా పాముల్ని పట్టిందట. ఇలా ఆమె పట్టుకున్న తొలి పాము కొండ చిలువ, కల్లర్ అనే ప్రాంతంలో దీన్ని పట్టుకొని అక్కడికి దగ్గర్లోని ఆటవీ ప్రాంతంలో వదిలేసిందామె. ఇప్పటి వరకు ఆమె పట్టుకున్న పాముల్లో కింగ్ కోబ్రా, నల్లత్రాచు, కొండ చిలువ.. వంటి ప్రమాదకర మైన




ఎక్కువట! అటవీ శాఖలో చేరినప్ప ట్నుంచి పాముల్ని పట్టు కోవడం, ఇతర మూగజీవాల సంరక్షణే నా జీవనశైలిగా మారిపోయింది. జానా ఆసాల్లో సంచరించే పాముల్ని పసిగట్ట పట్ట ఓవడమంటే పెద్ద సవాలే! ఈ క్రమంలో శరీరం పైనా ఒత్తిడి పడుతుంది. ముఖ్యంగా కొండ చిలువ వంటి భారీ పాముల్నిఒడిసిపట్టినప్పుడు చేతులు, భుజాల్లో విపరీతమైననొప్పి వేధిస్తుంటుంది. అంతేకాదు దీని పట్టకు వెంటనే ఇది మూత్ర, మల విసర్జన చేస్తుంది. ఆ దుర్వాసనకు అక్కడ ఒక్క క్షణమైనా నిలబడలేం. ఎంత శుభ్రం చేసుకున్నా, ఎన్నిసార్లు స్నానం చేసినా ఆ దుర్గంధం వదలదు నేనైతే అన్నం తినకుండా ఉన్న సందర్భాలెన్నో ఉన్నాయి. అంటోన్న రోషిణి తన వృత్తిలో భాగంగా ముళ్లపందులు, జింకలు వంటి ఇతర మూగజీవాల్నీ పట్టుకొని సురక్షిత ప్రాంతానికి చేర్చింది. ఆ పద్ధతి పాటిస్తా ! పాముల్ని పట్టుకోవడమంటే అంత ఆషామాషీ విషయం కాదు. ఓవైపు తనను తాను కాపాడుకుంటూనే మరోవైపే ఆ ప్రాణికి ఎలాంటి హాని కలగకుండా జాగ్రత్తలు తీసువాల్సి ఉంటుంది. ఇందు కోసం తాను 'బ్యాగ్ అండ్ పైప్' అనే పద్ధతిని పాటి స్తానంటోంది రోషిణి. పామువల్ల నాకు, నా వల్ల పాముకు ఎలాంటి హాని జరగకుండా చూసుకుంటూ ఈ క్రమంలో వాటి తోకను అందుకొని బ్యాగ్ లేదా పైపులోకి పాకేలా చేసి వాటిని మూసేస్తా. పాము ఎముకలు సున్నితంగా ఉంటాయి.నఅందుకే వాటిని తోకనదగ్గర పట్టుకుంటా.. అంటోన్న ఈ ఫారెస్ట్ ఆఫీసర్. ఆ ప్రక్రియలో తన అనుభవాలన్నిటినీ ఓ డైరీలో నోట్ చేసుకోవడంతో పాటు వాటి వీడియో లను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ దేశవ్యాప్తంగా పాపులారిటీ సంపాదించుకుంటోంది. ఆమె ధైర్యానికి అటు నెటిజన్లు,ఇటు ప్రముఖులు ప్రశంసిస్తున్నారు. □

# ఇరుగూ పొరుగూ చూసుకోవాలి..



**మనం ఎప్పుడైనా ఇల్లుమారాలనుకున్నప్పుడు ఇరుగూ పొరుగూ చేసుకోవాలని పెద్దవాళ్లు చెబుతుంటారు కదా!** అందుకు కారణమేదైనా..తాజాగా బోస్టన్‌మెడికల్ సెంటర్ చేసిన పరిశోధనలు మాత్రం ఆ మాటలకు మరింత బలాన్ని చేకూరుస్తున్నాయి. మన చుట్టూ ఉండే వాతావరణం పిల్లలు తెలివితేటలపై ప్రభావం చూపిస్తుందట. అందులోనూ చదువుకున్నవాళ్లు మన పక్కింట్లో ఉంటే.. పిల్లల్లో భాషా నైపుణ్యాలతోపాటు కాగ్నిటివ్ సామర్థ్యాలూ ఎరుగుతాయట. ఆ మార్పు వారిలో శిశువుగా ఉన్నప్పటినుంచి మొదలవుతుందట. అందుకోసం పరిశోధకులు బోస్టన్, లాస్ ఏంజెలెస్ ప్రాంతాల్లోని 65 మంది శిశువులపై ప్రయోగం చేశారట. ఇందుకు రకరకాల వాతా వరణాల్లో పెరిగే 6 నుంచి 12 నెలల పిల్లల్ని ఎంచుకున్నారు ఎలక్ట్రోఎన్ సెఫలోగ్రఫీ (ఈఈజి) ద్వారా వారి మెదడు పనితీరును క్షుణ్ణంగా పరిక్షించారట. పిల్లల్లో కాగ్నిటివ్ డెవలప్‌మెంట్‌ను ముల్లెన్ స్కేల్స్ ఆఫ్ ఎర్లీ లెర్నింగ్ (ఎమ్ఎస్ఇఎల్) విధానంలో .. అంటే రకరకాల ఆటల ద్వారా, అంచనా వేశారు. చుట్టూ చదువుకున్న వ్యక్తులు ఉంటే, ఆ పిల్లల్లో మెదడు పనితీరు మెరుగ్గా ఉన్నట్లు పరిశోధకులు గుర్తించారు. ఎందుకంటే వాళ్ల నుంచి చిన్నారులు నేర్చుకునే అవకాశం ఎక్కువగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. అందుకే మనం నివసించే ప్రదేశాన్ని ఒకటికి రెండు సార్లు ఆలోచించుకుని ఎంచుకోవాలి. □

# పిల్లలు ఎత్తు పెరగడం లేదా?



తమ పిల్లలు ఎత్తుగా ఉండాలి.. ఎత్తుకు తగ్గ బరువుండాలి. అని తల్లిదండ్రులు కోరుకోవడం సహజం. అయితే కొంతమంది చిన్నారుల్లో పెరుగుదల మందకొడిగా సాగడం, ఒక వయసొచ్చాక ఆగిపోవడం వల్ల సరైన ఎత్తు పెరగక పొట్టిగా కనిపిస్తుంటారు. తల్లిదండ్రుల జీన్స్ ఒక్కటే దీనికి కారణం అనుకుంటే పొరపాటే! ఎందుకంటే పోషకాహార లోపం, శరీరానికి సరైన వ్యాయామం లేకపోవడం, వారుండే వాతావరణం. వంటివీ చిన్నారుల ఎత్తుపై ప్రతికూల ప్రభావం చూపుతాయంటున్నారు నిపుణులు. ఈ క్రమంలోనే పిల్లలు ఎత్తు పెరగడానికి కొన్ని వ్యాయామాలు దోహదం చేస్తాయంటున్నారు. మరి, ఏంటా వర్కవుట్లు? మనమూ తెలుసుకుందాం..



**స్ట్రెచింగ్ వ్యాయామాలు ...** స్ట్రెచింగ్ వ్యాయామాలు చేయడానికి సులభంగా ఉండడంతో పాటు, పిల్లలు ఎత్తు పెరగడానికి ఎంతో ప్రభావవంతంగా పని చేస్తాయంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో నిటారుగా నిల్చొని కిందికి వంగుతూ కాలి వేళ్లను అందుకోవడం, కాళ్ల ముందుకు చాపి కూర్చొని చేతి వేళ్లతో కాళ్లను అందుకోవడం, శరీర పైభాగాన్ని ఇరువైపులా వంచుతూ చేసే వ్యాయామాలు.. ఇలాంటి వర్కవుట్లు వెన్నెముకకు ఫ్లెక్సిబులిటీని అందిస్తాయి. అది సులభంగా సాగేలా చేస్తాయి. ఫలితంగా వయసు పెరిగే కొద్దీ ఎత్తు పెరగడం సులువవుతుంది.

**వేలాడితే మంచిదే!...** పిల్లల ఎత్తు పెరగడానికి చాలామంది నిపుణులు సూచించే వ్యాయామాలివి. బార్ హ్యాంగింగ్స్, హ్యాంగింగ్ రాడ్, పులప్స్, చిన్-అప్స్.. వంటి ఎక్సర్‌సైజెస్ వెన్నెముకను సులభంగా సాగేలా చేస్తాయి. తద్వారా వయసు పెరిగే కొద్దీ ఎత్తు పెరగచ్చు. అలాగే ఈ వ్యాయామాలు వెన్ను, భుజాల కండరాలకు దృఢత్వాన్ని అందించి ఫిట్‌గా మార్చుతాయి.

**యోగాసనాలతో...** కొన్ని రకాల యోగాసనాలు శారీరక దృఢత్వాన్ని పెంచడమే కాదు.. పిల్లలు ఎత్తు పెరగడానికీ దోహదం చేస్తాయంటున్నారు నిపుణులు. సూర్య నమస్కారాలు చేయడం వల్ల శరీరమంతటికీ చక్కటి వ్యాయామం అందుతుంది. అలాగే భుజాలు, వీపు, కాళ్లలోని కండరాలను బలంగా మార్చి సులభంగా సాగేలా చేస్తుంది. ఇక చక్రాసనం వల్లభుజాలు, పాదాలపై ఒత్తిడి పడుతుంది. తద్వారా అక్కడి కండరాలు దృఢమవడంతోపాటు సాగుతాయి. ఫలితంగా ఎత్తు పెరిగే ప్రక్రియ వేగవంతమవుతుంది.

**స్కిప్పింగ్-స్విమ్మింగ్...** స్కిప్పింగ్ ఆడడమంటే ఆడపిల్లలకు భలే సరదా. ఎంతో సరదాగా చేసే ఈ వ్యాయామం వారి శరీరానికి దృఢత్వాన్ని అందించడమే కాదు.. గుండె ఆరోగ్యాన్ని సైతం మెరుగుపరుస్తుంది. అలాగే ఈ వర్కవుట్‌లో భాగంగా ఎగిరి దూకే క్రమంలో వెన్నెముక, భుజాలు, కాళ్లలోని కండరాలు ఫ్లెక్సిబుల్‌గా మారతాయి. సులభంగా సాగేలా తయారవుతాయి. ఫలితంగా వయసు పెరిగే కొద్దీ ఎత్తు పెరగడం ఈజీ అవుతుంది. ఇక ఈత కొట్టే క్రమంలో కూడా శరీరాన్ని ముందుకు సాగదీస్తాం. తద్వారా వెన్నెముకకు చక్కటి వ్యాయామం అందుతుంది. ఇది కూడా ఎత్తు పెరిగేందుకు సహాయపడుతుంది.

**ఇవి కూడా!..**
- మన శరీరంలో హెచ్‌జిహెచ్ అనే పెరుగుదల ప్రేరేపించే హార్మోన్ ఉంటుంది. ఇది పిల్లల్లో నిద్రపోయినప్పుడు మాత్రమే విడుదలవుతుందట! అందుకే చిన్నారులు ఎంత చక్కగా నిద్రపోతే అంతగా పెరుగుతారంటారు.
- విటమిన్ 'డి' సైతం చిన్నారులు ఎత్తు పెరిగేందుకు పేరేపిస్తుందంటున్నారు నిపుణులు. ఇది కండరాలు, ఎముకల సామర్థ్యం పెరిగేలా చేసి.. పరోక్షంగా ఎత్తు పెరగడానికి సహకరిస్తుంది. ఇందు కోసం రోజూ కాసేపు ఎండలో నిలబడడం.. చేపలు పుట్టగొడగులు, గుడ గుడ్లు.. వంటి విటమిన్ 'డి' అధికంగా ఉండే ఆహార పదార్థాలు వారి డైట్‌లో భాగం చేడం మంచిది.
- పిల్లలకు అందించే ఆహారంలో ప్రొటీన్లు, కార్బోహైడ్రేట్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు, విటమిన్లు.. ఇలా అనినన పోషకాలు ఉండేలా చూసుకోవాలి. ఇందుకోసం సీజనల్ పండ్లు అన్ని రకాల కాయకూరలు దుంపలు ఆకుకూరలు వంటివన్నీ వీరి ఆహారంలో చేర్చాలి. □

# జుట్టుకు అవిసె గింజలు..

అధిక బరువును తగ్గించుకోవ డానికి అవిసె గింజల్ని ఆహారంలో భాగం చేసుకుంటారు చాలా మంది. ఇందులోని ఒమేగా ఫ్యాటీ ఆమ్లాలు, అత్యధిక ఫైబర్లు శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. అంతే కాదు.. ఈ ఒమేగా ఫ్యాటీ ఆమ్లాలు చర్మం, కుదుళ్ల ఆరోగ్యానికి మేలు చేసే కొలాజెన్ ఉత్పత్తికీ తోడ్పడతాయి. ఈ క్రమంలో జుట్టు, కుదుళ్ల ఆరోగ్యానికి మేలు చేసే ఈ అవిసె గింజల హెయిర్‌ప్యాక్ ట్రై చేయండి..

**కావాల్సినవి :** అవిసె గింజలు : ఒక కప్పు, నీళ్లు: ఆరు కప్పులు, కొబ్బరి నూనె: ఐదు టీస్పూన్‌లు.

**తయారీ :** ఒక కప్పు అవిసె గింజలకి ఆరు కప్పుల నీరు చేర్చి బాగా మరిగించాలి. నీళ్ల సగానికి రాగానే స్టౌ మీద నుంచి దించి చల్లారనివ్వాలి. చల్లారినప్పుడు ఆ నీరు జెల్‌లా మారడం గమనించవచ్చు. ఇప్పుడు ఒక పల్చటి శుభ్రమైన క్లాత్ తీసుకొని, జెల్ నుంచి అవిసె గింజలను వడగట్టాలి. ఇలా వడగట్టిన జెల్‌కి ఐదు టీస్పూన్‌ల కొబ్బరినూనెను చేర్చాలి.



**ఎలావాడాలి:** హెయిర్ ప్యాక్ వేసుకునే ముందు జుట్టు శుభ్రంగా, పొడిగా ఉండాలి. జుట్టుని సన్నని పాయలుగా విడదీస్తూ హెయిర్ ప్యాక్ కోసం తయారు చేసుకున్న జెల్‌ని కుదుళ్ల నుంచి వెంట్రుకల చివర్ల వరకు పట్టించాలి. నెమ్మదిగాముని వేళ్లతో ఒక పది నిమిషాల పాటు కుదుళ్లను మసాజ్ చేసి, గంటపాటు ఆరనివ్వాలి. ఆ తర్వాత గాఢత తక్కువగా ఉండే షాంపూతో జుట్టుని శుభ్రం చేసుకోవాలి. ఈ హెయిర్ ప్యాక్ జుట్టు పెరగ డానికి తోడనపడటమే కాకుండా హెయిర్ కండిషన్‌గానూ ఉపయోగపడుతుంది. □

# అనర్సా మిఠాయి

ఝార్ఖండ్ రాష్ట్ర ప్రత్యేక మిఠాయి అనర్సా. ఇది చేయడానికి ఏమేం కావాలంటే.. బియ్యం కప్పున్నర, గోధుమపిండి అర కప్పు, బెల్లం పొడి కప్పు, పావు కప్పు పాల, 3 చెంచాల వెన్న, చెంచా గసగసాలు, పావు కప్పు నువ్వులు, పావు చెంచా యాలకుల పొడి, వేయించడానికి సరిపడా నూనె అవసరమవుతాయి. తయారీ చాలా సులువే..నువ్వులు, గసగసాలను కలిపి ఒక పళ్లెంలో పోయాలి. బియ్యం ముందు రోజు రాత్రి నానబెట్టి,ఉదయం ఆ నీళ్ల తీసేసి.. గ్రైండ్ చేయాలి. ఆ బియ్యప్పిండిని ఒక పాత్రలోని తీసుకుని.. గోధుమపిండి, నెయ్యి, యాలకుల పొడి, బెల్లంపొడి, పాలు, వెన్న జతచేసి బాగా కలపాలి. ఈ పిండిని నిమ్మకాయంత భాగాలుగా తీసుకుని, అరచేతులతో బూరెల్లా చేసి.. నువ్వులు,గసగసాల్లో ముంచి తీసి..కాగుతున్న నూనెలో వేయించాలి. బంగారు రంగులోకి మారగానే టిష్యూ పేపర్ మీదకి తీస్తే సరి. ఘుమఘుమలాడే అనర్సా రెడీ. ఈ తియ్యటి స్వీటు ఎంతో శక్తి కూడా. □



# జలదాన మహిమ !

ఒకసారి యమధర్మరాజు దానధర్మాలు చేసి పేరు తెచ్చుకున్న భగీరధుడని కలిసాడు. మీరు దాన ధర్మములు చేయడంలో అపరభగీరధుడుగా ఇంత మంచిపేరు తెచ్చుకున్నందుకు సంతోషం. ఈ దానఫలం గురించి ఏమైనా నాకు కూడా కాస్త తెలియజేస్తారా! అడిగాడు సంతోషం. ఈ దానఫలం గరించి ఏమైనా నాకు కూడా కాస్త తెలియజేస్తారా! అడిగాడు సందేహంగా, అందుకు భగీరదుడు వినయపూర్వకంగా నమస్కరించి. 'యమధర్మరాజా! మీకు తెలియని ధర్మం వుందా! దానం అంటే ధనం, ధాన్యరాశులు దానం చేయడం మాత్రమే కాదు. జలదానం కూడా గొప్పది. జలం పవిత్రమైనది జలం దానం చేయడం కూడా పుణ్యప్రదం అని చెప్పాలి. సకల జనులకు జీవనాధారం. ఈ జలమే. పూర్వకాలంలో చెరువులు, తటాకాలు తవ్వించడం ద్వారా వేసవి దాహం తీర్చిన వారు కావడం వలన సమస్త పాపాలు నశించి అనంతపుణ్య ఫలం పొందగలరు. అని యమలోకాధిపతికి భగీరదుడుకి ఈ విషయం తెలియ జేసాడు. జలదానంలో అంతటి ఫలం ఉన్నదా! అని ఆశ్చర్యం వ్యక్తం చేసాడు యమధర్మరాజు. అవును ధర్మరాజా! మండువేసవిలో చల్లటి నీరు ఇచ్చి దాహం తీర్చిన వారికి కూడా ఈ పుణ్య ఫలం విశేషంగా దక్కుతుంది. అంటూ వివరించాడు భగీరధుడు. అయితే మేముకూడా ఈ విషయంపై పరిశీలించి జలదాన మహిమతో కూడిన పాపపుణ్యములు పరిగణనలోకి తీసుకోగలము. అని యముడు తన లోకానికి తిరిగి వెళ్లి పోయాడు. అందుకే మనం జలమును వృథా చేయరాదు. జలమును సద్వినియోగం చేసుకోవాలి. జలమును గౌరవించాలి. సకల ప్రాణ కోటికి జలమే జీవనాధారం. అని అందరూ గ్రహించాలి.



-ఎల్.ప్రఫుల్ల చంద్ర

ఆధ్యాత్మికం

# ఇది దివ్య ఔషధం

నీరసం, నిస్సత్తువ, తలనొప్పి, వికారం, వేడిచేయడం, అరికాళ్ల మంటలు..ఇలా ఎన్నిటికో దివ్య ఔషధం కొబ్బరిబొండం. ఇందులో ఏమేం సుగుణాలున్నాయో చూద్దాం..

కొబ్బరి నీళ్లలో ప్రొటీన్లు, పీచు, చక్కెర, కాల్షియం, పొటాషియం, మెగ్నీసియం, సోడియం, భాస్వరం ఉన్నందున శరీరానికి అవసరమైన పోషకాలు అందుతాయి. కొబ్బరి నీళ్ల తాగడం వల్ల వెంటనే శక్తి వస్తుంది. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. మూత్రపిండాల్లో ఇన్ఫెక్షన్లను నివారిస్తాయి. రాళ్ల ఏర్పడే అవకాశం తగ్గుతుంది. కొబ్బరి నీళ్లలో ఉండే ఖనిజాలు, యాంటాక్సిడెంట్లు శరీరాన్నిన ఆరోగ్యంగా ఉంచుతాయి. కండరాల పనితీరు మెరుగవుతుంది.



ఎముకలు, దంతాలు పటిష్టంగా ఉంటాయి. జీర్ణప్రక్రియ సజావుగా ఉంటుంది. డీ హైడ్రేషన్ సమస్య తలెత్తదు. చర్మం పొడిబారదు, నేవళంగా ఉంటుంది. ఊబకాయం రాదు. కొలెస్ట్రాల్ నియంత్రణలో ఉంటుంది. రక్తంలో చక్కెర స్థాయి క్రమబద్ధంగా ఉంటుంది. రక్తపోటు అదుపులో ఉంటుంది. గుండె జబ్బులు వచ్చే అవకాశం తగ్గుతుంది. అన్నిటినీ మించి ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. తియ్యటి కొబ్బరినీళ్లని ఎక్కువమంది అలాగే తాగుతారు. భిన్నమైన రుచి కావాలనుకునేవాళ్లు.. పండ్లరసాలు లేదా నిమ్మరసం కలిపి తాగొచ్చు. □

# ఆగస్టులో 'టిఎన్ఐటి మీడియా అవార్డ్స్'




ది న్యూఇండియన్ టైమ్స్ విజువల్ మీడియా రంగంలో తనదైన ముద్ర వేసుకుంది. నేతృత్వంలో సీఈఓ రఘు భట్ ప్రతీసంవత్సరం టిఎన్ఐటి మీడియా అవార్డ్స్‌ను అత్యంత ఘనంగా నిర్వహిస్తూ వస్తున్నారు. మీడియా పట్ల ఉన్న ప్యాషన్‌తో మొదలైన ఈ అవార్డ్స్ వేడుక... ఇప్పుడు సక్సెస్ ఫుల్‌గా 8వ సంవత్సరంలోకి అడుగుపెడుతోంది. ఈ ఏడాది టిఎన్ఐటి మీడియా అవార్డ్స్ ఈవెంట్‌ని ఆగస్టు 23న బెంగళూరులోని ప్యాలెస్ గ్రౌండ్స్‌లో గ్రాండ్‌గా నిర్వహిస్తున్నాం. ఈ సందర్భంగా నిర్వాహకులు ప్రెస్ మీట్ నిర్వహించారు. ప్రెస్ మీట్‌లో సిఈవో రఘు బట్ మాట్లాడుతూ, శుభలేఖ సుధాకర్‌కి, ఉత్తేజ్, మా తెలుగు జ్యూరీ ప్రభుకి హృదయపూర్వక ధన్యవాదాలు. ఈ అవార్డులను ప్రారంభించి ఇది ఎనిమిదవ సంవత్సరం. మలయాళం, తెలుగు, కన్నడ, తమిళ భాషల నుండి నామినేషన్లను స్వీకరిస్తున్నాం. ప్రతి మీడియా ఛానల్ మా టీంకు అప్లికేషన్లు సమర్పించమని కోరుతున్నాం. ఈ గొప్ప కార్యక్రమానికి మీ అందరి సహకారం కోరుతున్నాం. అందరికీ ధన్యవాదాలుఅన్నారు. మార్కెటింగ్ హెడ్ ఖుషీ మాట్లాడుతూ, రఘు విజన్‌తో సౌత్ ఇండియా మొత్తానికి అవార్డులు ఇవ్వాలని నిర్ణయించాం. ప్రతి ఛానల్‌కు నామినేషన్ ఫారంలు పంపిస్తాం. వారు పూర్తి చేసి మాకు తిరిగిపంపాలి. తర్వాత జ్యూరీపరిశీలించి విజేతలను ఎంపిక చేస్తుంది. నటీనటులకు ఐఫా, సైమా లాంటి అవార్డ్స్ ఉన్నట్లే, మీడియాకి కూడా అంతే స్థాయిలో గుర్తింపు రావాలని మేము ఆశిస్తున్నాం. మీడియా రాత్రిపగలు కష్టపడుతూ సమాజానికి సమాచారం అందిస్తున్నారు. వారిని గుర్తించి గౌరవించడం గౌరవంగా భావిస్తున్నాం. ఈ ప్రయత్నానికి మీ అందరి మద్దతు కావాలి అన్నారు. జర్నలిస్ట్ ప్రభు మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. ఒకప్పుడు మీడియా అంటే కేవలం ప్రింట్‌మీడియానే. ఇప్పుడు టీవీ, వెబ్, యూట్యూబ్ ఇలా అనేక ప్లాట్‌ఫారాలుగా విస్తరించింది. మీడియాలో ప్రతి విభాగానికి ప్రత్యేకంగా అవార్డులు ఇవ్వాలన్న ఆలోచన చాలా ప్రత్యేకమైనది. గత ఏడు సంవత్సరాలుగా విజయవంతంగా ఈ అవార్డ్స్ నిర్వహిస్తూ, ఈఏడాది నాలుగు రాష్ట్రాలని సమన్వయం చేస్తూ గ్రాండ్ ఈవెంట్ నిర్వహించడం గొప్ప విషయం.

# 'పోలీస్ వారి హెచ్చరిక' ట్రైలర్ లాంచ్

అభ్యుదయ దర్శకుడు బాబ్జీ దర్శకత్వంలో బెల్లి జనార్ధన్ నిర్మాతగా తూలికా తనిష్క్ క్రియేషన్స్ పతాకంలో రూపొందిన "పోలీస్ వారి హెచ్చరిక" ట్రైలర్‌ను ప్రముఖ సినీ పెద్దల సమక్షంలో లాంచ్ చేయడం జరిగింది. ఈ చిత్రానికి కిషన్ సాగర్, నళినీ కాంత్ సినిమాటోగ్రాఫర్స్‌గా పనిచేయగా గజ్వేల్ వేణు ఈ చిత్రానికి సంగీతాన్ని అందించారు. శివ శర్వాణి ఈ చిత్రానికి ఎడిటింగ్ వర్క్ చేశారు. ఈ సందర్భంగా కేఎల్ దామోదర్ ప్రసాద్ మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. మనమంతా ఇక్కడికి వచ్చామంటే కారణం బాబ్జి మీద ఉన్న గౌరవం. చిత్ర బృందం అందరికీ ఆల్ ద బెస్ట్.




అలాగే ఆర్మీ నుండి వచ్చిన నిర్మాత జనార్ధన్‌తో కలిసి క్రమశిక్షణతో ఈ సినిమాను చేసి ఉంటారు అనుకుంటున్నాను. ఈ సినిమా మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను అన్నారు. నటి ఇంద్రజ మాట్లాడుతూ, ఈ కార్యక్రమానికి వచ్చిన అందరికీ నమస్కారం. నేను ఈ ఈవెంట్‌కు బాబ్జి కోసం ఈ కార్యక్రమానికి వచ్చాను. నా ప్రతి పుట్టిన రోజుకు నన్ను విష్ చేసే సుధాకర్‌కి ధన్యవాదాలు. జనార్ధన్ గారికి ఈ సినిమాతో మంచి విజయం రావాలి అని కోరుకుంటున్నాను. సినిమా విజయం సాధించేందుకు మీడియా వారు అండగా నిలబడాలని కోరుకుంటున్నాను అన్నారు. నటుడు శుభలేఖ సుధాకర్ మాట్లాడుతూ, ఈ ట్రైలర్ లాంచ్ కార్యక్రమానికి వచ్చిన ప్రతి ఒక్కరికి నా నమస్కారం. సాధారణంగా చిన్ననాటి నుండి మనల్ని పెద్దవారు ఏదో ఒక విషయంలో హెచ్చరిస్తూ ఉంటారు. ఈ సినిమాకు అందరి ఆశీస్సులు ఉండాలి. సినిమా మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను అన్నారు. దర్శకుడు సముద్ర మాట్లాడుతూ, ఈ సినిమాకు ప్రేక్షకుల నుండి ఒక ఆదరణ లభిస్తుందని కోరుకుంటున్నాను. సినిమాలో చాలా మంచి ఆర్టిస్టులు నటించారు. మంచి కథతో త్వరలో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు బాబ్జి. జులై 18వ తేదీన ప్రేక్షకులుముందుకు రానుంది.




# 31న 'కింగ్‌డమ్' విడుదల

తెలుగులో రూపొందుతోన్న భారీ చిత్రాల్లో కింగ్‌డమ్ ఒకటి. విజయ్ దేవరకొండ, సత్యదేవ్, భాగ్యశ్రీ బోర్సే ప్రధాన పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. కింగ్‌డమ్‌పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. ఇప్పటికే విడుదలైన టీజర్, హృదయం లోపల గీతం విశేషంగా ఆకట్టుకున్నాయి. కింగ్‌డమ్ విడుదల కోసం విజయ్ అభిమానులతో పాటు, సినీ ప్రియులంతా ఎంతగానో ఎదురుచూస్తున్నారు. తాజాగా చిత్ర విడుదల తేదీని ప్రకటించారు నిర్మాతలు. కింగ్‌డమ్ చిత్రం జూలై 31, 2025న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుందని చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఈ సందర్భంగా ఒక ప్రోమోను విడుదల చేసింది. ఈ ప్రోమో సినిమాపై అంచనాలను రెట్టింపు చేసేలా ఉంది. యాక్షన్, హీరోయిజం, డ్రామాల సమ్మేళనంగా శక్తివంతమైన చిత్రంగా కింగ్‌డమ్ రూపుదిద్దుకుంటోంది. ప్రోమోలో యుద్ధ సన్నివేశాలు, భావోద్వేగాలు, విజువల్స్ కట్టిపడేశాయి. మునుపెన్నడూ లేని విధంగా అద్భుతమైన సినిమాటిక్ దృశ్యాన్ని ప్రేక్షకులకు అందించబోతున్నట్లు ఈ ప్రోమో హామీ ఇస్తోంది. ఈ అద్భుతమైన చిత్రాన్ని వెండితెరపై చూడటానికి ఆసక్తిగా ఎదురుచూస్తున్న అభిమానులకు కొత్త విడుదల తేదీ ప్రకటన ఎంతో ఉపశమనాన్ని, ఉత్సాహాన్ని ఇచ్చిందని చెప్పవచ్చు. అభిమానుల అంచనాలకు మించేచిత్రాన్ని అందించాలనే ఏకైక లక్ష్యంతో కింగ్‌డమ్ కోసం చిత్ర బృందం అదనపు సమయాన్ని కేటాయిస్తోంది. కొత్త విడుదల తేదీ ప్రకటన సందర్భంగా నిర్మాతలు స్పందిస్తూ, కింగ్‌డమ్ కేవలం సినిమా కాదు.. ఇది మేము ఎంతో మక్కువతో నిర్మించిన ఒక గొప్ప ప్రపంచం. ప్రతి ఫ్రేమ్ మరపురానిదిగా ఉండాలని మేము కోరుకున్నాము. జూలై 31న ఈ చిత్రం బాక్సాఫీస్ తుఫానుకు నాంది పలుకుతుంది అన్నారు. కింగ్‌డమ్ రిలీజ్ డేట్ ప్రోమో ఇప్పటికే సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అద్భుతమైన విజువల్స్, సంగీతంతో రూపొందిన ఈ ప్రోమో అభిమానుల ప్రశంసలు అందుకుంటోంది. ప్రతిభగల దర్శకుడు గౌతమ్ తిన్ననూరి కింగ్‌డమ్ కోసం అద్భుతమైన కథను ఎంచుకున్నారు. ఆ అద్భుతమైన కథను, అంతే అద్భుతంగా తెరపైకి తీసుకొచ్చి ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందించడానికి సిద్ధమవుతున్నారు. కింగ్‌డమ్ చిత్రానికి ప్రతిభగల సాంకేతిక బృందం పని చేస్తోంది. సంగీత సంచలనం అనిరుధ్ రవిచందర్ సంగీతం సమకూరుస్తున్నారు. జోమోన్ టి. జాన్ మరియు గిరీష్ గంగాధరన్ ఛాయాగ్రహణం అత్యున్నత స్థాయిలో ఉండనుంది. జాతీయ అవార్డు గ్రహీత నవీన్ నూలి ఈ చిత్ర ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. జూలై 31న ప్రపంచవ్యాప్తంగా భారీస్థాయిలో విడుదల కానుంది.



# కెజెఆర్, శ్రీదేవి హీరో హీరోయిన్లుగా 'కోర్ట్'

తెలుగు, తమిళ భాషల్లో 'గుర్తింపు' పేరుతో స్పోర్ట్స్ కోర్ట్ డ్రామాతో హీరోగా పరిచయమవుతోన్న కేజేఆర్ హీరోగా రెండో చిత్రం శ్రీకారం చుట్టుకుంది. చెన్నైలో ఈ చిత్రం పూజా కార్యక్రమాలు జరిగాయి. ఇటీవల మార్క్ ఆంటోనీ చిత్రాన్ని నిర్మించిన మినీ స్టూడియో సంస్థ ప్రొడక్షన్ నెం.15గా ఈ చిత్రాన్ని రూపొందిస్తోంది. తెలుగులో ఈ చిత్రాన్ని గంగా ఎంటర్ టైన్మెంట్స్ అందించనుంది. ప్రముఖ దర్శకుడు ప్రశాంత్ పాండ్య రాజన్ శిష్యుడైన రెగన్ స్టానిస్లాస్ ఈ చిత్రం ద్వారా దర్శకునిగా పరిచయం అవుతున్నారు. చిత్రీకరణ త్వరలోనే మొదలుకానుంది. కోర్ట్ చిత్రంతో మంచి పేరు తెచ్చుకున్న శ్రీదేవి ఇందులో హీరోయిన్‌గా నటించనున్నారు. అర్జున్ అశోకన్, సింగం పులి,




జయప్రకాష్, హరీష్ కుమార్, పృధ్వి రాజ్, ఇందుమతి, అశ్విని. కె.కుమార్, అభిషేక్ జోసెఫ్ జార్జ్, అజువర్గీస్, శ్రీకాంత్ మురళి తదితరులు ఈ చిత్ర ప్రధాన తారాగణం. ఈ చిత్రానికి సంగీతం: జిబ్రాన్, ఛాయాగ్రహణం: పి.వి.శంకర్, నిర్మాత: ఎస్.వినోద్ కుమార్.

# 'కాంతార: చాప్టర్ 1' పోస్టర్ రిలీజ్

2022లో విడుదలైన కాంతార సినిమా ఇండియన్ సినిమా పరంగా సరికొత్త దిశగా అడుగు వేసింది. సంవత్సరంలోనే అతిపెద్ద స్లీపర్ హిట్‌గా నిలిచిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టించింది. పాన్‌ఇండియా లెవెల్లో భారీగా విజయం సాధించి, కొత్త బంచ్‌మార్క్స్ క్రియేట్ చేసింది. కేజీఎఫ్, సలార్, కాంతార లాంటి బ్లాక్‌బస్టర్స్ ఇచ్చిన హోంబలే ఫిలింస్‌కి ఇది ఇంకో గొప్ప మైలురాయి అయ్యింది. ఇప్పుడు అదే సినిమాకి ప్రీక్వెల్‌గా రాబోతున్న కాంతార: చాప్టర్1 పై భారీ అంచనాలు నెలకొన్నాయి. రిషబ్ శెట్టి ఎప్పుడూ చూడని థ్రిల్లింగ్ అవతార్‌లో ఉన్న పోస్టర్ ఇప్పటికే ప్రేక్షకులలో సంచలనం సృష్టించింది. ఇప్పుడు, రిషబ్ పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ కొత్త పోస్టర్‌ను విడుదల చేసి, షూటింగ్ పూర్తయినట్లు అనౌన్స్ చేశారు. లక్షలాది మందిని అలరించిన మాస్టర్ పీస్ కాంతార: చాప్టర్ 1 ప్రీక్వెల్ షూటింగ్ పూర్తి చేసుకుంది. కొత్తగా విడుదలైన పోస్టర్ ఉత్సాహాన్ని మరింత పెంచింది. రిషబ్ శెట్టి, అతని అభిమానులకు ఇది పర్ఫెక్ట్ బర్త్ డే గిఫ్ట్. కాంతార: చాప్టర్ 1 లక్షలాది మందిని అలరించిన లెజెండ్ మూలాలకు ఆడియన్స్‌ని తీసుకెళుతుంది. కొత్త పోస్టర్‌ను మేకర్స్ సోషల్‌నే షేర్ చేస్తూ.. కాంతారా లక్షలాది మందిని కదిలించిన మాస్టర్ పీస్ కి ప్రీక్వెల్. లెజెండ్ వెనుక ఉన్న ట్రైల్‌బ్లేజింగ్ ఎనర్జీ రిషబ్ శెట్టికి పుట్టినరోజు శుభాకాంక్షలు. డివైన్ సినిమాటిక్ విజువల్ వండర్ మోస్ట్ అవైటెడ్ ప్రీక్వెల్... కాంతార చాప్టర్ 1 అక్టోబర్ 2, 2025న ప్రపంచ వ్యాప్తంగా రిలీజ్ .. అని పోస్ట్ చేశారు. మేకర్స్ విడుదలను అనౌన్స్ చేయడంతో సినిమా కొత్త పోస్టర్ కాంతారా: చాప్టర్1 చుట్టూ ఉన్న ఉత్సాహం మరింత పెరిగింది. హోంబాలే ఫిల్మ్స్ విజన్, రిషబ్ శెట్టి అంకితభావం, ఫస్ట్ చాప్టర్ లెగసీతో ఈ చిత్రం మరో సినిమాటిక్ మైలురాయిగా మారే దిశగా సాగుతోంది. 2022లో వచ్చిన ఈ మాస్టర్ పీస్ లెగసీని ముందుకు తీసుకెళ్లడంలో హోంబాలే ఫిల్మ్స్ ఎక్కాడ రాజీపడటం లేదు. కాంతారా చాప్టర్1 కోసం జాతీయ, అంతర్జాతీయ టెక్నిషియన్స్‌తో యుద్ధ సన్నివేశాన్ని రూపొందించారు. 500 మందికి పైగా ఫైటర్లు, 3000 మంది జూనియర్ ఆర్టిస్టులు, 25 ఎకరాల్లో ఓ టౌన్ సెట్ వేసి, దాదాపు 45 నుంచి 50 రోజుల పాటు షూటింగ్ చేశారు. ఇది ఇండియన్ సినిమా చరిత్రలోనే ఒక బిగ్గెస్ట్ సీన్‌గా ఉండబోతోంది.



# ఆగస్టులో 'మిస్టర్ సోల్జర్'

ఈ చిత్ర నిర్మాణము కొరకు ముఖ్యంగా సహాయ సహకారం అందించిన మిలిటరీ గ్రామా మాజీ సైనికోధ్యుల సంఘం, మరియు మిలిటరీ మాధవరం గ్రామ సర్పంచ్, ప్రజలకు మా యొక్క కృతజ్ఞతలు. మా ఈ శ్రీ ధరణి ఆర్ట్స్ సంస్థ తరుపున అభినందనలు తెలియచేస్తున్నాము. మిస్టర్ సోల్జర్ (ఫ్రమ్ మిలటరీ మాధవరం) సెన్సార్ పూర్తి చేసుకొని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఉభయ రాష్ట్రాలలో ఆగస్టు 2 వ వారంలో విడుదలకు సిద్దంగా ఉన్నందున మేము ఎంతో గర్వపడుచున్నాము. మిస్టర్ సోల్జర్ సినిమా కథా సారాన్ని క్లుప్తంగా మా ప్రేక్షకులకు వివరిస్తూ మీ ముందుకు మా సంస్థ వస్తున్నందుకు చాలా ఆనందిస్తున్నాము. భారత దేశం రాజధాని ఢిల్లీలో ఎంతో ఘనమైన చరిత్ర కలిగిన ఊరు ఈ మిలిటరీ మాధవరం గ్రామం. ఈ గ్రామం నుంచి మొదటి, రెండవ ప్రపంచ ముద్దంలో సుమారు 2,000 మంది సైనికులు పాల్గొని దేశానికి ఎంతో సేవలను అందించి, సుమారు పదుల సంఖ్యలో ఆశువులు బాసారు. దేశ స్వతంత్రం అనంతరము దేశ రక్షణలో బాగంగా సుమారు 5000 మంది సైనికులు ప్రస్తుతము ఇండియన్ ఆర్మీ రక్షణ రంగంలో చేరి సేవలు అందిస్తున్నారు. 1970 వ సంవత్సరంలో మేజర్ రాజు అనే నిజాయితీ గల ఆర్మీ ఆఫీసర్ ఎంతోమంది శత్రువులను తుదముటించి యుద్ధరంగంలో, ఎన్నో పతకాలు పొంది ఉన్నారు. అలాంటి మేజర్ రాజు నిరాధార ఆరోపణలు ఎదుర్కొని, అవమానాలను భరించి భారతమాత సాక్షిగా కుటుంబ సమేతంగా ఆత్మహత్య చేసుకున్నారు. కానీ యీ నాటికి మేజర్ రాజు మిలట్రీ మాధవరం గ్రామంలో యువత ప్రేరణ పొందుతూ ప్రతి ఇంటి నుండి పదుల సంఖ్యలో ఇండియన్ ఆర్మీకి పంపిస్తుందని ఆ గ్రామ ప్రజలకు నమ్మకం. ఒక వేళ ఆకస్మిక యుద్ధం వస్తే దేశ రక్షణకు ప్రతి గ్రామం నుండి పదుల సంఖ్యలో సైనికులు ఇండియన్ ఆర్మీ లో చేరవలసిన సమయం ఆసన్నమైనది... కథాసారాంశంతో జరిగిన యదార్ధ కథను ప్రేక్షకులకు అందిస్తున్నందుకు, శ్రీ ధరణి ఆర్ట్స్ సంస్థ తరుపున మాకు చాలా గర్వకారణంగా ఉంది. ఈ చిత్రాన్ని ప్రేక్షకులు వీక్షించి, ఆదరించి మా సంస్థ బృందాన్నీ ఆశీర్వదిస్తారని మనస్ఫూర్తిగా ఆశిస్తున్నాము.



# 'మారెమ్మ' ఫస్ట్ లుక్ సూపర్బ్

మాస్ మహారాజా రవితేజ బ్రదర్ యాక్టర్ రఘు కుమారుడు యంగ్ చాప్ మాధవ్ రూరల్ రస్టిక్ మూవీ మారెమ్మతో హీరోగా సినిమాల్లోకి అడుగుపెడుతున్నారు. ఈ హైఆక్టేన్ ప్రాజెక్ట్‌ను మంచాల నాగరాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. మోక్ష ఆర్ట్స్ బ్యానర్‌పై మయూర్ రెడ్డి బండారు తమ ప్రొడక్షన్ నంబర్ 1గా నిర్మిస్తున్నారు. మేకర్స్ ఈ చిత్రం ఇంపాక్ట్ ఫుల్ టైటిల్, అద్భుతమైన ఫస్ట్ లుక్ పోస్టర్ రెండింటినీ రిలీజ్ చేశారు. ఇది పవర్ ఫుల్ రూరల్ గ్రామీణ యాక్షన్ డ్రామాగా ఉంటుందని హామీ ఇస్తోంది. ఫస్ట్ లుక్ మాధవ్‌ను రూరల్ అవతార్‌లో పరిచయం చేస్తుంది.! చెక్డ్ షర్ట్, లుంగీ ధరించి, మెడలో క్యాజువల్‌గా చుట్టుకున్న టవల్‌తో, మాధవ్ రగ్గడ్ రూరల్ హీరోగా కనిపించారు. అతని చెదిరిన జుట్టు, గడ్డం ఆ పాత్రకు పర్ఫెక్ట్‌గా ఫిట్ అయ్యాయి. పోస్టర్ బ్యాక్ డ్రాప్ లో ఉంచబడిన ఒక గేదె, బలం, ఆధిపత్యాన్ని సూచిస్తుంది. మాధవ్ పొడవాటి కర్రను పట్టుకుని ఏదైనా సవాలును ఎదుర్కోవడానికి సిద్ధంగా వున్నట్లు కనిపించారు. పోస్టర్, టైటిల్ అదిరిపోయాయి. మాధవ్‌ను ఫెరోషియస్ రగ్గడ్ పాత్రలో ప్రజెంట్ చేయడానికి మంచాల నాగరాజ్ పవర్ ఫుల్ స్క్రిప్ట్‌ను రాశారు. మాధవ్ తన తొలి పాత్ర కోసం కంప్లీట్‌గా మేకోవర్ అయ్యారు. వినోద్ కుమార్, వికాస్ వశిష్ట, దయానంద్ రెడ్డి, వి.ఎస్.రూప లక్ష్మి ముఖ్యమైన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రంలో మాధవ్ సరసన దీపా బాలు కథానాయికగా నటిస్తోంది. ఈ చిత్రానికి ప్రశాంత్ అంకిరెడ్డి సినిమాటోగ్రఫీని నిర్వహిస్తుండగా, ప్రశాంత్ ఆర్ విహారి సంగీతం అందిస్తున్నారు. దేవ్ రాథోడ్ ఎడిటర్, రాజ్‌కుమార్ మురుగేశన్ ఆర్ట్ డైరెక్టర్. తారాగణం: మాధవ్, దీపా బాలు, వినోద్ కుమార్, వికాస్ వశిష్ట, దయానంద్ రెడ్డి. సాంకేతిక సిబ్బంది:



బ్యానర్: మోక్ష ఆర్ట్స్
రచన-దర్శకత్వం: మంచాల నాగరాజ్, నిర్మాత: మయూర్ రెడ్డి బండారు
ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఉమేష్ విలాసాగరం
క్రియేటివ్ ప్రొడ్యూసర్: కుశాల్ రెడ్డి కందాలా.

# పాన్ ఇండియా ఫిల్మ్ 'కిల్లర్'

దర్శకత్వానికి పది సంవత్సరాలు దూరంగా ఉన్న ఎస్‌జె సూర్య 'కిల్లర్' సినిమాతో తిరిగి కెప్టన్‌చైర్‌లో కూర్చోవడానికి సిద్ధంగా ఉన్నారు. ఈ ప్రతిష్ఠాత్మక చిత్రంలో ఎస్‌జె సూర్య హీరోగానే కాకుండా, కథ, స్క్రీన్‌ప్లే, డైలాగ్స్ కూడా తానే సమకూరుస్తున్నారు. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీ గోకులం మూవీస్ (గోకులం గోపాలన్ నేతృత్వంలో) ఎస్‌జె సూర్యా సొంత నిర్మాణ సంస్థ ఏంజెల్ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ చిత్రాన్ని వి.సి.ప్రవీణ్, బైజు గోపాలన్ కలిసి నిర్మిస్తున్నారు కృష్ణమూర్తి ఎగ్జిక్యూటివ్ నిర్మాత. అకాడమీ అవార్డ్ విన్నింగ్ మ్యూజిక్ డైరెక్టర్ ఏఆర్ రెహమాన్ ఈ సినిమాకి మ్యూజిక్ ఇవ్వబోతున్నాడు. ఆయన ప్రాజెక్ట్ రావడం చూస్తేనే సినిమాలో సంగీతానికి ఎంత ప్రాధాన్యత ఉందో అర్థం అవుతుంది. ఇది ఎస్.జె. సూర్యా-ఏఆర్ రెహమాన్ కాంబినేషన్‌లో ఐదో సినిమా. ఇంతకు ముందు నాని, న్యూస్, అన్బే ఆరుయిరే, పులి సినిమాల్లో కలిసి పనిచేశారు. కిల్లర్ సినిమాని భారీ స్థాయిలో ప్లాన్ చేస్తున్నారు. ఇండియా అంతటా ప్రేక్షకులతో కనెక్ట్ అవ్వాలనే లక్ష్యంతో ఐదు భాషల్లో రిలీజ్ చేయబోతున్నారు. మిగతా క్యాస్ట్, టెక్నికల్ టీమ్ వివరాలు మేకర్స్ త్వరలోనే తెలియ జేస్తారు.



# ఇబలపై దాడి చేస్తే ఊరుకోం

## రమాదేవిపై దాడిని ఖండించిన మంత్రి సురేఖ

**హైదరాబాద్,జులై 8, ప్రభాతవార్త:** ఎండోమెంట్ భూములను కబ్జా చేస్తే పీడీ యాక్టు పెడతామని మంత్రి సురేఖ పేర్కొన్నారు. భద్రాచలం రామా లయ భూములు పురుషోత్తపట్నం (ఏపీ)లో కబా జ్కి గురవుతుండగా అడ్డుకున్న ఇఒ రమాదేవిపై దాడి చేయడం సహేతుకంకాదని మంత్రి ఖండించారు. ఈ విషయంలో ఏపీ ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక చొరవ తీసుకొని సమస్యను పరిష్కారించాలని మంత్రి అభ్యర్థించారు. భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామికి పురుషోత్తపట్నంలో భూములున్న విషయం విదితమే. ఆ భూమిలో అనుమతి లేకుండా భవననిర్మాణ పనులు చేపడుతుం డ టంతో భద్రాచలం టెంపుల్ సిబ్బంది దాన్ని అడ్డుకునే క్రమంలో ఆ గ్రామస్థులతో తరచూ ఘర్షణ జరుగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలం గాణలో భద్రాద్రిరాముడికి సుమారు 1,300 ఎకరాల భూమి ఉండగా అందులో అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం పురు షోత్తపట్నంలోనే గరిష్ఠంగా 889.5 ఎకరాలు ఉంది. పురుషోత్తపట్నంలోని భూమి ఎక్కువ భాగం ఆక్రమణకు గురైంది.కోర్టు తీర్పు ప్రకారం ఈ భూమిపై దేవస్థానానికి హక్కులు లభిం చాయి. వీటిని పురుషోత్తపట్నంవాసులు పరిగణ నలోకి తీసుకోవటం లేదు. పురుషోత్త పట్నంలోకి ప్రవేశించే మార్గంలో పిల్లర్లతో నిర్మాణ పనులు చేపడుతున్నారనే సమాచారం అందుకున్న ఆలయ సిబ్బంది అక్కడికి చేరుకుని అనుమతి లేకుండా ఇళ్ల నిర్మాణం చేయవద్దని,ఇది పూర్తిగా రాముడి భూమిఅని వివరించారు.కోర్టు తీర్పులతో దేవుడి పేరిట పట్టాదారు పాసు పుస్తకాలు ఉన్నా యని వెల్లడించారు. అయితే, ఇఒ అభ్యంతరాలు వినకుండా స్థానికులు దాడి చేయడంతో ఆమె స్పృహ కోల్పోయిన పరిస్థితి నెలకొంది.

## ఎంపిడబ్ల్యూ వర్కర్ల వేతనం రూ.150 కోట్లు విడుదల

**హైదరాబాద్,జులై 8, ప్రభాతవార్త:** తెలంగాణ లోని గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న మల్టీపర్పస్ వర్కర్ల(ఎంపిడబ్ల్యూ)కు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త తెలిపింది. 3నెలల(ఏప్రిల్,మే,జూన్)గా ఎదురు చూస్తున్న జీతాలను విడుదల చేస్తూ రూ.150 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులను గ్రామ పంచాయతీల ఖాతాల్లో జమ చేయనుండటంతో, 53వేలమందికి పైగా ఊరట లభించనుంది. సకాలంలో జీతాలు అందక ఇబ్బందులు పడిన కార్మికులకు ఈ నిర్ణయం ఉపశమనం కలిగి స్తుంది. ఒందు లేదు మూడు రోజుల్లో వారి అకౌంట్లో మూడు నెలల జీతం జమ కానుంది.

## వైఎస్ఆర్ పేరు మీద అభ్యుదయ రైతు అవార్డులు

### ఆయన అంటే గుర్తుకు వచ్చేది వ్యవసాయం,ప్రాజెక్ట్‌లే: డిప్యూటీ సిఎం భట్టి



**హైదరాబాద్ (పంజగుట్ట), జూలై 8, ప్రభాతవార్త:** దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి గుర్తుగా అభ్యుదయ రైతులకు అవార్డులు ఇవ్వాలని ప్రభుత్వం ఆలోచన చేస్తుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. వైఎస్ఆర్ జయంతి సందర్భంగా పంజగుట్ట, బంజారాహిల్స్‌లో ఆయన విగ్రహానికి పూలమా లలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమం టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ వైఎస్ఆర్ పేరుమీద ఒక ఫౌండేషన్ ఏర్పాటు చేసి వచ్చే వర్షంలో ఒక కార్యక్ర మాన్ని రూపకల్పన చేసి వ్యవసాయరంగంలో నిష్ణాతులైనవారిని,వ్యవసాయంపై రీసెర్చ్ చేస్తున్న వారిని ఈ ప్రాంత అభివృద్ధికి వ్యవసాయరం గానికి దోహదపడుతున్న వారిని గుర్తించి వైఎస్ఆర్ పేరుమీద అవార్డులు ఇవ్వనున్నారని ఆయన తెలిపారు. వైఎస్ఆర్ అంటే గుర్తుకు వచ్చేది వ్యవసాయం ప్రాజెక్టులేనని ఆయన గుర్తు చేశారు. వైఎస్ఆర్ లేనిలోటు రెండు తెలుగు రాష్ట్రాలకు తీరని లోటని ఆయన వ్యాఖ్యానిం చారు. ఈ కార్యక్రమంలో పీసీసీ చీఫ్ మహేష్ కుమార్‌గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్, పాండి చ్చేరి మాజీ ముఖ్యమంత్రి నారాయణ స్వామి, మాజీ రాజ్యసభసభ్యులు కేవీపీ రామచంద్రరావు, మధుయాష్కీ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# జిఓ నెం.49ను రద్దు చేయాలి

## గవర్నర్‌ను కలిసిన సోయం బాపూరావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జులై8:** కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో టైగర్ కన్జర్వేషన్ పేరిట జారీచేసిన జీవో నెం.49 ఆదివాసీ హక్కులకు విఘాతం కలిగిస్తుందని, ఈ జీవో అమలు అయితే ఆదివాసీ గిరిజనుల మనుగడ ప్రశ్నార్థకంగా మారనుందని మాజీ ఎంపీ, ఆదివాసీ సంఘాల ఉద్యమ నేత సోయం బాపూరావు అన్నారు. మంగళవారం మధ్యాహ్నం తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను ఆదివాసీ సంఘాల నేతలు సోయంబాపూరావ్‌తో కలిసి ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం.49ను రద్దు చేయాలని వినతిపత్రాన్ని అందజేశారు. కొమురం భీం జిల్లాలోని ఆసిఫాబాద్, కాగజ్ నగర్ డివిజన్లను ఏకపక్షంగా టైగర్ కన్జర్వేషన్‌లో కలపడం వల్ల అటవీ భూములను నమ్ముకొని బతికే గిరిజనుల హక్కులకు భంగం వాటిల్లుతుందని సోయం బాపూరావు గవర్నర్ దృష్టికి తెచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం పోడు భూముల సమస్యలను సాను కూలంగా పరిష్కరించేందుకు ముందుకు వస్తున్న క్రమంలో జీవో నెం.49 జారీ చేయడం తగదని సూచించారు. ఇప్పటికే ఈ జిల్లాలో ఆ జీవోను రద్దు చేయాలని ఆందోళనలు చేస్తున్నారని, ఏకపక్షంగా జారీ చేసిన జీవో వల్ల ఈ జిల్లాలోని 339 ప్రభావిత గ్రామాల్లో గిరిజన, గిరిజనే తరులు ఆందోళన చెందుతున్నారన్నారు.

## లంచం తీసుకుంటూ పట్టుబడ్డ డిప్యూటీ టాక్స్ ఆఫీసర్

**గచ్చిబౌలి, జూలై 8, ప్రభాతవార్త:** రాష్ట్రంలో లంచావతారులపై ఏసీబీ క్రమం తప్పకుండా దాడులు కొనసాగిస్తూనే ఉంది. తాజాగా మం గళవారం నాంపల్లి గగన్ విహార్‌లో జరిగిన ఆపరే షన్‌లో మాదాపూర్ డిప్యూటీ స్టేట్ టాక్స్ ఆఫీసర్ సుధ లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఓ కంపెనీకి సంబంధించిన జీఎస్టీ రిజిస్ట్రేషన్ ప్రాసెస్ చేయ డంలో సహకరించాలంటే రూ.8,000 లంచం ఇవ్వాల్సిందిగా డిమాండ్ చేసినట్లు సమాచారం. బాధితుడు చేసిన ఫిర్యాదు ఆధారంగా ఏసీబీ అధికారులు వ్యవహరించారు. లంచం తీసుకుంటున్న సమయంలోనే అధికారిని పట్టుకుని రిమాండ్‌కు తరలించారు.

లంచాలపై ప్రభుత్వం స్పష్టమైన హెచ్చరికలు ఇచ్చినా, కొంతమంది అధికారుల తీరు మారక పోవడం ఆందోళన కలిగిస్తోంది.




పట్టుబడ్డ సుధ

# ఫీజు బకాయిలు చెల్లించండి

## ట్రస్ట్ బ్యాంక్ ప్రతిపాదన విరమించుకోవాలి:ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్, జూలై 8 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కాలేజీ కోర్సుల్లో బీసీ ఎస్సీ ఎస్టీ విద్యార్థుల మూడు సంవత్సరాల ఫీజు బకాయిలు చెల్లించాలని, ట్రస్ట్ బ్యాంక్ ప్రతిపాదన విరమించుకోవాలని రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం ముఖ్యమంత్రికి ఆర్. కృష్ణయ్య లేఖ రాశాడు. విద్యార్థుల ఫీజు రియం బర్స్‌మెంట్ స్కీమ్ ఎత్తివేయాలనే కుట్రపన్నుతు న్నారని ఆరోపించారు. ఈ కుట్రలో భాగంగా టెస్ట్ బ్యాంక్ నిధి అనే సరికొత్త ప్రతిపాదన కాలేజీ యజమాన్యాల ద్వారా తెలుస్తుంది. దీన్ని ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించేది లేదన్నారు. దీనిపై తెగించి పోరాడుతామని,స్కీమును రక్షించుకుం టామని ఆయన సిఎంకు రాసిన లేఖలో పేర్కొన్నారు.



# రూ.303 కోట్లతో కంటోన్మెంట్ అభివృద్ధి

## మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్





మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎంపి ఈటల రాజేందర్

**హైదరాబాద్ (కంటోన్మెంట్), జూలై 8 ప్రభాతవార్త:** ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు సికింద్రాబాద్ ప్యాట్నీ జె.ఎస్.నుంచి శామీర్‌పేట్ వరకు చేపట్టనున్న ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంలో కంటోన్మెంట్ బోర్డు, రక్షణశాఖ స్థలాలపై రాష్ట్ర ప్రభుత్వం ద్వారా వచ్చిన 303 కోట్ల రూపా యలను రక్షణశాఖ నిధికి వెళ్లకుండా కంటోన్మెంట్ బోర్డు ప్రాంతాల అభివృద్ధికి ఖర్చు పెట్టే విధంగా కేంద్ర ప్రభుత్వం అమోదం తెలిపిందని మల్కా జిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటెల రాజేందర్ తెలిపారు. మంగళవారం బోర్డు సిఈఓ మధుకర్ నాయక్, నామినేటెడ్ మెంబర్ బానుక నర్మధ మల్లికార్జున్‌లతో ఏర్పాటు చేసిన విలేకర్ల సమా వేశంలో ఆయన మాట్లాడుతూ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి సంబంధించిన రోడ్ల విస్తరణలో కంటోన్మెంట్ బోర్డు స్థలాలపై వచ్చిన 303 కోట్లను కేంద్ర ప్రభుత్వ నిధులకు వెల్లకుండా సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డుకే ఖర్చుపెట్టే విధంగా ఆమోదం తెలిపిందన్నారు. రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్,కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిల చొరవలతో కేంద్ర ప్రభుత్వ నిధికి వెల్లకుండా మలి ్లంచడం జరిగిందన్నారు. ఈ నిధులను భూగర్భ డ్రైనేజీ, ఓపెన్ నాలా, పార్కుల సుందరీ కరణ వంటి అభివృద్ధి కార్యక్ర మాలు, మౌలిక సదుపాయాలు మెరుగపర్చడానికి నిధులు కేటా యించడం జరుగుతుందన్నారు. అదే విధంగా ఈ నిధులతో డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లు నిర్మించడానికి కూడా వెచ్చిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మోండా డివిజన్ కార్పోరేటర్ కొంతం దీపిక, కంటోన్మెంట్ బోర్డు సూపరిండెంట్లు ఎం.దేవేం దర్, ఏ. మహేందర్, సి.హెచ్.ఉమా శంకర్, బిజెపి నేతలు పిట్ల నాగేష్, బి.ఎన్.శ్రీనివాసస్, నర్సింగ్‌రావ్, కొంతం నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆషాఢం బోనాలు తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు చిహ్నం: ఎమ్మెల్సీ కోదండరాం

### జీహెచ్ఎంసీ కార్మికుల బోనాల వేడుకలలో పాల్గొన్న కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు, డిప్యూటీ మేయర్

**హైదరాబాద్ (ముషీరాబాద్), జూలై 8, ప్రభాతవార్త:** తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు చిహ్నం ఆషాడ మాస బోనాలని తెలంగాణ జనసమితి అధ్యక్షులు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటాడని, కార్మికులకు 26వేల రూపాయల వేతనం చేయటానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి మాట్లాడుతూ జీహెచ్ఎంసీలోని కార్మిక సంఘా లన్నీ ఐక్యంగా సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూని యన్ కన్వీనర్ ఆకుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు మహిళా కార్మికులు భారీగా తరలి వచ్చి, బోనాలు చెల్లించారు. ఈ



మంగళవారం జీహెచ్ఎంసీ కార్మికుల బోనాల వేడుకలలో పాల్గొన్న ఎమ్మెల్సీకోదండరాం తదితరులు

అన్నారు. మంగళవారం లోయర్‌ట్యాంక్ బండ్‌లోని కనకాల కట్టమైసమ్మ దేవాలయం వద్ద జీహెచ్ఎంసీ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూని యన్ ఆధ్వర్యంలో బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై కోదండరాం మాట్లాడుతూ జీహెచ్ఎంసీ కార్మికులకు కనీస వేతనాల పెంపుదల, తదితర సమస్యలపై ముఖ్యమంత్రిని కలిసి మాట్లాడి, పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వీ.హనుమంతరావు మాట్లాడుతూ సోనియాగాంధీ నాయకత్వంలో రేవంత్‌రెడ్డి కార్యక్రమంలో తెలంగాణ జనసమితి నగర అధ్యక్షులు ఎం.నర్సయ్య, నాయకులు మెరుగు శ్రీనివాస్‌యాదవ్, లక్ష్మీ, పల్లె వినయ్, సలీం పాషా, అరుణ్‌కుమార్, రాంచందర్, జైపాల్‌రెడ్డి, సుధాకర్, టి.ఆర్.ఎస్. నాయకులు ఎం.ఎన్. శ్రీనివాస్‌రావు, బాలకృష్ణ, ఔట్‌సోర్సింగ్ ఎంప్లా యీస్ అసోసియేషన్ అధ్యక్షులు బాలరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ జహీర్, ప్రధాన కార్యదర్శి జగదీష్, ఉపాధ్యక్షులు యాదగిరి, ఫయాజ్, బి.రాజు, జె.డి.కుమార్, బి.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల్లో దివ్యాంగులకు అవకాశం ఇవ్వాలి

## ఎంఆర్‌పిఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ


**హైదరాబాద్,జులై 8, ప్రభాతవార్త:** స్థానిక సంస్థల ఎన్నికల్లో దివ్యాంగులకు అవకాశం కల్పించాలని ఎంఆర్‌పిఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు దివ్యాంగుల ఫించన్లు పెంచుతామని హామీ ఇచ్చిందని,కానీ అమలు చేయకుండా మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రజలకు అండగా ఉండాల్సి న ప్రతిపక్షాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని,అందుకే తాము ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధమైనట్టు చెప్పారు.ఇందులో భాగంగా అన్ని రాజకీయ పార్టీల అధ్యక్షులను కలిసి మద్దతు కోరుతున్నట్టు తెలిపారు.ఈ క్రమంలోనే బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావును కలిసి వినతిపత్రం ఇచ్చామన్నారు. ప్రభుత్వంపై పోరాటంలో భాగంగా ఈ నెల 13 నుండి దివ్యాంగుల మహాగర్జన సన్నాహక సమావేశాలు జిల్లాల్లో నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆగస్టు 13న దివ్యాంగుల మహాగర్జన ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని ఎల్‌బిస్టేడియంలో ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

# గురుకులాల టైం టేబుల్ మార్పు చేయాలి

### అన్ని గురుకులాలకు ఒకే టైం టేబుల్ ఉండాలి

### గురుకుల సొసైటీల కార్యదర్శులకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య విజ్ఞప్తి

**హైదరాబాద్, జులై 8, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కొనసాగుతున్న వివిధ గురుకులాలన్నింటికీ ఒకే టైం టేబుల్ ఉండాలని కరీంనగర్-నిజామాబాద్-ఆదిలాబాద్-మెదక్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య అన్నారు. ఈ మేరకు ఎమ్మెల్సీ మంగవారం బిసి, ఎస్సీ గురుకుల సొసైటీల కార్యదర్శులకు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని గురుకులాల్లోని టైం టేబుల్‌ను పునఃసమీక్షిస్తూ నూతన టైం టేబుల్‌ను అమలు చేయాలని కరీంనగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య మంగళవారం మసాబ్ ట్యాంక్‌లోని దామోదరం సంజీవయ్య సంక్షేమ భవన్‌లో మహాత్మా జ్యోతిబాపూలే వెనుకబడిన గురుకు లాల సెక్రటరీ సైదులు, సాంఘిక సంక్షేమ గురుకులాల సెక్రటరీ అలుగు వర్షినిని కలిసి విజ్ఞప్తి చేసినట్టు తెలిపారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ గురుకులాల సమయ సారిని గూర్చి గతంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలిసి విజ్ఞప్తి చేసిన సందర్భంలో అన్ని గురుకులాల కార్యదర్శుల పరిశీలనకు పంపించి తగిన నిర్ణయం తీసుకుంటామని చెప్పారని.. ఇదే విషయాన్ని ట్రైబ్ చైర్మన్ సైదులు, సోషల్ వెల్ఫేర్ సెక్రెటరీ అలుగు వర్షిని దృష్టికి తీసుకు వెళ్లినట్టు తెలిపారు. వారు సానుకూలంగా స్పందిస్తూ తగిన నిర్ణయం తీసుకుంటామని తెలియజేసినట్టు ఎమ్మెల్సీ చెప్పారు. సాంఘిక సంక్షేమ గురుకులాలలో కామన్ స్టాఫ్ ప్యాట్రన్ అమలు చేయాలని, కామన్ ప్రమోషన్ ఛానెల్ ఉండేలా చూడాలని ప్రాతినిధ్యం చేయగా అందుకు ఎస్సీ గురుకుల సొసైటీ సెక్రటరీ సానుకులంగా స్పందించినట్టు ఎమ్మెల్సీ మల్క కొమురయ్య తెలిపారు.



# తెలంగాణ అసెంబ్లీని సందర్శించిన మేఘాలయ సభ్యుల బృందం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూలై8:** మేఘాలయ రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యేల బృందం మంగళవారం తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీని సందర్శించారు. హైదరాబాద్ లోని అసెంబ్లీ కమిటీ హాల్‌లో మేఘాలయ రాష్ట్ర బృందానికి పిఏసి చైర్మన్ ఆర్కెపూడి గాంధీతో కలిసి మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్వాగతం పలికారు. అనంతరం వారితో సమావేశమై తెలంగాణ,రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల గురించి సభ్యులకు వివరించారు. అసెంబ్లీ నిర్వహించే విధానంతో పాటు, అసెంబ్లీ లో ప్రజా సమస్యల్ని పరిష్కరించడానికి చేసే చట్టాలను రాష్ట్రంలో అమలవుతున్న ప్రజా సంక్షేమ పథకాలను, రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి గురించి వారికి మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి వివరించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం, ప్రత్యేక రాష్ట్రం ఉద్దేశ్యాలను, తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఔన్నత్యం గురించి మేఘాలయ అసెంబ్లీ సభ్యుల బృందానికి ఆయన వివరించారు. మహబూబ్ నగర్ నియోజకవర్గంలో "విద్యా నిధి" ఏర్పాటు, మహబూబ్ నగర్ ఫస్ట్ లక్ష్యాల ను, నిరుద్యోగ యువతకు ఇచ్చే ఉచిత కోచింగ్, నైపుణ్య శిక్షణ సెంటర్ గురించి కూడా వారికి వివరించారు. ఈ సందర్భంగా మేఘాలయ అసెంబ్లీ సభ్యుల బృందం అసెంబ్లీ సమావేశాల గురించి, ఇక్కడ జరుగుతున్న అభివృద్ధి గురించి, మహబూబ్ నగర్ విద్యా నిధి గురించి సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మేఘాలయ రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ చార్లెస్ పిన్గ్రోప్, ఎమ్మెల్యేలులహ్మాన్ రింబుల్, రూపా లీ. మార్క్, తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ కార్యదర్శి నర్సింహా చార్యులు తదితరులు పాల్గొన్నారు.

# సిఎం ప్రజావాణిలో 297 దరఖాస్తులు

**హైదరాబాద్ (బేగంపేట), జులై 8,ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన సీఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 297దరఖాస్తులు అం దాయి.వీటిలో పంచాయితీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కు సంబంధించి 69దరఖాస్తులు,రెవెన్యూ శాఖకు సంబంధించి 48దరఖాస్తులు,విద్యుత్ శాఖకు సంబంధించి 33దరఖాస్తులు, పౌరస రఫరాల శాఖకు సంబంధించి 07దరఖాస్తులు, ఇందిరమ్మ ఇండ్ల కోసం 45దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 95దం ఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. సీఎం ప్రజావాణీ ఇంచార్జి,రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ డా.జీ.చిన్నారెడ్డి,స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్‌లు దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలు పరిష్కరించారు.మైనారిటీ గురుకుల పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సర్వీస్ సమస్యలు పరిష్కారం కావడంతో వారంతా ప్రజాభవన్‌కు వచ్చి చిన్నారెడ్డి, దివ్యలకు ధన్యవాదాలు తెలియజేసారు.



## ప్రజావాణిని సందర్శించిన మధ్యప్రదేశ్ డిప్యూటీ కలెక్టర్ల బృందం

**బేగంపేట జులై 8,ప్రభాతవార్త:** జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రవాసీ ప్రజావాణీని మధ్య ప్రదేశ్ రాష్ట్ర డిప్యూటీ కలెక్టర్ల బృందం సందర్శించింది.సీఎం ప్రజావాణీ ప్రవాసీ ప్రజావాణీ పనితీరు చాలా బాగుందని ఇలాంటి విధానాన్ని మధ్యప్రదేశ్ రాష్ట్రంలోనూ అమలు చేసేందుకు తమ రాష్ట్ర ఉన్నత అధికా రులకు సిఫార్సు చేస్తామని డిప్యూటీ కలెక్టర్లు తెలిపారు.ఈ సందర్భంగా మధ్యప్రదేశ్ డిప్యూటీ కలెక్టర్లు సీఎం ప్రజావాణీ ఇంచార్జి ,రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డా.జి. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్‌లతో భేటి అయ్యారు.

సీఎం ప్రజావాణీ గురించి వారు డిప్యూటీ కలెక్టర్లకు వివరించారు. సీఎం ప్రజావాణీ సమస్యల పరిష్కార వేదిక అని ఇతర రాష్ట్రాలకు స్ఫూర్తినిచ్చే కార్యక్రమం అని మధ్యప్రదేశ్ డిప్యూటీ కలెక్టర్లు పేర్కొన్నారు.

# రాష్ట్రంలో 8జిల్లాల్లో పామాయిల్ ఇండస్ట్రీలు

**హైదరాబాద్, జూలై 8, ప్రభాతవార్త:** తెలంగాణ లోని ఎనిమిది జిల్లాల్లో పామాయిల్ ఇండస్ట్రీలను ఏర్పాటు చేయాలని ఉద్యాన శాఖ నిర్ణయించింది. ఇందుకు అనుగుణంగా ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా అనుకూలమైన జిల్లాల్లో ఆయిల్‌పామ్ సాగుకు ప్రణాళికను రూపొందిం చింది. అందుకు అనుగుణంగా జిల్లాల వారీగా లక్ష్యాలను నిర్ధారించింది. రాష్ట్రంలోనే అత్యధి కంగా ఖమ్మం జిల్లాలో 13 వేల ఎకరాల్లోను, అత్యల్పంగా ఆసిఫాబాద్ జిల్లాలో ఆయిల్‌పామ్ సాగును చేపట్టాలని లక్ష్యాంగా కలిగి ఉంది. తెలంగాణలో అధికారులు నిర్ధారించిన ఆయిల్ పామ్ సాగు లక్ష్యాలు ఈ విధంగా ఉన్నాయి. ఖమ్మం జిల్లాలో 13 వేల ఎకరాల్లోను, కొత్తగూడెంలో 11 వేల ఎకరాలు, నల్లగొండలో 6,700 ఎకరాలు, మహబూబా బాద్‌ల 5,000 ఎకరాలు, సిద్ధిపేట్‌లో 4,800 ఎకరాలు, సూర్యాపేట్‌లో 4,800 ఎకరాలు, నిర్మల్‌లో 4,200 ఎకరాలు, జగిత్యాలలలో 3,850 ఎకరాలు, వరంగల్‌లో 3,800 ఎకరాలు, భువనగిరిలో 3,500 ఎకరాలు, జనగామ్‌లో 3,400 ఎకరాలు, నాగర్‌కర్నూల్ జిల్లాలో 3,000 ఎకరాల్లోనూ ఆయిల్‌పామ్‌ను సాగు చేయాలని లక్ష్యాలను నిర్ణయించింది.

# బిజెపి సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలి

## అధికార ప్రతినిధులకు దిశానిర్దేశం చేసిన రామచందర్‌రావు

**హైదరాబాద్,జులై 8, ప్రభాతవార్త :** భారతీయ జనతా పార్టీ సిద్ధాంతాలను, కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో పార్టీ అధికార ప్రతినిధులదే కీలకపాత్ర అని బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు తెలిపారు.మంగళవారం భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో ఆయన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధులతో సమావేశమ య్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ చేపట్టే కార్యక్రమాలతో పాటు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై బిజెపి పోరాటాలను సమర్థంగా ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని ఆయన సూచించారు.తాను కూడా గతంలో బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధిగా బాధ్య తలు నిర్వహించానని గుర్తు చేసిన రాంచందర్ రావు తాను కూడా గతంలో బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధిగా బాధ్యతలు నిర్వహించానని గుర్తు చేసిన రాంచందర్ రావు గారు, ఆ అనుభవం తమ భుజాలపై ఉన్న బాధ్యత ప్రాముఖ్యతను మరింత లోతుగా అర్థం చేసుకునేలా చేసిందని పేర్కొన్నారు.ఈ సమావేశంలో బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. కాసం వెంకటేశ్వర్లు ,రాష్ట్ర కార్యదర్శి డా. ఎస్. ప్రకాష్ రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధులు పాల్గొన్నారు.

## మీ టికెట్ యాప్‌తో తెలంగాణ పురావస్తు మ్యూజియం పర్యటనలకు కొత్త శకం

### మంత్రి శ్రీధర్ బాబు

**హైదరాబాద్,జులై 8, ప్రభాతవార్త :** మీ టికెట్ మొబైల్ యాప్ తెలంగాణ రాష్ట్రంలోని అన్ని పురావస్తు మ్యూజియమ్‌లను ఒకే వేదికపైకి తీసుకొచ్చి సందర్శన అనుభవాన్ని మార్చేసిందని ఐటి ,పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు ఒక ప్రకనలో తెలిపారు. కరీంనగర్‌లోని గాంధీ సెంటెనరీ మ్యూజియం, హైదరాబాద్‌లోని కులీ కుతుబ్ షాహీ సమాధి వంటి కొత్త ఆకర్షణలు యాప్‌లో చేరినట్లు తెలిపారు.ఈ సంవత్సరం జనవరి 8, 2025న ప్రారంభమైన ఈ యాప్ 80,000కి పైగా డౌన్‌లోడ్‌లు,1.7 కోట్లకు పైగా లావాదేవీలు సాధించినట్లు తెలిపారు.ఈ యాప్ నగదు రహిత,క్యూలు లేని టికెటింగ్ అనుభవాన్నిఅందిస్తుందన్నారు.వరంగల్,నల్గొం డలోని జిల్లా పురావస్తు మ్యూజియమ్‌లు, జోగులాంబ గద్వాల్‌లోని ఆలంపూర్ సైట్ మ్యూజియం, హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర పురావస్తు మ్యూజియం కూడా యాప్‌లో చేరినట్లు తెలిపారు.యూజర్లు మ్యూజియం వివరాలు, సమయాలు తెలుసుకొని, ముందస్తు టికెట్లు బుక్ చేసుకోవచ్చన్నారు.ఈ యాప్‌తెలం గాణ సంపన్న పురావస్తు వారసత్వాన్ని సులభతరం చేస్తుందని,మరిన్ని ఆకర్షణలు త్వరలో జోడిస్తామన్నారు.ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ) పరిధిలోని సలార్‌జంగ్ మ్యూజియం, చార్మినార్, గోల్కొండ కోట, వరంగల్ కోట యాప్‌లో చేరనున్నట్లు తెలిపారు. కాళేశ్వరం,బాసర, యాదాద్రివంటి ఆధ్యాత్మిక సర్యాటక్‌ల కోసం తెలంగాణ టూరిజం ప్యాకేజీలు కూడా ప్లాన్ చేస్తున్నామన్నారు.మీ టికెట్ సాంస్కృతిక అన్వేషణను మెరుగు పరుస్తుందని,తెలంగాణలో ప్రజా సేవల యాక్సెస్‌ను విస్తరించడమే దీని లక్ష్యమన్నారు.

## కుడో ప్రపంచ కప్‌లో భారత్ అథ్లెట్

# సోహైల్‌కు రజతం



**న్యూఢిల్లీ:** కుడో ప్రపంచ కప్-2025లో పురుషుల 250 పి విభాగంలో రజత పతకాన్ని సాధించడం ద్వారా భారత్‌కు చెందిన సోహైల్ ఖాన్ చరిత్ర సృష్టించాడు, ప్రపంచ ఈవెంట్‌లో సీనియర్ పురుషుల విభాగంలో భారతదేశం యొక్క అత్యుత్తమ ముగింపును నమోదు చేశాడు. బల్గేరియాలో జరిగిన ఈ ప్రతిష్టాత్మక టోర్నమెంట్‌లో అద్భుత ప్రదర్శన కనపరిచి పోరు సాగించి చివరకు రజత పతకాన్ని దక్కించుకున్నారు. సోహైల్ తన రౌండ్ ఆఫ్ 16లో పాకిస్తాన్‌కు చెందిన అబ్దుల్లాతో జరిగిన మ్యాచ్‌లో తన ప్రచారాన్ని ప్రారంభించాడు. కానీ ప్రత్యర్థి బరువు అవసరాన్ని తీర్చడంలో విఫలమైన తర్వాత వాకోవర్ ద్వారా ముందుకు సాగాడు. క్వార్టర్ ఫైనల్లో, బల్గేరియాకు చెందిన రుసేవ్ రాడోస్లావ్‌పై 1-0 తేడాతో విజయం సాధించడానికి సోహైల్ తీవ్రంగా పోరాడాడు. కుడో ఇంటర్నేషనల్ ఫెడరేషన్ విడుదల చేసిన అధికారిక ప్రపంచ ర్యాంకింగ్స్ ఆధారంగా, ఎమ్ 250 విభాగంలో 12వ సీడ్‌గా సోహైల్ ఈ టోర్నమెంట్‌లోకి ప్రవేశించాడు. జాతీయ మరియు అంతర్జాతీయ స్థాయిలో అతని స్థిరమైన ప్రదర్శనలు అతనికి ఈ స్థానాన్ని సంపాదించడానికి సహాయపడ్డాయి. ఈ టోర్నమెంట్‌లో ప్రపంచవ్యాప్తంగా అగ్రశ్రేణి కుడో అథ్లెట్లు పాల్గొన్నారు.

# మహిళల ప్రపంచ కప్‌లో వంతిక, పద్మిని, నందిధా గెలుపు




**న్యూఢిల్లీ:** మహిళల ప్రపంచ కప్ 2025లో భారత్ గ్రాండ్ మాస్టర్లు వంతిక, పద్మిని విజయాన్ని సాధించి మలి రౌండ్‌కు చేరుకున్నారు. జార్జియాలోని బటుమీలో జరిగిన 2025 మహిళల చెస్ ప్రపంచ కప్‌లో రెండవ రౌండ్‌కు వెళ్లేందుకు భారత్‌కు చెందిన వంటికా అగర్వాల్, పద్మిని రౌట్ మరియు శిజు నందిధా తమ తమ గేమ్‌లలో విజయాలను నమోదు చేసుకున్నారు. అంతకుముందు రోజు బ్లాక్ పావులతో డ్రాగా ముగిసిన అగర్వాల్, తుర్క్మెనిస్తాన్‌కు చెందిన లాలా షోహ్రాడోవాను కేవలం 27 కదలికలలో సులభంగా ఓడించి నాకౌట్ పోటీలో రెండవ రౌండ్‌లో తన స్థానాన్ని భద్రపరచుకుంది. అలాగే మొదటి రౌండ్‌లో చైనాకు చెందిన లాన్లిన్ జాంగ్‌ను ఓడించి వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది. మరోవైపు, నందిదా పివి కష్టపడి పనిచేయవలసి వచ్చింది. ప్రత్యర్థి అనాహి ఓర్టిజ్ చేసిన ఒక చిన్న పొరపాటు వల్ల నందిదా దానిని సద్వినియోగం చేసుకుని, టోర్నమెంట్‌లో మరింత ముందుకు సాగడానికి మొదటి రౌండ్‌లో రెండు విజయాలను నమోదు చేసింది. నందిదా తదుపరి రెండవ రౌండ్‌లో అనుభవజ్ఞురాలైన హారిక ద్రోణవల్లితో తలపడనుంది, మరోచోట, ప్రియాంక కె మొదటి రౌండ్‌లో టైబ్రేక్ సాధించాలంటే హంగేరికి చెందిన గాల్ జ్సోకాపై తప్పక గెలవాల్సిన విజయాన్ని నమోదు చేసింది. తొలి గేమ్‌లో బ్లాక్ పావులతో ఓడిపోయిన ప్రియాంక, రెండో గేమ్‌లో తిరిగి పోరాడి, రెండో గేమ్‌లో 34 ఎత్తుగడల్లో విజయం సాధించింది. ఈ విజయం ప్రియాంక మొదటి రౌండ్‌లో స్కోరును 1-1తో సమం చేయడానికి మరియు జ్సోకాపై టైబ్రేక్‌ను సాధించడానికి సహాయపడింది. కిరణ్ మొహంతి క్రాష్ అవుట్ ఇంతలో, కిరణ్ మొహంతి డ్రాతో సరిపెట్టుకుని, 2025 మహిళల చెస్ ప్రపంచ కప్‌లో మొదటి రౌండ్‌లోనే నిష్క్రమించిన ఏకైక భారతీయురాలిగా నిలిచింది.

# ఇంగ్లండ్ సిరీస్‌లో ఈక్వేషన్స్ సక్సెస్




## ఛేజింగ్స్‌తో 58 యేళ్ల చరిత్రాత్మక గెలుపు

**న్యూఢిల్లీ:** టీమిండియా విషయంలో భారత్ క్రికెట్ బోర్డు ఈక్వేషన్లు విజయవంతం అయ్యాయి. కీలక మార్పులతోనే ఇంగ్లండ్ గడ్డ ఎడ్జ్‌బాస్టన్‌లో 58 ఏళ్ల తర్వాత భారత్‌కు చారిత్రాత్మక విజయం సాధ్యమైంది. ఇదే సమయంలో వరల్డ్ టెస్టు చాంపియన్ పాయింట్ల పట్టికలో మెరుగైన చోటు దక్కింది. దీని వెనుక వ్యూహాలు, సరైన ప్లేయింగ్ ఎలెవన్ సెలక్షన్, ఆకాష్ దీప్, సిరాజ్ బౌలింగ్, గిల్ అద్భుత బ్యాటింగ్ వంటి కారణాలు ఉన్నాయి. సరైన ఆటగాళ్ళ ఎంపిక గెలుపునకు దోహదపడింది. కెప్టెన్ శుభమన్ గిల్, కోచ్ గౌతమ్ గంభీర్ రెండో టెస్టు కోసం బెస్ట్ ప్లేయింగ్ ఎలెవన్‌ను సెలక్ట్ చేశారు. జస్ప్రీత్ బుమ్రా లేనప్పటికీ కెప్టెన్, కోచ్ ఆకాష్ దీప్‌ను ఒక అద్భుతమైన బౌలర్‌గా జట్టులో చేర్చారు.

అలాగే, సాయి సుదర్శన్‌కు బదులుగా వాషింగ్టన్ సుందర్‌కు అవకాశం ఇచ్చారు. ఇది టీమిండియాకు బాగా కలిసొచ్చింది. అలాగే ఆకాష్ దీప్, సిరాజ్ బౌలింగ్: భారత్ ఈ చారిత్రాత్మక విజయంలో ఫాస్ట్ బౌలర్లు ఆకాష్ దీప్, మహ్మద్ సిరాజ్‌లది పెద్ద పాత్ర. బ్యాటింగ్‌కు అనుకూలమైన పిచ్‌పై కూడా సిరాజ్, ఆకాష్ అద్భుతమైన బౌలింగ్ చేశారు. సిరాజ్ మొదటి ఇన్నింగ్స్‌లో 5 వికెట్లు, సిరాజ్ మొత్తం 6 వికెట్లు, ఆకాష్ మొదటి ఇన్నింగ్స్‌లో 4 వికెట్లు తీశాడు. ఆ తర్వాత రెండో ఇన్నింగ్స్‌లో ఆకాష్ మళ్ళీ 6 వికెట్లు తీయగా, సిరాజ్‌కు ఒక వికెట్ లభించింది. ఇక జట్టు విజయానికి కెప్టెన్ గిల్ తన బ్యాటింగ్‌తో బలమైన పునాది వేశాడు. భారత మొదటి ఇన్నింగ్స్‌లో 587 పరుగులు చేసింది. గిల్ మొదటి ఇన్నింగ్స్‌లో అద్భుతమైన డబుల్ సెంచరీ (269 పరుగులు) సాధించాడు. ఆ తర్వాత రెండో ఇన్నింగ్స్‌లో కూడా గిల్ సెంచరీ (161 పరుగులు) బాది జట్టును పటిష్టమైన స్థితికి చేర్చాడు.

గిల్ ఈ అద్భుతమైన ఇన్నింగ్స్‌ల కారణంగా భారత్ ఇంగ్లాండ్ ముందు 608 భారీ టార్గెట్ ఉంచగలిగింది. ఇంగ్లాండ్ టెస్టు సిరీస్‌తోనే భారత ప్రపంచ టెస్టు ఛాంపియన్ షిప్-2025-27 కొత్త సైకిల్ మొదలైంది. రెండో మ్యాచ్‌లో విజయం భారత్ పాయింట్ల పట్టికలో నాలుగు స్థానాలు ఎగబాకి మూడో స్థానానికి చేరుకుంది.

ఈ సైకిల్‌లో టీమ్‌ఇండియా రెండు మ్యాచ్‌లు ఆడింది. ఓ మ్యాచ్‌లో ఓడిపోగా, మరో మ్యాచ్‌లో గెలిచింది. 50 గెలుపు శాతంతో పాటు 12 పాయింట్లతో భారత్ మూడో స్థానంలో ఉంది. అటు భారత్ చేతిలో రెండో టెస్టులో ఓడిపోయిన ఇంగ్లాండ్ నాలుగో స్థానానికి పడిపోయింది.

# ఐసిసి ర్యాంకింగ్స్‌లో రెండో స్థానానికి ఎగబాకిన దీప్తి

## మూడో ర్యాంక్ కొల్లగొట్టిన మంధాన

**న్యూఢిల్లీ:** భారత మహిళల జట్టు ఆల్‌రౌండర్ దీప్తి శర్మ ఐసీసీ ర్యాంకింగ్స్‌లో అదరగొట్టింది. ఇంగ్లండ్ పర్యటనలో తిప్పేస్తున్న ఆమె టీ20 బౌలర్ల ర్యాంకిగ్స్‌లో రెండో స్థానానికి దూసుకెళ్లింది. గత ఆరేళ్లుగా టాప్ 10లో ఉంటున్న దీప్తి.. ఒక ర్యాంక్ ఎగబాకి టాప్ 2గా నిలిచింది. అగ్రస్థానంలో ఉన్న పాకిస్థాన్ సదియా ఇక్బాల్‌కు, దీప్తికి 8 పాయింట్ల తేడానే ఉంది. టీమిండియా విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్న ఈ ఆల్‌రౌండర్‌కు కెరీర్లో ఇదే అత్యుత్తమ ర్యాంక్ కావడం విశేషం. పేసర్ రేణుకా సింగ్ 6లో, రాధా యాదవ్ 18లో, తెలుగమ్మాయి అరుంధతి 11 స్థానాలు మెరుగుపరచుకొని 43వ ర్యాంక్‌లో కొనసాగుతున్నారు. గత కొంత కాలంగా అంతర్జాతీయ క్రికెట్‌లో దీప్తి నిలకడగా రాణిస్తోంది. ఈమధ్యే ముక్కోణపు వన్డే సిరీస్ గెలుపొందడంలో ముఖ్య భూమిక ఆమెదే. అనంతరం ఇంగ్లండ్ పర్యటనలో కూడా దీప్తి బ్యాటుతో, బంతితో చెలరేగిపోతోంది. మూడో టీ20లో మూడు వికెట్లు తీసిన భారత స్టార్ టీ20ల్లో తన ర్యాంక్‌ను మెరుగుపరచుకుంది. ఇంగ్లండ్ బౌలర్లలో ఇసీ వాంగ్ 57వ, లారెన్ ఫిలర్ 68వ ర్యాంక్‌లో కొనసాగుతున్నారు. బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారత వైస్ కెప్టెన్ స్మృతి మంధాన టాప్ 5లో చోటు దక్కించుకుంది. ఇంగ్లండ్ గడ్డపై పరుగుల వరద పారిస్తున్న మంధాన మూడో ర్యాంక్ కైవసం చేసుకుంది. మిడిలార్డర్ బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ 12వ స్థానంలో ఉండగా ఈమధ్యే పునరాగమనం చేసిన షఫాలీ వర్మ 13, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ 15 వ స్థానంలో ఉన్నారు.




# భారీ స్కోర్‌తో దక్షిణాఫ్రికా విక్టరీ

## జింబాబ్వే క్లీన్ స్వీప్

### 367 పరుగులతో కెప్టెన్ ముల్డర్ నాటౌట్

**న్యూఢిల్లీ:** జింబాబ్వేతో జరిగిన రెండో టెస్ట్‌లో ఇన్నింగ్స్ 236 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికా ఘన విజయం సాధించింది. దీంతో రెండు టెస్టు సిరీస్‌ను 2-0 తేడాతో దక్షిణాఫ్రికా క్వీన్ స్వీప్ చేసింది. 436 పరుగుల లోటుతో ఫాలో అన్ ఆడిన జింబాబ్వే తమ రెండో ఇన్నింగ్స్‌లో 220 పరుగులకు కుప్పకూలింది. సఫారీ బౌలర్లలో కార్బిన్ బాష్ 4 వికెటు,సేమరన్ ముత్తుసామి 3 వికెట్లు, కోడీ యాసఫ్ 2 వికెట్లు సాధించారు. జింబాబ్వే బ్యాటర్లలో నిక్ వెల్చ్ 55 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలవగా, క్రెయిన్ ఎర్విన్ 49 పరుగులు, కైతానో 40 పరుగులతో ఫర్వాలేదనిపించారు. దక్షిణాఫ్రికా ఐదు వికెట్లకు 626 పరుగుల స్కోర్‌తో ఉండగా, దక్షిణాఫ్రికా కెప్టెన్ వియాన్ ముల్డర్ అజేయ ట్రిపుల్ సెంచరీతో (334 బంతుల్లో 49 ఫోర్లు, 4 సిక్సుల సాయంతో 367 పరుగులతో చెలరేగాడు. అతడితో పాటు డవిడ్ బెడింగ్హమ్ 82 పరుగులు, లుహాన్ డ్రి ప్రిటోరియన్ 78 పరుగులు, డెవాల్డ్ బ్రెవిస్ 30 పరుగులు, వెర్రిన్ 42 పరుగులతో రాణించారు. జింబాబ్వే బౌలర్లలో చివంగి, మటిగిము తలో 2 వికెట్లు తీయగా, మసకద్ద ఒక వికెట్ సాధించాడు. అనంతరం జింబాబ్వే తమ తొలి ఇన్నింగ్స్‌లో 170 పరుగులకే ఆల్ ఔట్ అయింది. ప్రోటీస్ బౌలర్లలో సుబ్రేయన్ 4 వికెట్లు, మల్డర్, యాసఫ్ తలా 2 వికెట్లు పడగొట్టారు. ఫలితంగా జింబాబ్వే ఫాలో అన్ ఆడింది. ఫాలో అన్ లో కూడా విఫలం కావడంతో అతిధ్య జట్టు ఓటమిని చవిచూడాల్సి వచ్చింది.

# వాణిజ్యం

# డాలర్ వర్సెస్ రూపాయి 85.70

**ముంబై, జూలై 8:** డాలరుతో రూపాయి మారకం విలువలు కొంతమేర పెరిగాయి. మంగళ వారం కరెన్సీ మార్కెట్ ముగిసే నాటికి డారుకు రూపాయి 16 పైసలు పెరిగి 85.70 రూపా యలుగా కొన సాగింది. గతనెల 13వ తేదీ అధ్వాన్నంగా క్షీణించిన తర్వాత కొంతమేర కోలుకున్నదని నిపుణుల అంచనా. అయితే ఇంట్రాడే ట్రేడింగ్‌లో ఒకదశలో 86 రూపాయలకు సైతం చేరుకుంది. ఆసియా కరెన్సీలతో పోలిస్తే భారత్ రూపాయి కొంతమేర రికవరీ అయింది. ముడిచమురు ధరలు కొంతమేర తగ్గడం విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు అమ్మకాల వత్తిడిని తగ్గించడం వంటివి కొంతమేర కరెన్సీకి వెన్నుదన్నుగా నిలిచినట్లు ఎల్‌కెపి సెక్యూరిటీస్ ప్రతినిధి జతీన్‌త్రివేది అన్నారు. మార్కెట్ ట్రేడ్ ఒప్పం దాలు, అమెరికాతో జరిగే డీల్స్ కూడా కొంతమేర సెంటిమెంట్‌ను బలపరిచాయి. రానున్న కాలంలో కూడా రూపాయి డాలరు విలువలతో పోలిస్తే 85.25నుంచి 86 వరకూ ట్రేడ్ అవుతుందని త్రివేది అంచనావేసారు. జపాన్, దక్షిణకొరియా, మలేసియా, కజక్‌స్థాన్ వంటివి అమెరికా ఎగుమతులకు 25శాతం సుంకాలు చెల్లించాల్సి వస్తోంది. ఇండోనేసియా ఒక్కటే 32 శాతం సుంకాలు చెల్లించాల్సి ఉంటే బంగ్లాదేశ్ 35శాతం, కంబోడియా, థాయిలాండ్ 36శాతం చొప్పున సుంకాలు చెల్లించాల్సి ఉంటుంది. ఆరు దేశాల కరెన్సీలతో పోలిస్తే డాలర్‌సూచీ తాజా సుంకాలతో కొంతమేర క్షీణించింది. 97.35గా మారింది. ఈ సూచీ ఈఏడాది ఇప్పటివరకూ 10.32శాతంగానిలిచింది. త్వరలో జరిగే ఫెడ్‌రిజర్వు మినిట్స్‌పై అందరి ఫోకస్ నిలిచింది. కమో డిటీలపరంగాచూస్తే ముడిచమురు ధరలు తగ్గాయి. ఒపెక్‌ప్లస్ దేశాలకూటమి ఉత్పత్తిని పెంచాలన్న నిర్ణయంతో ముడిచమురు ధరలు దిగివచ్చాయి. బ్రెంట్‌ముడిచమురు 0.59శాతం తగ్గి బ్యారల్‌కు 69.17 రూపాయలుగా నిలిచింది. ఇక డబ్ల్యుటిఐ ముడిచమురుధరలు 0.79 శాతం క్షీణించి 67.39గా నిలిచింది.




## టాప్ 10 బిలియనీర్ల జాబితా నుంచి బిల్‌గేట్స్ అవుట్..



**న్యూఢిల్లీ, జులై 8:** ప్రపంచ కుబేరుల జాబితాలో దశాబ్దాలుగా అగ్ర స్థానాల్లో కొనసాగిన మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్, ఇప్పుడు టాప్10 జాబితాలో స్థానం కోల్పో యారు. ఆయన చేసిన భారీ దాన ధర్మాల కారణంగా సంపద గణనలో జరిగిన మార్పులతో ఈ పరిణామం చోటుచేసుకుంది. మరింత ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, ఒకప్పుడు ఆయన వద్ద సహాయకుడి గా పనిచేసి, ఆ తర్వాత మైక్రోసాఫ్ట్ సీఈవోగా బాధ్యతలు చేపట్టిన స్టీవ్ బామర్, ఇప్పుడు సంపదలో గేట్స్‌ను అధిగమిం చడం విశేషం.ప్రఖ్యాత బ్లూమ్‌బెర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ తాజాగా వెల్ల డించిన వివరాల ప్రకారం, బిల్ గేట్స్ సంపద విలువను పునఃసమీక్షించారు. ఆయన చారిటీకి ఇస్తున్న ప్రాధా న్యత, గేట్స్ ఫౌండేషన్‌కు అందిస్తున్న భారీ విరాళాలను పరిగణనలోకి తీసుకుని ఈ లెక్కింపు చేపట్టారు. ఈ సమీక్షలో భాగంగా గేట్స్ సంపద విలువ ఏకంగా 52 బిలియన్ డాలర్లు (దాదాపు 30 శాతం) తగ్గింది. దీంతో ఆయన నికర సంపద 175 బిలియన్ డాలర్ల నుంచి 124 బిలియన్ డాలర్లకు పడిపోయింది. ఫలితంగా, ప్రపంచకుబేరుల జాబితాలో 5వస్థానంలో ఉన్న ఆయన, ఏకంగా 12వ స్థానానికి పడిపోయారు. ఇదే సమయంలో 172 బిలియన్ డాలర్ల సంపదతో స్టీవ్ బామర్ 5వ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. గేట్స్ ఇప్పుడు గూగుల్ సహ వ్యవస్థాపకులు లారీ పేజ్, సెర్గీ బ్రిన్, ఎన్విడియా సీఈవో జెన్సన్ హువాంగ్, తన చిరకాల మిత్రుడు వారెన్ బఫెట్ కంటే కూడా వెనకబడిపోయారు. మే నెలలో తన బ్లాగ్‌లో రాసిన ఒక పోస్ట్‌లో బిల్ గేట్స్ తన సంపద, దాతృత్వం గురించి స్వయంగా వివరించారు. తన నికర సంపద 108 బిలియన్ డాలర్లు అని పేర్కొంటూ, రాబోయే రెండు దశాబ్దాలలో తన సంపదలో దాదాపు మొత్తాన్ని గేట్స్ ఫౌండేషన్ ద్వారా విరాళంగా ఇవ్వనున్నట్లు ప్రకటిం చారు. 2045 నాటికి ఫౌండేషన్ కార్యకలాపాలు ముగిసేలోపు సుమారు 200 బిలియన్ డాలర్లకు పైగా ఖర్చు చేస్తుందని ఆయన అంచనా వేశారు. గేట్స్ ఫౌండేషన్ వెబ్‌సైట్ ప్రకారం, డిసెంబర్ 2024 నాటికి బిల్ గేట్స్, ఆయన మాజీ భార్య మెలిండా ఫ్రెంచ్ గేట్స్ కలిసి ఫౌండేషన్‌కు 60 బిలియన్ డాలర్లు అందించారు.

## టాటా మోటార్స్ నుంచి మినీ ట్రక్కులు..

**ముంబై, జులై 8:** వాహనాల తయారీ సంస్థ టాటా మోటార్స్ తాజాగా కార్గో రవాణా కోసం ఏస్ ప్రో పేరిట 4-వీల్ మినీ ట్రక్కులను ప్రవేశపెట్టింది. దాదాపు 750 కేజీల పేలోడ్ సామర్థ్యంతో, పెట్రోల్, బై-ఫ్యుయెల్, ఎలక్ట్రిక్ వేరియంట్లలో ఈ వాహనాలు లభిస్తాయని సంస్థ వైస్ ప్రెసిడెంట్ పినాకి హాల్దార్ తెలిపారు. ఎలక్ట్రిక్ వెర్షన్ ఒకసారి ఛార్జ్ చేస్తే సుమారు 125 కిలోమీటర్ల నుంచి 155 కిలోమీటర్ల వరకు మైలేజి ఇస్తుందని పేర్కొన్నారు. మారుతున్న మార్కెట్ పరిస్థితుల నేపథ్యంలో తేలికపాటి వాణిజ్య వాహనాల పరిశ్రమ వృద్ధి ప్రస్తుతం ఒక మోస్తరుగానే ఉన్నప్పటికీ, మధ్య కాలికం,దీర్ఘకాలికంగా మెరుగ్గా ఉంటుందని హాల్దార్ చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో జాగ్వార్ ల్యాండ్ రోవర్ హోల్‌సేల్, రిటైల్ అమ్మకాలు తగ్గాయి. డీలర్లకు సరఫరా వార్షికంగా 11శాతం క్షీణించి 87,286 యూనిట్లకు పరిమిత మయ్యాయి. తొలి త్రైమాసికంలో ఉత్తర అమెరికా, యూరప్, బ్రిటన్‌లో హోల్‌సేల్ అమ్మకాలు వరుసగా 12శాతం, 14శాతం, 25శాతం తగ్గినట్లు జెఎల్ఆర్ ఒక ప్రకటనలో తెలి పింది. ఇక రిటైల్ అమ్మకాలు



15శాతం క్షీణించి 94,420 యూనిట్లుగా నమోదైనట్లు వివరించింది. సమస్యాత్మక పరిస్థితులు నెలకొన్న తరుణంలో అంచనాలకు అనుగుణంగానే అమ్మకాలు ఉన్నట్లు కంపెనీ పేర్కొంది. వారసత్వంగా వస్తున్న మోడల్స్‌ను క్రమంగా నిలిపివేసి కొత్త జాగ్వార్ మోడల్స్‌ను ప్రవేశ పెట్టనుంటటం, అమెరికాలో దిగుమతి సుంకాల వ్యవహారం కారణంగా ఏప్రిల్‌లో ఎగుమతులు తాత్కాలికంగా నిలిచిపోవడం తదితర అంశాలు విక్రయాలు తగ్గడానికి కారణమని వివరించింది.

## స్టాక్ సూచీల్లో కొనుగోళ్ల జోష్

**ముంబై, జులై 8:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మంగళవారం లాభాల్లో ముగిసాయి. ఉదయం ఫ్లాట్‌గా ప్రారంభమైన సూచీలు, చివరికి కొనుగోళ్ల మద్దతుతో లాభ పడ్డాయి. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, కోటాక్ మహీంద్రా బ్యాంకు, ఐసిఐసిఐ బ్యాంకు వంటి షేర్లు అండగా నిలిచాయి. మరోవైపు ట్రంప్ టారిఫ్‌లపై అనిశ్చితి కొనసాగుతోంది. ఇప్పటికే వివిధ దేశాలపై టారిఫ్‌లను ప్రకటించిన విషయం విదితమే. దీంతో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యహరించారు. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి బలహీన సంకేతాలతో సెన్సెక్స్ ఉదయం 83,387.03 పాయింట్ల వద్ద ప్రారంభమై రోజంతా అదే ధోరణిని కనబర చాయి. ఇంట్రాడేలో 83,320.95 పాయింట్ల వద్ద కనిష్టానికి చేరింది. సెన్సెక్స్ చివరికి 270.01 పాయింట్లు లాభపడి 83,712.51 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ కూడా 61.20 పాయింట్లు పుంజుకొని 25,522.50 పాయింట్ల వద్ద నిలిచింది. కోటాక్ మహీంద్రా బ్యాంకు, ఎటర్నల్, ఏసియన్ పెయింట్స్, ఎన్‌టిపిసి, బిఇఎల్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. టైటాన్, ట్రెంట్, యాక్సిస్ బ్యాంకు, మారుతి సుజుకి, హిందుస్థాన్ యూనిలీవర్ వంటి షేర్లు నష్టాల్లో ముగిసాయి.




## భారత్ ఫార్మారంగంపై యుఎస్ టారిఫ్ ఎఫెక్ట్!

**చెన్నై, జూలై 8:** అమెరికా సుంకాల భయంతో భారతీయ ఫార్మా కంపెనీల స్టాక్స్ మంగళవారం క్షీణించాయి. నిఫ్టీ ఫార్మా సూచీ కూడా సుమారు 1శాతం క్షీణించి 22,159 పాయింట్ల వద్దనే నిలిచింది. అరబిందోఫార్మా 3శాతం, లూపిన్ 3శాతం, డాక్టర్ రెడ్డిస్, జైడస్ లైఫ్‌సైన్సెస్ 1.6శాతం చొప్పున క్షీణించాయి. గ్రాన్యూల్స్ ఇండియా, సన్‌ఫార్మా, సిప్లా, టొరెంట్ ఫార్మా సంస్థలు ఒకటి శాతం చొప్పున క్షీణించాయి. సోమవారం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మాట్లాడుతూ సుమారు 14 దేశాలకు సుంకాలు అమలు చేస్తున్నట్లు లేఖలు రాసామని, వాటిలో కీలక వాణిజ్య భాగస్వామ్య దేశాలుకూడా ఉన్నాయన్నారు. కొత్త దిగుమతి సుంకాలు ఆగస్టు 1వ తేదీనుంచి అమలులోకి వస్తాయని, అదనపు లేఖలు కూడా మరోసారి ఈనెలలోనే రాయడం జరుగుతుందని చెప్పారు. అలాగే భారత్‌తో జరిగే వాణిజ్య ఒప్పందానికి ముందే ట్రంప్ నుంచి లేఖలు రావచ్చన్న అంచనాలు న్నాయి. ఈ సుంకాల కారణంగా వాణిజ్య విధానాల్లో మార్పులు తప్పవు. ఫార్మారంగం ఎక్కువగా ఎమెరికా ఎగుమతులపైనే ఆధారపడి కొనసాగుతుంది. 30 నుంచి 40శాతం రాబడులో అమెరికాదేవాటా. ఎక్కువసుంకాలు లాభాల మార్జిన్‌లను తగ్గిచడంతో పాటు, అమెరికా, భారత్ చర్చల పరంగా కూడా ఎక్కువ ఫోకస్ పెంచుతున్నారు.

## స్మార్ట్ డివైస్‌లతో ఆటోమేటిక్ పేమెంట్స్

**ముంబై, జులై 8:** నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పిసిఐ) యుపిఐని మరింత స్మార్ట్‌గా తీర్చిదిద్దుతోంది. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ రెడీ వెర్షన్ యుపిఐని సిద్ధం చేస్తోంది. దీని ద్వారా మనిషి అవసరం లేకుండానే ఇంట్లో ఉండే గృహోపరణాలు, వేరియబుల్స్, కనెక్టెడ్ వెహికల్స్ వాటంతట అవే చెల్లింపులు చేసేస్తాయి. అంటే రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషిన్లు, స్మార్ట్‌వాచ్‌లు కూడా ఇకపై యుపిఐ లావాదేవీలను నిర్వహించగలవు. ప్రస్తుతం మనం ఏదైనా యుపిఐ పేమెంట్ చేయాలంటే మన దగ్గర మొబైల్ ఫోన్ ఉండాల్సిందే. దానికంటే యుపిఐ ఐడి ఉంటుంది. ప్రస్తుతం యుపిఐ సర్కిల్ చెల్లింపుల వ్యవస్థ కూడా కొత్తగా అందుబాటులోకి వచ్చింది. అంటే ఒక యూజర్ బ్యాంకు ఖాతా నుంచి సెకండరీ యూజర్ కూడా చెల్లింపులు చేసే సదుపాయం అందుబాటులోకి వచ్చింది. ఆటోపేమెంట్ సదుపాయం కూడా దాదాపు ఇదే కోవలోకి వస్తుంది. ఇప్పుడు ఎన్‌పిఐసిఐ అభివృద్ధిచేస్తున్న కొత్తవ్యవస్థ కూడా మన అవసరం లేకుండా పనిచేస్తుందని కొన్ని కథనాలు పేర్కొన్నాయి. ఆయా డివైజులు కూడా వ్యక్తుల ప్రైమరీ ఖాతాలకు అనుసంధానమై ఉంటాయి. వాటికంటూ ప్రత్యేక యుపిఐ ఐడి కూడా ఉంటుంది. వన్‌టైమ్ అథంటికేషన్ ఆధారంగా ఆయా డివైజులు అనుసంధానం అవుతాయి. ఒకసారి ప్రైమరీ యూజర్ అనుమతి




తీసుకున్నాక వ్యక్తి అవసరం లేకుండానే చెల్లింపులు చేస్తాయి. ఈ యేడాది జరగబోయే గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్‌లో ఈ ఐఒటి రెడీ యుపిఐని ప్రదర్శించే అవకాశం ఉంది.



Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.